- ప్రత్యర్థి పక్షం వారికి అమ్మితే ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు
- మేము కోరిన బ్రాండ్లు తెప్పించాలి.. అడిగినంత సరుకు ఇవ్వాలి!
- ఎన్నికల వేళ ఎక్కడికక్కడ భారీగా నిల్వలు
- దుకాణాల నుంచి నేరుగా గ్రామాలకు సరఫరా
- ఇతర రాష్ట్రాల నుంచీ పెద్దఎత్తున దిగుమతి
- లిక్కర్ కోసం ఉమ్మడి జిల్లాలో రూ.100 కోట్లు వెచ్చించేందుకు సిద్ధం
- కొన్నిచోట్ల అదనంగా నాటుసారా, కల్లు

మద్యం మాకే!

ఎన్నికల ప్రచారంలో కీలక భూమిక పోషించే లిక్కర్‌పై వైసీపీ నాయకుల ఎత్తులు.. కుయుక్తులు ఆరంభమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత కూడా యథేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వారు ఈ విషయంలోనూ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు అధికారదర్పం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యాన్ని తమకే విక్రయించాలని, ప్రత్యర్థిపక్షం వారికి అమ్మితే ఖబడ్దార్ అంటూ సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. తదనుగుణంగా కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు ప్రభుత్వ దుకాణాల నుంచి నేరుగా గ్రామాలకు మద్యం పంపి నిల్వచేసే ప్రక్రియకు శ్రీకారం పలికారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు, సొంత పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం రగిలించుకునేందుకు అభ్యర్థులు మద్యాన్ని పంపిణీ చేసే విషయం జగమెరిగిన సత్యం. ఈ పర్యాయం కూడా మద్యం కోసం ఉమ్మడి జిల్లాలో రమారమి రూ.100 కోట్లకుపైన వెచ్చించేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రూ.50 కోట్ల మేర అడ్వాన్స్‌లు కూడా చెల్లించగా, కొన్నిచోట్ల అక్రమ నిల్వలు కూడా ప్రారంభమయ్యాయి.





ప్రభుత్వ దుకాణాల్లోనే అసలు తంతు

ప్రభుత్వ వైన్‌షాపుల్లో మద్యం విక్రయానికీ ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదు. పైగా ప్రభుత్వ దుకాణాలకు అవసరమైన మద్యంను తీసుకునేందుకు ముందుగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం కూడా లేదు. ఏరోజుకారోజు పెద్దమొత్తంలో ఆర్డర్ పెట్టి మద్యం తెప్పించుకొని విక్రయించుకునే అవకాశం ఉంది. దీంతో అందరి దృష్టి ఆ వైపు మళ్లింది. ఇక్కడే అధికారపార్టీ నేతలు తమ పవర్ చూపుతున్నారు. షాపుల్లో పనిచేసే ఉద్యోగులను పిలిచి మేము చెప్పిన ప్రకారం, మేము అడిగిన కంపెనీ మద్యాన్ని ఎక్కువగా తెప్పించి మేము పంపిన వ్యక్తులకే ఇవ్వాలని హుకుం జారీ చేశారు. అంతేకాక ఆ మండలంలోని ఆయా గ్రామాలకు నేరుగా సరఫరా చేయాలని కూడా కొన్నిచోట్ల ఆదేశాలు ఇచ్చారు. బెల్టుషాపులకు సరఫరా చేసినట్లే ఆయా గ్రామాల్లో మేము చెప్పిన వారికే మద్యం కేసులు చేరవేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఇటీవల ఒక వైసీపీ సమావేశంలో ఆ పార్టీ కీలక నేత 'మీ గ్రామాలకే మద్యం వస్తుంది. మద్యం దుకాణాల వారు ఇప్పటి నుంచి మే 13వ తేదీ వరకు మనం చెప్పిన వారికే విక్రయిస్తారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు జరిగిపోయాయి. నిశ్చింతగా ఉండండి' అంటూ ఆ పార్టీశ్రేణులను చెప్పడం గమనార్హం.

ప్రభుత్వ వైన్ షాపుల సిబ్బందికి వైసీపీ నేతల హుకుం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎన్నికలలో గత రెండు దశాబ్దాలుగా లిక్కర్ పాత్ర కీలకంగా మారింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు జనసమీకరణలో మద్యం ప్రభావం ఏస్థాయిలో ఉందో స్పష్టమైంది. ఇక ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, అలాగే ఆయా ప్రాంతాల్లో పార్టీశ్రేణులు నిత్యం ఓటర్లను ఆకట్టుకునే ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. అందుకోసం ఆయా పోలింగ్ కేంద్రాల వారీ మద్యం బాటిళ్ల సరఫరా చేయడం గత కొన్ని ఎలక్షన్స్ నుంచి అధికమైంది. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే.. మద్యం సేకరణకు ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ప్రయత్నాలు చేస్తునట్లు వెల్లడైంది.

ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలకు, జిల్లాతో సంబంధం ఉన్న మూడు లోక్‌సభ స్థానాలకు అధికార వైసీపీ అభ్యర్థులను ప్రకటించింది. విపక్ష తెలుగుదేశం పార్టీ దర్శి మినహా మిగిలిన అసెంబ్లీ సెగ్మెంట్‌లతోపాటు రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీ చేయడం ఖాయమైంది. దీంతో వారు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు అవసరమైన ఎన్నికల ప్రచార సామగ్రిని సమకూర్చుకోవడంతోపాటు లిక్కర్ కొనుగోలుకు పూర్తి ప్రాధాన్యం ఇచ్చారు.

ఇప్పటికే కొన్ని గ్రామాలకు మద్యం కేసులు

ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లోని గ్రామాలకు మద్యం కేసులు చేర్చి నిల్వ పెడుతున్నారు. ఆ మండలంలోని ప్రభుత్వ వైన్‌షాపుల నుంచే ఈ మద్యం గ్రామాలకు చేరి వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో నిల్వ చేస్తున్నారు. దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు మండలంలో ఈ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. కాగా ఆయా మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు ఈ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యర్థిపక్షం వారు మద్యం అడిగితే విక్రయించకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కొన్నిచోట్ల వారికి అడపాదడపా మద్యం ఇస్తున్నారు. చాలా షాపుల నుంచి వైసీపీ వారికి బహిరంగంగా మద్యం సరఫరా చేస్తూ టీడీపీ పక్షం వారికి రహస్యంగా విక్రయిస్తున్నారు. అందుకుగాను ఒక్కో మద్యం కేసుపై రూ.500 నుంచి రూ.1,000 వరకు అదనంగా వసూలు చేసి లబ్ధి పొందుతున్నారు.



ఇతర రాష్ట్రాల నుంచి కూడా..

విశ్వసనీయ సమాచారం మేరకు కొన్ని ప్రాంతాల్లో ఇతర రాష్ట్రాల మద్యం దిగుమతి ఒక క్రమపద్ధతిలో జరిగిపోయింది. ఇటు తెలంగాణ, అటు కర్ణాటక.. ఇంకోవైపు ఉత్తర భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల నుంచి ముందుగానే మద్యం సేకరించుకున్న కొందరు ప్రస్తుతం అభ్యర్థులకు అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. మేదరమెట్ల సమీపంలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు జిల్లా నలుమూలల నుంచి వెళ్లిన ప్రతి వాహనంలో మద్యం ఏరులై పారడం కనిపించింది.

స్లిప్పు చూపిస్తే సరుకు

ఆయా బార్లలో మద్యం కొనుగోలు చేసిన అభ్యర్థులు పార్టీశ్రేణులకు స్లిప్పులు ఇస్తే వాటిని చూపించి బార్ల నుంచి మద్యం తీసుకెళ్లే విధంగా ప్లాన్ చేశారు. ఈ ప్రక్రియ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కార్పొరేషన్ అయిన ఒంగోలు, మునిసిపాలిటీలు అయిన మార్కాపురం, కందుకూరు చీరాల, నగర పంచాయతీలైన గిద్దలూరు. కనిగిరి, దర్శి, చీమకుర్తి, అద్దంకి తదితర ప్రాంతాల్లో జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి కోడ్ అమల్లోకి వచ్చేవరకు బార్లకు ప్రభుత్వం అడిగినంత లిక్కర్ కూడా సరఫరా చేసింది. అయితే కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత బార్లకు ఎడాపెడా మద్యం సరఫరా చేయకుండా నియంత్రించింది.

జిల్లాలో బార్ల నిర్వాహకుల్లో అన్ని పార్టీల మద్దతుదారులు ఉన్నారు. రాజకీయంగా సంబంధం లేని వారూ ఉన్నారు. వ్యాపార వ్యవహారం కాబట్టి అధికారపార్టీ వారికి పెద్ద మొత్తంలో సరఫరా చేసినా ఇతర పార్టీల వారికి అంతో ఇంతో మద్యంను విక్రయించారు.

అధికార పార్టీ నేతల 'మందు'చూపు

లిక్కర్ కొనుగోలు విషయంలో పలుచోట్ల వైసీపీ నేతలు, అభ్యర్థులు కుయుక్తులు పన్నుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్ల యజమానులు భారీగా మద్యం తెప్పించుకొని ఆయా పార్టీలకు అమ్ముకునే అవకాశం ఉంది. అయితే బార్ల నిర్వాహకులు ముందుగా డబ్బులు కట్టి మద్యం తెచ్చుకోవాలి. అలా వచ్చిన మద్యానికి సంబంధించి రోజువారీ విక్రయించిన వివరాలను అధికారులకు చూపించాలి. దీంతో ఎన్నికల సమయంలో పోటీకి సిద్ధమని ముందే నిర్ధారించుకున్న అభ్యర్థులు కొన్ని షాపుల వారికి డబ్బులు చెల్లించి అధికమొత్తంలో లిక్కర్ తెప్పించుకోగలిగారు. అలా వచ్చిన మద్యాన్ని రోజువారీ సేవించే వారికి విక్రయిస్తున్నట్లు చూపిస్తున్న యజమానులు దాన్ని వారు ఒప్పందం కుదుర్చుకున్న అభ్యర్థులకు సరఫరా చేశారు. కొందరు బార్ల యజమానులైతే మద్యంను వారి వద్ద అక్రమంగా నిల్వ ఉంచి అభ్యర్థులు కోరిన ప్రకారం ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పశ్చిమప్రాంతంలోనూ భారీగానే కొనుగోలు

ఇప్పటి నుంచి మే 13వ తేదీ పోలింగ్ జరిగే రోజు వరకు మద్యం కోసం అభ్యర్థులు ఎంతో కొంత వెచ్చించక తప్పని పరిస్థితి నెలకొంది. ఓటింగ్‌కు చివరి వారంరోజులు పోలింగ్ కేంద్రాల వారీ మద్యం సరఫరా చేసేందుకు పార్టీలు సిద్ధమయ్యాయి. జిల్లాలోని ఒక కీలక నియోజకవర్గంలో ఒక పార్టీ రూ.4.00కోట్ల విలువైన మద్యం కొనుగోలుకు డబ్బులు చెల్లించింది. అదేసమయంలో అధికారపక్షానికి సంబంధించి రూ.6.00 కోట్ల విలువైన మద్యం సరఫరాకు ఏర్పాట్లు జరిగిపోయాయి. చివరకు అభ్యర్థుల ఎన్నికల వ్యయం తక్కువగా ఉంటుందని భావిస్తున్న పశ్చిమప్రాంతంలోని నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థి రూ.4కోట్లకుపైగా మద్యం సరఫరాకు రంగం సిద్ధం చేసుకున్నట్లు కనిపిస్తోంది. ఒక ఎస్సీ రిజర్వు నియోజకవర్గంలో అధికారపార్టీ పక్షాన రూ.3కోట్లకు, విపక్ష పార్టీ నుంచి రూ.1.65 కోట్లు మద్యానికి వెచ్చించేందుకు సిద్ధమయ్యారు.

రూ.100 కోట్ల విలువైన మద్యం సరఫరాకు సిద్ధం

నాటుసారా, కల్లు లాంటి మత్తు పానీయాలను కూడా అవకాశం ఉన్న మేరకు సేకరించి సరఫరా చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా నియోజకవర్గాల వారీ సరాసరిన ఒక్కో అభ్యర్థి రూ.3.5కోట్ల ప్రకారం మద్యం కొనుగోలుకు సిద్ధం కాగా, అధినేతల ఎన్నికల ప్రచార సభల సమయంలో సరఫరా చేసే మద్యం వ్యయం అదనం. అలా మొత్తంగా అసెంబ్లీ లేక పార్లమెంట్ అభ్యర్థుల పక్షాన ఒక్కో పార్టీ రూ.4కోట్లకు పైనే మద్యం కోసం ఖర్చుచేయనున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రధాన పార్టీలు కేవలం మద్యం కోసమే రూ.100 కోట్లు వెచ్చించబోతున్నారు.



అయ్యన్నశెట్టి సత్రం వద్ద నరికివేస్తున్న చెట్లు

కోడ్‌లో అభివృద్ధి గుర్తొచ్చిందా!

- ప్రచారంలో వైసీపీ నేతలను ప్రశ్నించిన ప్రజలు
- అప్పటికప్పుడు సొంత నిధులతో పనులు
- స్థానికులే ఖర్చుపెడుతున్నట్లు కలరింగ్
- అయ్యన్నశెట్టి సత్రం వద్ద హడావుడిగా రోడ్లు, విద్యుత్ స్తంభాలు

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 26 : ఎన్నికల వేళ అధికార పార్టీ గిమ్మిక్కులు చేస్తోంది. నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని అయ్యన్నశెట్టి సత్రం వద్ద అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనం. పనుల విషయం వైసీపీ నేతలకు కోడ్ వచ్చాక గుర్తొచ్చినట్టు ఉంది. ఇప్పటివరకు ఆ ప్రాంతంలో కనీసం రోడ్లు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి సౌకర్యం కరువయ్యాయి. అయితే దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాగునీటి సరఫరా కోసం పైపులైన్లు వేయగా, ఆతర్వాత ఆ వీధులను పట్టించుకున్న నాథుడు లేరు. తమ కాలనీలో అనేక సమస్యలు ఉన్నాయంటూ వైసీపీ నేతలు చుట్టూ తిరిగినా, ఆ ప్రాంత కార్పొరేటర్‌కు విన్నవించుకున్నా కనికరించలేదు. అయితే వైసీపీ ఎమ్మెల్యే కుటుంబసభ్యులు ఇటీవల ఆ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ ప్రాంత సమస్యలపై వారిని స్థానికులు నిలదీయగా, తప్పకుండా రోడ్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తామని అందరి ముందు హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాటి నిర్మాణం కోసం అవసరమైన నిధులు ఇస్తామని తెలిపారు. ఎవరైనా అడిగితే మీరే సొంతంగా డబ్బులు సేకరించుకుని రోడ్లు వేసుకుంటున్నామని చెప్పండని స్థానికులతో ఒప్పందం చేసుకోవడం విశేషం. కాగా ఈ విషయం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశమైంది. ఐదేళ్లపాటు అభివృద్ధి గురించి పట్టించుకోని వైసీపీ నేతలకు ఎన్నికలు వచ్చాక గుర్తొచ్చిందా? అంటూ విమర్శిస్తున్నారు. మిగతా డివిజన్లలో కూడా అలాగే రోడ్లు, స్తంభాలు, ఇతర అభివృద్ధి పనులు చేయాలంటూ ప్రచారానికి వచ్చిన వైసీపీ నేతలను అడగడానికి అందరూ సిద్ధమవుతున్నారు.

8న జిల్లాకు సాగర్ నీరు

- తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 26: జిల్లాలో తాగునీటి అవసరాల కోసం వచ్చేనెల 8వ తేదీన సాగర్ నీరు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. ఆ వెంటనే ఆయా శాఖల అధికారులు ఎస్‌ఎస్ ట్యాంకులు, చెరువులు నింపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. నీరు వచ్చేసమయంలో కాలువలపై నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో చేతిపంపుల రిపేర్లు ఉంటే వెంటనే చేయించాలన్నారు. అనంతరం అంశాల వారీగా దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌ఆలీతోపాటు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలి

జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్నందున సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తనిఖీల సందర్భంగా నగదుతోపాటు ఇతర వస్తువులు పట్టుబడితే వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. నిరంతరం చెక్‌పోస్టులను సమీప స్టేషన్ హెచ్‌వోడీ పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో శ్రీలత, ఏఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, డీటీసీ సుశీల పాల్గొన్నారు.



వచ్చేనెల 16 వరకే..

- ఓట్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణ
- యువకులతోపాటు వివిధ కారణాలతో తొలగించినవి నమోదుకు అవకాశం
- తొలగింపులకు వచ్చేవీ స్వీకరణ

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 26 : జిల్లాలో యువకులతోపాటు వివిధ కారణాలతో తొలగింపునకు గురైన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల 16వతేదీ వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. 18 ఏళ్లు పైబడిన యువతీ, యువకులతోపాటు వివిధ కారణాలతో అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో అక్రమంగా తొలగించిన వారు కూడా కొత్త ఓటును నమోదు చేసుకోవచ్చు. దరఖాస్తులను ఆన్‌లైన్‌తోపాటు మాన్యువల్‌గా బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు), తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో కూడా చేసుకోవచ్చు. ఇప్పటివరకు జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో సుమారు 6వేలకుపైగా కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తులు రాగా తొలగింపుల కోసం ఫాం-7లు వెయ్యి అందాయి. చేర్పులు, మార్పుల కోసం ఫాం-8 దరఖాస్తులు మరో వెయ్యి వరకూ వచ్చాయి. వాటిపై సంబంధిత రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. అర్హత ఉన్న వారికి సత్వరమే ఓటుహక్కు కల్పించనున్నారు.

ఓట్ల తొలగింపునకు ఈసీ అనుమతి తప్పనిసరి

ఓట్ల తొలగింపుల కోసం వచ్చే దరఖాస్తులపై విచారణ చేసి జిల్లా కేంద్రానికి పంపితే ఆ ప్రతిపాదనలు ఎన్నికల కమిషన్‌కు పంపుతారు. అక్కడ అనుమతి ఇచ్చిన తర్వాతనే వాటిని తొలగించాల్సి ఉంటుంది. చేర్పులు, మార్పుల కోసం వచ్చే దరఖాస్తులను స్థానికంగానే మార్చుకునే వెసులుబాటును ఈసీ ఇచ్చింది. నామినేషన్లకు రెండు రోజుల ముందు వరకు కొత్తగా ఓటుహక్కు నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో ఓటుహక్కును కోల్పోయిన వారితోపాటు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు తిరిగి పొందేందుకు అవకాశం లభించింది.

శిద్దాపై చెవిరెడ్డి ఒత్తిడి

- ముఖ్యమంత్రి జగన్‌తో భేటీ
- పార్టీ మారతారనే అనుమానంతో హడావుడి



(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఒంగోలు లోక్‌సభ పరిధిలో వైసీపీ అసమ్మతి నేతలను సరిచేసుకోవడం, వారిని పార్టీ మారకుండా కట్టడి చేసి లబ్ధిపొందాలనే ముమ్మర ప్రయత్నాలకు వైసీపీ ఒంగోలు లోక్‌సభ అభ్యర్థి శ్రీకారం పలికారు. తొలుత మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి, ఆపై కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, తాజాగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు విషయంలో ఆయన జోక్యం అందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒంగోలు లోక్‌సభ స్థానంపై ముందుగానే దృష్టిపెట్టిన ఆయన సీఎం జగన్మోహన్‌రెడ్డిని గుప్పిట్లో పెట్టుకొని సిటింగ్ ఎంపీ మాగుంటకు వ్యతిరేకంగా తెరవెనుక పావులు కదిపారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయిన తర్వాత ఒంగోలు లోక్‌సభ పరిధిలో వైసీపీని వీడే నాయకులందరి చుట్టూ తిరగడం ప్రారంభించారు. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి అలకపూనగా ఆయన్ను సీఎం జగన్ వద్దకు తీసుకెళ్లి నామినేటెడ్ పదవి ఇచ్చేవరకు వెంటపడ్డారు. ఆ తర్వాత కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు టీడీపీలో చేరే అవకాశం ఉందనే ప్రచారం రావడంతో హైదరాబాద్ చుట్టూ తిరిగి ఆయన్ను పట్టుకొని జగన్ వద్దకు తీసుకెళ్లారు. దానిని జగన్ పత్రికలో ఫొటోలతో ప్రచురించుకున్నారు. తాజాగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు టీడీపీలో చేరబోతున్నారని, ఆయనకు ఆపార్టీ దర్శి టికెట్ లభించే అవకాశం ఉందని, రేపోమాపో ఆయన చంద్రబాబును కలిసే అవకాశం ఉందని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం జగన్‌ను శిద్దా రాఘవరావు కలవడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. వైసీపీ లోక్‌సభ అభ్యర్థి చెవిరెడ్డే వ్యాపారపరమైన అంశాలతో శిద్దాను భయపెట్టి సీఎం వద్దకు తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. 'మళ్లీ మనదే అధికారం. మీకు మంచి పదవి వస్తుంది. పార్టీలో చురుగ్గా పనిచేయండి' అని జగన్ చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. శిద్దా ఏ ఉద్దేశంతో జగన్‌ను కలిసినా తెరవెనుక ఆయన వ్యాపారపరమైన అంశాల్లో భయపెట్టే క్రమంలోనే తంతు జరిగిందనే ప్రచారం ముమ్మరంగా ఉంది. శిద్దా సీఎంను కలిసేందుకు వెళ్లారని తెలిసిన వెనువెంటనే టీడీపీ దర్శి నియోజకవర్గంలో మరికొందరు నాయకుల పేర్లపై సర్వే ప్రారంభించింది. శిద్దా ఏ నిర్ణయం తీసుకుంటారన్న విషయం పక్కనపెడితే వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వ్యవహారశైలిని మాత్రం రాజకీయ నాయకులు చీదరించుకుంటున్నారు.

వలంటీర్లపై వేటు

వైసీపీకి మద్దతుగా పనిచేస్తున్న నలుగురు తొలగింపు

చీమకుర్తి, మార్చి 26 : ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘించి వైసీపీ కార్యక్రమాలు, ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై వేటుపడింది. మండలంలోని పి.నాయుడుపాలెంకు చెందిన వలంటీర్లు నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి, మంత్రి మేరుగ నాగార్జునకు మద్దతుగా పనిచేస్తున్నారు. గ్రామానికి చెందిన కొందరిని సోమవారం వైసీపీలో చేర్పించారు. మంత్రి సమక్షంలో జరిగిన ఆ కార్యక్రమంలో వలంటీర్లు తిరుపతిస్వామి, సుబ్రహ్మణ్యం, వెంకట్రావు పాల్గొన్నారు. వీరితోపాటు సామాజిక మాధ్యమాల్లో వైసీపీని గెలిపించాలని కోరుతూ పోస్టులు పెడుతున్న లక్ష్మణ్‌యాదవ్ అనే వలంటీర్‌ని విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో రాఘవేంద్ర తెలిపారు.



నాగార్జున కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు

ఎన్నికలకు సిద్ధమవుతున్న పోలీసు

- మూడు కంపెనీల అదనపు బలగాలు రాక
- 8,517 మంది వరకు బైండోవర్
- 90 గ్రామాలు సమస్యాత్మకంగా గుర్తింపు

ఒంగోలు(క్రైం), మార్చి 26 : సార్వత్రిక ఎన్నికలకు పోలీసులు సిద్ధమవుతున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పటిష్ట చర్యలు చేపడుతున్నారు. 90గ్రామాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఎన్నికల సందర్భంగా వివాదాలు సృష్టించే వారిపై నిఘా ఉంచారు. ఇప్పటికే 8,517 మందిని బైండోవర్ చేశారు. జిల్లాకు మూడు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చి ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఎస్పీ ముందస్తు చర్యలు చేపట్టారు. ఇటీవల గిద్దలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గిరిజన యువకుడు మునయ్య వైసీపీ వర్గీయుల చేతిలో హత్యకు గురవడంపై ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. స్వయంగా ఎస్పీ ఎస్ఈసీ ముందు హాజరై జిల్లాలో శాంతిభద్రతలపై తీసుకున్న చర్యలు, హత్యోదంతానికి కారణాలు వివరించి వచ్చారు. అనంతరం ఆయన గత ఐదు నెలలుగా రాజకీయ వివాదాలకు సంబంధించి వచ్చి కేసులు నమోదు కాని ఫిర్యాదులపై ఆరా తీశారు. అవసరమైతే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.



గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

జిల్లాలో 90 గ్రామాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 434 సమస్యాత్మక కేంద్రాలుగా పోలీసులు తేల్చారు. ఇప్పటికే మూడు కంపెనీల కేంద్ర బలగాలు ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో మకాం వేశాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించాయి. సంబంధిత పోలీసు అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించి ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

రౌడీషీటర్లపై నిఘా

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లపై పోలీసులు నిఘా ఉంచారు. ఎన్నికల సందర్భంగా గొడవలు సృష్టించేవారు, వివాదాలలో తలదూర్చే దురుసు స్వభావం గలవారిని నిఘావర్గాల ద్వారా గుర్తించి ఇప్పటికే 8,517 మందిని మండల మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయించారు. వీరిలో 1,036 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

సంబంధిత పోలీసు అధికారులదే బాధ్యత : ఎస్పీ

ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే సంబంధిత పోలీసు అధికారులే బాధ్యత వహించాలని ఎస్పీ పరమేశ్వరరెడ్డి హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండి మద్యం, గంజాయి, ఓటర్లను ప్రలోభపెట్టే సామగ్రి రవాణా కాకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికల వివాదాలపై సత్వర చర్యలు చేపట్టాలన్నారు. నిఘావర్గాల ద్వారా గ్రామాల్లోని సమాచారం ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలన్నారు.

ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే చర్యలు

ఎస్పీ హెచ్చరిక ● 887 మంది రౌడీషీటర్లపై బైండోవర్

18 చెక్ పోస్టులు ఏర్పాటు

ఒంగోలు క్రైం, మార్చి 26: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం కలిగించడమే ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో 1031 మంది రౌడీషీటర్లు ఉండగా 887 మందిని బైండోవర్ చేశామని, ఇంకా 144 మందిని బైండోవర్ చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇప్పటి వరకు రూ.1,79,95,000 నగదు, 214 గ్రాముల బంగారం, 1872లీటర్ల అక్రమ మద్యం సీజ్ చేసినట్లు తెలిపారు. ఇతర జిల్లాల నుంచి ఎవరైనా రౌడీషీటర్లు వస్తే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు చేయించి ప్రజలు ఓటు వేసేవిధంగా భరోసా కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల నియమవళి అతిక్రమిస్తే సి విజిల్ యాప్‌లో, 112 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.

మాగుంటకు పలు వర్గాల మద్దతు



ఎంపీ మాగుంటను కలిసిన నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 26 : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డికి పలు వర్గాల ప్రజలు మద్దతు ప్రకటించారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో నగరంతో పాటు పలు నియోజకర్గాలకు చెందిన వైసీపీ, టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రకటించంతో ఆయా వర్గాల ప్రజలు మాగుంటను కలిసి మద్దతు తెలిపారు. కాగా జిల్లా ఆర్‌ఎంపీల సంఘం అధ్యక్షుడు కె.మాలకొండయ్య, జిల్లా కార్యదర్శి కె.బాలచందర్, జాయింట్ సెక్రటరి పీవీ.కృష్ణారావు, డివిజనల్ సెక్రటరీ లెనిన్‌బాబు, శ్రీనివాసరావులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

సత్తా చాటిన టంగుటూరు ఎడ్లు



ప్రథమ బహుమతిని అందుకుంటున్న చేజర్ల కృష్ణ

టంగుటూరు, మార్చి 26 : కొమరోలు మండలం తిమ్మారెడ్డిపల్లె శ్రీతిరువమలనాథ వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో టంగుటూరు ఎడ్ల జత సత్తా చాటింది. మొత్తం తొమ్మిది జతల ఎడ్లు పాల్గొన్నాయి. టంగుటూరుకు చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. కోటేశ్వరరావు తరపున ఆయన ప్రతినిధి చేజర్ల కృష్ణ రూ.60వేల నగదు బహుమతిని నిర్వాహకుల నుంచి అందుకున్నారు.

పట్టపు కులస్థులు ఐక్యంగా సాగాలి



సమావేశంలో పాల్గొన్న సంఘ నాయకులు

టంగుటూరు, మార్చి 26 : పట్టపు కులస్థులు సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పట్టపు సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని సూరారెడ్డి పాలెంలో సంఘ ప్రకాశం, బాపట్ల జిల్లాల కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈసందర్భంగా వివిధ అంశాలపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వాయిల మోహనరావు, రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్.శివాజీ, ఎస్.శ్రీనివాసులు, ఎం.జకరయ్య, విజయరత్నం పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

సింగరాయకొండ, మార్చి 26 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సింగరాయకొండ, మూల గుంటపాడు, పాతసింగరాయకొండ, సోమరాజుపల్లి, కలికివాయి గ్రామాల్లో మంగళవారం పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ దాచేపల్లి రంగనాథ్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈసీ ఆదేశాలను తప్పక పాటించాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై టి.శ్రీరామ్ పాల్గొన్నారు.

ఓటింగ్ విధానంపై అవగాహన

కొండపి, మార్చి 26 : ఓటింగ్ విధానంపై మండలంలోని చోడవరంలో నోడల్ అధికారి టి.విక్టోరియారాణి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, యువత ఓటు హక్కును వినియోగించుకొనేందుకు కల్పిస్తున్న వసతులను వివరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, అంగన్‌వాడీ కార్యకర్తలు హేమలత, కరుణ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

ఒంగోలు అభ్యర్థి దామచర్ల ● వైసీపీ నుంచి భారీగా తెలుగుదేశంలో చేరిన ఎస్సీలు ● ఘనంగా గద్దలగుంటలో 'దళిత ప్రజాగళం'





పార్టీలో చేరిన వారితో అభివాదం చేస్తున్న దామచర్ల జనార్దన్, సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 26 : దళితుల సంక్షేమం, అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. నగరంలోని గద్దలగుంట నుంచి 100మందికి పైగా వైసీపీ శ్రేణులు మంగళవారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక మూడుబొమ్మల సెంటర్‌లో ఏర్పాటు చేసిన 'దళిత ప్రజాగళం' కార్యక్రమానికి కంకణాల వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన దామచర్ల మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి పెద్దపీట వేశామని, ఎస్సీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు అందించి స్వయం ఉపాధికి బాటలు వేసినట్లు చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించి దళితవాడల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ప్రత్యేకంగా నిరుద్యోగులకు ఇన్నోవా వాహనాలు అందించి వారి కుటుంబాలకు చేయూత అందించినట్లు పేర్కొన్నారు. అయితే ఒంగోలులో గడిచిన ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి జరగలేదన్నారు. కేవలం దోచుకో.. దాచుకో అన్నట్లుగా ఇక్కడి వైసీపీ నేతలు తీరు ఉందని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని, నగర అభివృద్ధిని పట్టించుకోని వైసీపీ నేతలకు తగిన గుణపాఠం పిలుపునిచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన వెంటనే టిడ్కో ఇళ్లు పూర్తి చేసి అర్హులైకు ఇస్తామని, ఇంకా ఇల్లు లేనివారు ఉంటే టిడ్కో ఇళ్లు నిర్మించి ఇస్తామని, పేదలకు 2 సెంట్లు భూమి ఇస్తామని దామచర్లహామీ ఇచ్చారు. దీంతో మహిళల నుంచి చప్పట్లతో దామచర్లకు జేజేలు పలికారు. కంకణాల వెంకటరావు మాట్లాడుతూ తనతోపాటు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు వందమందికి పైగా టీడీపీలో చేరడం సంతోషంగా ఉందని, ఈ ఎన్నికల్లో దామచర్ల గెలుపు కోసం పనిచేస్తామని తెలిపారు. కాగా వెంకటరావుతోపాటు, వైసీపీ నుంచి మద్దెల శ్రీను, మద్దెల నారాయణ, కోటి ప్రభుదాస్, లింగగుంట రామారావు, కోటి మధుబాబు, నూకతోటి నవీన్, కాకుమాను చందు, కోటి చింటు, కొప్పోలు రాఘవ మరోవందమంది టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు కొఠారి నాగేశ్వరరావు, శశికాంత్ భూషణ్, మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, బండారు మదన్, పాలూరి వెంకటేశ్వరెడ్డి, కొల్లాబత్తిన అనీల్, అంకరాజు, జెస్సీ, నత్తల కనకరావు, రాజేష్, పరై రామకోటి, కొల్లాబత్తిన బాచి తదితరులు పాల్గొన్నారు. అంతకముందు 49వ డివిజన్‌లోని సత్యనారాయణపురంలో శ్రీపెద్దమ్మతల్లి బోనాల జాతరలో దామచర్ల పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

టీడీపీ చేసిన అభివృద్ధిని వివరించండి

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా నాయకులు ప్రతి రోజు ప్రజల మధ్యకు వెళ్లి టీడీపీ చేసిన అభివృద్ధిని, అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను వివరించాలని ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ కోరారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నగర కమిటీ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు టీడీపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని, టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. సమావేశంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, టీడీపీ నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, నాయకులు పాలూరి వెంకటేశ్వరరెడ్డి, షేక్ కపిల్‌బాషా తదితరులు పాల్గొన్నారు. అంత కముందు నగరానికి చెందిన పలువురు ముస్లింలు హజ్ యాత్రకు వెళుతున్న సందర్భంగా వారిని కలిసిన దామచర్ల శుభాకాంక్షలు తెలిపారు.



హజ్ యాత్రికులతో మాట్లాడుతున్న దామచర్ల

రాష్ట్రం బాగుండాలంటే టీడీపీని గెలిపించాలి

ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్ పిలుపు ● నియోజకవర్గానికి వైసీపీ నేతలంతా వచ్చి పోయేవారే తప్ప ఒక్క పని చేయలేదని ధ్వజం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న విజయ్‌కుమార్



బీఎన్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

చీమకుర్తి, మార్చి 26: ఎస్ఎన్‌పాడు నియోజకవర్గంలో వైసీపీ తరుపున వచ్చిపోయేవారే తప్ప, ఒక్కరు కూడా ఇక్కడి ప్రజలు సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోలేదని, అలాంటి నాయకులకు ఈసారి బుద్ధి చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. తాను గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్న తనను ఈసారి ఎన్నికల్లో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని చీమకుర్తి మండలం ఏలూరివారి పాలెంలో నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లిన బీఎన్ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు గుర్తు చేయడంతోపాటు, టీడీపీ అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకానలు ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీఎన్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో అభివృద్ధికి దూరంగా, అన్ని వర్గాలపై ఆర్థికభారాలు మోపిన వైసీపీ ప్రభుత్వాన్ని శాశ్వతంగా ఇంటికి సాగనంపాలన్నారు. రాష్ట్రం బాగుండాలంటే రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి, చంద్రాబాబు సీఎంగా చేయాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేశానని తెలిపారు. వైసీపీ నుంచి ఇప్పటి వరకు పోటీ చేసిన నేతలు ఒకసారి ప్రజలు గెలిపిస్తే అభివృద్ధిని విస్మరించి, మరలా ప్రజల మధ్యకు రాలేక ఇతర నియోజకవర్గాలకు వెళుతున్నారని ఎద్దేవా చేశారు. తాను ఎప్పటికీ నియోజకవర్గం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నానని తెలిపారు. విజ్ఞులైన ఓటర్లు ఒక్కసారి టీడీపీ చేసిన అభివృద్ధిని గుర్తించాలన్నారు. తాను నియోజకవర్గ ప్రజలకు అన్నీ వేళలా అండగా ఉంటానని, తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా గ్రామంలోని ప్రజలు విజయ్‌కుమార్ హారతులతో ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో పాల్గొని బీఎన్ వెంట నడిచారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అడకా స్వాములు, మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, గోగినేని రాజా, పుట్టా బ్రహ్మయ్య, మన్నం శేషయ్య, వెంకట్రావు, యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, వేల్పుల శ్రీను, బీజేపీ నాయకులు బొడ్డపాటి వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు పల్లపు శివప్రసాద్ పాల్గొన్నారు.

25 కుటుంబాలు తెలుగుదేశంలో చేరిక

సంతనూతలపాడు: పేద, మధ్యతరగతి ప్రజల ఆశలను నెరవేర్చే కూటమి ప్రభుత్వం రాబోతోందని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడు మండలం ఎనికపాడు గ్రామంలో మంగళవారం వైసీపీకి చెందిన 25 కుటుంబాల వారు విజయ్‌కుమార్, యువ నాయకుడు బొమ్మాజి అనీల్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం బీఎన్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి నీటిమూటగా మారిందన్నారు. గత టీడీపీ పాలనలో రాష్ట్రంలోకి ఎన్నో కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు పోటీ పడి ఉద్యోగాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిర్మించిన వాటర్ ట్యాంకులు, రోడ్లు వంటివి స్పష్టంగా కన్పిస్తున్నాయని, వైసీపీ నాయకులు ఈ ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా అని విజయ్‌కుమార్ ప్రశ్నించారు. కార్యక్రమంలో రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, పుట్టా కిషోర్(ఎస్ఆర్ఐ), నాయకులు వివరం గోవిందు, పి.సాంబశివరావు, ఆర్.సురేష్, ఎం.ప్రసాద్, ఎన్.వెంకట్రావు, గోపి, వెంకట్రావు, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై వైసీపీ నాయకుడి దాడి హేయం

● తక్షణం కఠిన చర్య తీసుకోవాలి

● బ్రాహ్మణ సంఘాల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ సంఘ నాయకులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 26: కాకినాడ పెద్ద శివాలయంలో ఇద్దరు అర్చకులపై వైసీపీ నాయకుడు దాడి చేయటం అత్యంత హేయనీయమైన చర్యని, అతడిపై వెంటనే చర్య తీసుకుని అరెస్ట్ చేయాలని బ్రాహ్మణ సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం ఒంగోలు నగరం లాయర్‌పేటలో రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ టీవీ.శ్రీరామమూర్తి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ జిల్లా కోఆర్డినేటర్ కామరాజుగడ్డ కుసుమకుమారి ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అర్చకులను కాళ్లతో తన్ని భౌతిక దాడికి దిగిన వైసీపీ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువంటి దాడులు అనేకం జరిగినప్పటికీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బ్రాహ్మణులకు రక్షణ కరువైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొన్నలూరి శ్రీనివాసఫణి, ఆర్.శ్రీనివాస్, ఎస్‌పటీ.రాజేష్, యామిజాల ప్రసన్నకుమార్ శర్మ, ఎం.మారుతి, ఎస్.సుజాత, మురళి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మరోవైపు అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లంకా ప్రసన్నకుమార్ అర్చకులపై దాడిని ఖండిస్తూ ఇటువంటివి పునరావృతం అయితే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బ్రాహ్మణులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ విషయంలో బ్రాహ్మణులందరూ ఐక్యంగా ముందుకు కదలాలని పేర్కొన్నారు. అర్చకులపై వైసీపీ నాయకులు పదే పదే దాడులకు దిగటం, దేవాలయాలను ధ్వంసం చేయటం గత నాలుగున్నరేళ్లుగా పరిపాటిగా మారిందని మండిపడ్డారు. దాడిలో గాయపడిన అర్చకులకు తమ సంఘం తరపున సంఘీభావం ప్రకటిస్తున్నామని ప్రసన్నకుమార్ పేర్కొన్నారు.

అదేవిధంగా అర్చకులపై దాడిని బ్రాహ్మణ సంక్షేమ సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామరాజు మల్లిఖార్జున శర్మ, అడ్మిన్ ట్రస్టీ శివదేవుని మురళీధర శర్మలు సైతం తీవ్రంగా ఖండించారు. సర్వే జనా సుఖినోభవంతు అని సమాజహితం కోరేవారు బ్రాహ్మణులు అని, ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలని ఆశీర్వదించే అర్చకులపై దాడికి పాల్పడటం అత్యంత దారుణమని వారు విమర్శించారు. నిందితునిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ఇటువంటివి మళ్లీ జరగకుండా ఉంటాయన్నారు.

పారిశుధ్యం ఇంత అధ్వానమా..?

● సిబ్బందిపై కమిషనరు సీరియస్

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 26 : ఒంగోలు నగరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంపై నగర కమిషనరు జశ్వంతరావు సీరియస్ అయ్యారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో శానిటరీ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం పరమ అధ్వానంగా ఉందని, ప్రజల నుంచి పదేపదే ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఎన్ని హెచ్చరికలు చేసినా సిబ్బంది పనితీరులో మార్పు రావడం లేదన్నారు. ఇకపై నగరంలో పారిశుధ్యం మెరుగుపరచకుంటే కఠిన చర్యలు తప్పవని, విధులకు రాకుండా, పని చేయకుండా హాజరు వేస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు. ప్రతి ఒక్కరు విధుల్లో ఉండాల్సిందేనని, లేని పక్షంలో విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. తాను కూడా నగరంలో పారిశుధ్య పనితీరును పరిశీలిస్తానని, పనితీరులో మార్పులు రాకుంటే ఎవరినీ ఉపేక్షించేది లేదని, నగర సుందరీకరణ కోసం పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్లు షేక్ బాబ్జి, కె.ఆంజనేయులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి ఘన నివాళి



తిరుపతిస్వామి, జయమ్మ దంపతుల విగ్రహాలు

ఒంగోలు, మార్చి 23 : సర్వేరెడ్డిపాలెంలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు ముప్పరాజు తిరుపతిస్వామి వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తిరుపతిస్వామి, జయమ్మ దంపతులు విగ్రహానికి పలువురు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్నికల కోడ్‌ను విధిగా అమలు చేయాలి

టంగుటూరు, మార్చి 26 : కోడ్‌ను విధిగా అమలు చేయాలని ఆర్వో అరవకుమార్ సూచించారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ సందర్భంగా రాజకీయ పార్టీల రంగులతో ఉండే బల్లలు, వాల్ రైటింగ్స్‌పై వైట్ వాష్ చేయాలన్నారు. తహసీల్దార్ కుటుంబరావు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

చీరాల టీడీపీ అభ్యర్థిగా కొండయ్యను ప్రకటించడంపై హర్షం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 26: ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీరాల అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎంఎం.కొండయ్యాయాదవ్‌ను ప్రకటించడం పట్ల యాదవ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపీకృష్ణయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొండయ్యను చీరాల నియోజకవర్గంలోని యాదవులందరూ కలిసికట్టుగా పనిచేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గతంలో చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే జిల్లాలో యాదవులకు ఒక ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు చంద్రపాడులో రామాలయ ప్రతిష్ఠ



ప్రతిష్ఠకు సిద్ధమైన సీతారామాలయం

చీమకుర్తి, మార్చి26 : చంద్రపాడు గ్రామంలో శ్రీ సీతారామస్వామి ఆలయం జీర్ణోద్ధరణ, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య సమయంలో ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ, విమాన శిఖరం, బింబకళావాహనం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాన్ని జరుపనున్నారు. అనంతరం అన్నప్రసాద సమారాధన, సాయంత్రం శ్రీసీతారామ కళ్యాణం, మాయాబజార్ నాటక ప్రదర్శన నిర్వహిస్తారు. ప్రతిష్ఠ, పూజాది కార్యక్రమాలను టీటీడీ అర్చకస్వామి పరాంకుశం కృష్ణశాయిభట్టాచార్యులు, ఆలయ అర్చకులు ఆళగరి హనుమత్‌ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

సమాజసేవలోనే ఆత్మ సంతృప్తి



నివాళులర్పిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), మార్చి 26: తమ శక్తి కొద్దీ సమాజంలోని తోటి వారికి సేవచేయటంలోనే ఆత్మ సంతృప్తి ఉంటుందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గాంధీనగర్‌లో తీగల కాళిదాస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటుచేసిన శ్రీకాళిదాసు సేవాసమితిని ఆయన ప్రారంభించారు. సమితి నిర్వాహకులు తీగల కేదార్నాథ్, సత్యవతిలు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాంబయ్య మాట్లాడుతూ దేశభక్తునిగా, జాతీయతావాదిగా, కవి, రచయితగా, రాష్ట్రీయ స్వయం సేవక్ నాయకునిగా తీగల కాళిదాస్ ఎంతో ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారన్నారు. చెంగంశెట్టి శివరామకృష్ణ మాట్లాడుతూ కాళిదాస్ ఎన్నో మంచి రచనలు చేశారని కొనియాడారు. తీగల కేదార్నాథ్, బీజేపీ జిల్లా కార్యదర్శి తీగల సత్యవతి మాట్లాడుతూ సమితి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బి.విజయరావు, జజ్జర కృష్ణవేణి, ధనిశెట్టి పావని, రాము తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి వెన్నెముక



మాట్లాడుతున్న పేరయ్య

ఒంగోలు(కల్చరల్), మార్చి 26: యువతే దేశానికి వెన్నెముక అని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో ఉప గ్రంధపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అధ్యక్షతన జరిగిన సదస్సులో పేరయ్య మాట్లాడుతూ ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని, వాటిని ఉపయోగించటం ద్వారా పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. మంచి నాయకులను ఎన్నుకున్నప్పుడే దేశం, రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తాయని అందుకోసం యువత తమ ఓటు హక్కును తప్పనిసరిగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కె.కృష్ణవేణి, శ్యాంసన్, ఎస్.అనిల్‌బాబు, ఎం.శివకుమారి, సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 26 : గ్రామాల్లో ఒక వైపు ఎన్నికల సందడిలో మునిగి ఉంటే, మరో వైపు మంచినీటి సమస్యను అధికారులు పూర్తిగా విస్మరించారని సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.వీరభద్రాచారి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల షెడ్యూల్ పేరుతో అధికారులు, ప్రజాప్రతినిధులు మంచినీటి సమస్యను విస్మరించారన్నారు. గ్రామ పంచాయతీలలో నిధులు ఊడ్చేసిన ప్రభుత్వం సర్పంచ్‌ల చేతులను కట్టివేసిందన్నారు. ప్రభుత్వం కన్నా ప్రైవేటు మినరల్ వాటర్ సంస్థలు ప్రస్తుతం ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు జలజీవన్ మిషన్ నిధులను కోట్లాది రూపాయాలలో కమీషన్ల కోసం కాంట్రాక్టర్లతో కుమ్మక్కై. కేంద్ర ప్రభుత్వం ఇంటింటికి మంచినీరు ఆశయాన్ని నీరు కార్చుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంచినీటి ఎద్దడిని నివారించాలని కోరారు.

క్విస్ విద్యార్థుల ప్రతిభ



బైక్‌ను పరిశీలిస్తున్న సూర్యకల్యాణచక్రవర్తి

ఒంగోలు(విద్య), మార్చి 26: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఈఈఈ చివరి సంవత్సరం విద్యార్థులు గేర్ ఆధారిత సోలార్ ద్విచక్రవాహనాన్ని తయారు చేసి తమ ప్రతిభను చాటారు. ఈఈ విభాగాధిపతి బి.కాళీచంద్ర మార్గదర్శకత్వంలో విద్యార్థులు ఈ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశారు. ఈ వాహనాన్ని రివర్స్‌లో కూడా గేర్‌ను ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల వినియోగదాం పడు సంతృప్తికరమైన స్పీడ్ రేంజ్‌లో డ్రైవ్ చేయవచ్చు. హైబ్రిడ్ ఈవీ సోలార్, బ్యాటరీ కారణంగా ఎండ రోజుల్లో నిరంతరం పనిచేస్తుంది. ఈ బైక్‌లో బీఎల్‌డీసీ మోటార్, స్పీడ్ కంట్రోలర్, లిథియం అయాన్ బ్యాటరీని వినియోగించారు. విద్యార్థులు తయారు చేసిన ఈ సోలార్ ద్విచక్రవాహనాన్ని కళాశాల చైర్మన్ నిడమానూరి సూర్యకళ్యాణచక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.గాయత్రిలు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.హనుమంతరావు, విభాగాధిపతి కాళీచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



స్వామివార్ల విగ్రహాలకు అభిషేకం చేస్తున్న అర్చకులు

సంతనూతలపాడు, మార్చి 26: సంతనూతలపాడులో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మూడవ రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివార్ల విగ్రహాలకు పాల అభిషేకపూజలు చేశారు. కాగా బుధవారం కూడా స్వామివార్లకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు, అనంతరం విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని, అలాగే భక్తులకు భారీస్థాయిలో అన్నదానం జరుగుతుందని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.231

సంతనూతలపాడు, మార్చి 26: మండలంలోని పేర్నమిట్ట సమీపంలో ఒంగోలు-1వ పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.231 పలికింది. కొణిజేడు నుంచి 889 పొగాకు బేళ్లు రాగా 776 బేళ్లు అమ్ముడయ్యాయి. 97 బేళ్లు తిరస్కరణకు గురైనట్లు ఆక్షన్ సూపరింటెండెంట్ రవికాంత్ తెలిపారు. గరిష్ఠ ధర కేజీ రూ.231 పలకగా, కనిష్ఠ ధర రూ.220, సరాసరి ధర రూ.229.13 వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నాగులుప్పలపాడు మార్చి 26: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాసరావు పరిశీలించారు. అమ్మనబ్రోలు, కండ్లగుంట తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని ర్యాంప్, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతులను తనిఖీ చేశారు. అమ్మనబ్రోలులో పోలింగ్ కేంద్రానికి కేటాయించిన రైతు భరోసా కేంద్రానికి రాజకీయ పార్టీలను పోలిన రంగులను ఉండటంతో వాటిని తొలగించి కొత్త రంగులను వేయించారు. అంతేగాకుండా గ్రామంలో వివిధ రాజకీయపార్టీలకు చెందిన జెండా, జెండా స్తంభాలను పంచాయతీ సిబ్బందితో తహసీల్దార్ తొలగింపజేశారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం జాతీయ రహదారిపై చెక్‌పోస్టును తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రమోద్, సిబ్బంది పాల్గొన్నారు.

మూడుచోట్ల ముచ్చెమటలే..!

అద్దంకిలో అదుపుకాక వైసీపీ బెదిరింపులు
పర్చూరులో అసమ్మతి సైలెంట్
టీడీపీలోకి పాలోమని వలసలు
ఆమంచి కట్టడికి వ్యూహం, ఫలించిన వైనం



ఆంధ్రజ్యోతి, ఒంగోలు :

అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలలో అధికార వైసీపీ అసమ్మతులు ఏమాత్రం చల్లబడలేదు. రోజులు గడిచేకొద్ది ఆ పార్టీని కొత్త సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో ఈ మూడు నియోజకవర్గాలలోనూ వైసీపీ అభ్యర్థులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఇదే సమయంలో టీడీపీలోకి వలసలు పెరిగిపోతుండడం గమనార్హం. దీంతో అసమ్మతులలో వలసలను కట్టడి చేసేందుకు బెదిరింపు రాజకీయాలకు వైసీపీ పాల్పడుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఉన్న ఈ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇరుపార్టీల అభ్యర్థులు ప్రకటించగా వారు ప్రచార రంగంలో కూడా దూసుకుపోతున్నారు. రోజురోజుకూ టీడీపీలోకి వలసలు పెరుగుతుండగా వైసీపీలో అసమ్మతి రగడ తగ్గకపోగా రోజుకోకొత్త సమస్య ఎదురవుతోంది. పార్టీలోని అసమ్మతి నాయకులను తొలి నుంచి కట్టడి చేసేందుకు దిగినా ఇప్పటికయితే ఆశించిన ఫలితం లభించలేదు.

అదుపుకాని అద్దంకి

అద్దంకి నియోజకవర్గంలో అభ్యర్థి ఎంపికలోనే వైసీపీ అధిష్ఠానం తడబాటుకు గురైంది. అధిష్ఠాన నిర్ణయాన్ని వ్యతిరేకించిన బాచిన క్రిష్ణచైతన్యను బెదిరించి కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఆయన క్వారీలలో తనిఖీలు చేసి భారీ జరిమానాలు వేసి మూతపడే విధంగా చేశారు. చివరకు ఆయన టీడీపీలో చేరిపోవడంతో తొలి దెబ్బ తగిలింది. అనంతరం వైసీపీ అభ్యర్థి వ్యవహార శైలిని జీర్ణించుకోలేని కొందరు నాయకులు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. వలసల పర్వం ఆగకపోవడంతో కింది స్థాయి వరకు నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. అటు పోలీసు, ఇటు రెవెన్యూ, మరోవైపు మైనింగ్ అధికారులను ఉపయోగించి పార్టీని వీడే వారిపై కట్టడి ప్రయోగం చేశారు. ఇసుకను అక్రమంగా అమ్ముకోండి, గ్రానైట్‌ను అక్రమంగా రవాణా చేసుకోండి, అధికారులు అడ్డురాకుండా చూస్తామంటూ ప్రచారం చేశారు. దీంతో అక్రమ రవాణాలు జరుగుతున్నా అధికారులు ఆ వైపు చూడకుండా కట్టడి చేసుకున్నారు. ఇంకోవైపు ఎంతైనా డబ్బులు ఇస్తాం రండహో అంటూ ఊరూవాడా ప్రచారం చేశారు. ఇన్ని చేసినా ఆ పార్టీ నుంచి టీడీపీలోకి వలసలు ఆగలేదు. పైగా అసమ్మతితో సైలెంట్ అయిన వైసీపీ శ్రేణులు ఆ పార్టీ జెండా పట్టలేదు. దీంతో పోలీసుల ద్వారా బెదిరింపులకు శ్రీకారం పలికారు. చివరకు వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి బహిరంగంగా బెదిరింపు మాటలకు దిగారు. నిబంధనలు ఉల్లంఘించిన వలంటీర్లను రక్షించే పనిలో పడ్డారు. అవసరమైతే వలంటీర్లందరి చేత రాజీనామా చేయించి పార్టీ ప్రచారానికి వాడుకుంటామని ప్రకటించారు. ఇంకోవైపు మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసీపే, అప్పుడు మీ అంతు చూస్తామంటూ పరోక్ష బెదిరింపులకు దిగారు. అయినా సమన్వయంతో ముందుకు పోతున్న టీడీపీ అభ్యర్థి రవికుమార్ స్థానికంగా తన పనులు తాను చేసేస్తున్నాడు.

పర్చూరులో పెరిగిన వలసలు

పర్చూరులో మూడో కృష్ణునిగా రంగంలోకి తెచ్చిన బాలాజీకి పార్టీ శ్రేణుల నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించకుండా నాయకులను కలవడం, ఆయా కార్యక్రమాలకు ఆహ్వానం పలికిన నాయకుల ఇళ్లకు వెళ్లి ఫంక్షన్‌లలో పాల్గొంటానికే పరిమితమయ్యారు. గతంలో ఆమంచి క్రిష్ణమోహన్‌కు వ్యతిరేకంగా ఉన్న అసమ్మతి వర్గంలో ఒకరిని మినహా మిగిలిన వారంతా సైలెంట్ అయ్యారు. ఆమంచితోపాటు అంతకుముందు ఇన్‌చార్జిగా పని చేసిన డీసీఎంఎస్ చైర్మన్ రామనాథంబాబు పార్టీ కార్యక్రమాలలో కనిపించడం లేదు. మరో మాజీ ఇన్‌చార్జి గొట్టిపాటి భరత్ ఇంటికి ప్రారంభంలో వెళ్లి ఆయన ఏర్పాటు చేసిన అనుచరుల సమావేశంలో బాలాజీ పాల్గొన్నారు. ఆ తరువాత ఇక స్వగ్రామమైన యద్దనపూడిలో జరిగిన పార్టీ కార్యక్రమానికి కూడా ఆయనను ఆహ్వానించలేదు. దీనితో ఆయనతోపాటు ఆయన అనుచరులంతా అలకపాన్పు ఎక్కారు. అటుచూస్తే టీడీపీలోకి గ్రామ, వార్డు స్థాయిలో ఓటర్లపై పట్టు ఉన్న నాయకులంతా పొలోమని వలసలు పోతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ వలసల పర్వం అధికంగా ఉండడం విశేషం. ఎన్నికల ప్రణాళిక నిర్వహణలో ఆరితేరిన టీడీపీ అభ్యర్థి ఏలూరు సాంబశివరావు ఎక్కడికక్కడ పార్టీలోని పాత నాయకత్వం, కొత్తగా చేరే వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవడంలో నిమగ్నమయ్యారు.

చీరాలలో కుదుటపడని కుంపటి

చీరాల నియోజకవర్గంలో వైసీపీ నేతల ఐక్యతకు పార్టీ అధిష్ఠానం చేసిన ప్రయోగాలు ఏవీ ఫలించడం లేదు. ఆ పార్టీలో ఉన్న బీసీ వర్గానికి చెందిన మాజీ మంత్రి పాలేటి రామారావు టీడీపీలో చేరిపోయారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే ఆమంచి క్రిష్ణమోహన్‌ను పార్టీ అభ్యర్థితో సమన్వయం చేసేందుకు రంగంలోకి దిగిన కొందరు పెద్దలు చివరికి చేతులు ఎత్తివేశారు. అడపాదడపా రోజు మార్చిరోజు ఆయన నియోజకవర్గంలోని అనుచరులతో భవిష్యత్తు రాజకీయంపై మంతనాలు జరుపుతూనే ఉన్నారు. ఆమంచి స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి వచ్చే అవకాశాలు పెరిగాయి. దీంతో అధిష్ఠానం ఆయనను కట్టడి చేసేందుకు బ్రహ్మాస్త్రం ప్రయోగించింది. ఆయన, వారి బంధువుల వ్యాపార సంస్థల విద్యుత్ బకాయిలు ఉండటాన్ని వెలుగులోకి తీసింది. పార్టీ లైన్ తప్పితే విద్యుత్ లైన్ కట్ అవుతుందంటూ హెచ్చరించింది. ఇతరత్రా ఉన్న కొన్ని వ్యవహారాలను వెలుగులోకి తీసే పనిలో యంత్రాంగం పడిపోయింది. ఈ రేసులో ఆమంచి వెనక్కు తగ్గుతారా, సమరానికి సై అంటారా అనేది తేలాల్సి ఉంది. అయితే చీరాలలో తన రాజకీయ భవిష్యత్తుకు అడ్డంకిగా వచ్చిన వైసీపీ అభ్యర్థి వెంకటేష్‌ను గెలువనిచ్చే పని లేదంటూ ప్రజల్లో చెబుతున్నట్లు సమాచారం. టీడీపీ అభ్యర్థి ఎం.ఎం.కొండయ్య నియోజకవర్గంలో ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా దూసుకుపోయే చర్యల్లో ముందున్నారు.

మృతుని ఆచూకీ లభ్యం

చినగంజాం, మార్చి 26 : చినగంజాం ప్రాంతంలోని రొంపేరు బ్రిడ్జి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దుధమానియా మండలం సిదార్ గ్రామానికి చెందిన దాల్ ప్రతాప్‌సింగ్(30) అని తెలిపారు. ఎనిమిది నెలల క్రితం ప్రతాప్‌సింగ్ తన సోదరులు, గ్రామస్థులతో కలిసి తమిళనాడు రాష్ట్రంలో కూలి పనుల నిమిత్తం పరం కంపెనీకి వెళ్లినట్లు తెలిపారు. మూడు నెలల క్రితం మృతుడు మతిస్థిమితం లేక పని వద్ద నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో పనులు పూర్తి కావడంతో మృతుని అన్నదమ్ములు, గ్రామస్థులు వారి స్వగ్రామాలకు తిరిగి వెళ్లినట్లు తెలిపారు. చీరాల ఏరియా వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం వైద్యశాలలోనే మృతదేహాన్ని ఉంచినట్లు తెలిపారు. మృతుని కుటుంబసభ్యులు వస్తే వారికి మృతదేహాన్ని అప్పగించనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

చీరాలటౌన్, మార్చి 26 : ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు గాయపడిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం మార్కెట్ సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తోటవారిపాలెంకు చెందిన ఆసాది సామ్రాజ్యం ఈపూరుపాలెం సెంటర్‌లో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో రోడ్డు దాటుతుంది. ఈక్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చీరాల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు గుంటూరుకు తరలించారు. బాధితురాలి మనవడు విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు చెక్కుల చోరీ

మేదరమెట్ల , మార్చి 26 : మండలంలోని అనమనమూరు పొలాల్లో ఉన్న పొగాకు చెక్కులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం తొక్కి ఉంచిన చెక్కులను దొంగలు ఎత్తుకు వెళ్ళారని మందా ఏసోబు మంగళవారం కొరిశపాడు పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హనుమారెడ్డికి చెందిన పొలాన్ని తీసుకుని సాగు చేసుకుంటున్నారు. సోమవారం ఉదయం చెక్కులు తొక్కి వచ్చి మరునాడు వెళ్ళిచూడగా లేవని కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తాపడి దంపతులకు తీవ్రగాయాలు

పంగులూరు, మార్చి 26: మండలంలోని ముప్పవరం - పంగులూరు గ్రామాల మధ్య మంగళవారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. తూర్పుతక్కెళ్ళపాడుకు చెందిన పాలపర్తి చిన్న, అతని భార్య మహాలక్ష్మి ముప్పవరం గ్రామ సమీపం పళ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూలాగానే పళ్ళ వ్యాపారం ముగించుకుని తన ఆటోలో మిగిలిన పళ్ళు, కొబ్బరి బోండాలు వేసుకుని స్వగ్రామం బయలుదేరారు. ఆటో కోళ్ళపారం సమీపంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లి పడిపోయింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం అద్దంకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది



రాజుపాలెంలో తెరుచుకోని గ్రామ సచివాలయం

మార్టూరు, మార్చి 26 : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయం మంగళవారం ఉదయం 10.50లకు కూడా తెరుచుకోలేదు. వరుసగా మూడు రోజులు శని, ఆది, సోమవారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు కావడంతో గ్రామ సచివాలయాలు తెరుచుకోలేదు. మంగళవారం సచివాలయాలు తెరుస్తారని వివిధ పనులు నిమిత్తం రాజుపాలెం గ్రామంలో కొంత మంది సచివాలయానికి వచ్చారు. ఉదయం 10.50 గంటలకు కూడా సచివాలయం తలుపులు తెరుచుకోకపోవడంతో మంగళవారం కూడా ఏమైనా సెలవు ఉందా అని గ్రామస్థులు ఆరా తీశారు. ఆ తర్వాత ముగ్గురు గ్రామ సచివాలయ సిబ్బంది రావడంతో తలుపులు తెరుచుకున్నాయి. ఏది ఏమైనా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల సచివాలయాల్లో సమయపాలన సక్రమంగా పాటించడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

హుండీల కానుకల లెక్కింపు

అద్దంకి, మార్చి 26 : శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పది రోజులకు హుండీల కానుకల ద్వారా రూ.8,26,081 ఆదాయం వచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు. హుండీల కానులకను మంగళవారం లెక్కించారు. యూఎస్‌ఏ డాలర్లు 52, బంగారం 16 గ్రాములు, వెండి 465 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. హుండీల కానుకల లెక్కింపును ఫెస్టివల్ ఆఫీసర్ తిమ్మనాయుడు, ఈవో సుభద్ర పర్యవేక్షించారు. అలాగే, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం హుండీల కానుకలను మంగళవారం చైర్మన్ నర్రావుల కొండలరావు, ఈవో కోటిరెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. హుండీల కానుకల ద్వారా గత ఏడాది రూ.1,05,270 రాగా, ఈ ఏడాది రూ.89,350 వచ్చింది. టిక్కెట్‌ల ద్వారా గత ఏడాది రూ.1,44,700 రాగా, ఈ ఏడాది 1,15,570 వచ్చింది. గత ఏడాది కంటే రూ.44,720 ఆదాయం తగ్గింది.

ఫాం-12డీతో ఓటు వినియోగం

పామూరు, (సీఎస్‌పురం) మార్చి 26 : 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు ఫాం-12డీతో ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకోవచ్చని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నాగరాజు తెలిపారు. పార్టీ కార్యాలయంలో జనసేన కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారం 12డీ ద్వారా ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. 80 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులను గుర్తించి వారు ఇంటి వద్దనే ఓటును వేసుకునేలా కార్యకర్తలు చూడాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆంధ్రా కమిటీ సభ్యుడు మాదాసు రమేస్, జిల్లా కార్యదర్శి వై రహీముల్లా, సీఎస్‌పురం మండల అధ్యక్షుడు జానపాటి రాజు, జిల్లా ప్రోగ్రాం కమిటీ కార్యదర్శి రామిశెట్టి సునీల్‌కుమార్, ఉల్లిపాయల సుబ్బరాయుడు, మురళీకృష్ణయాదవ్, హరికృష్ణ, పీ రాంబాబు, మౌలయ్య, బీ రాంబాబు, సాయి, మల్లి పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు

దొనకొండ, మార్చి 26 : దొనకొండ నుంచి రుద్రసముద్రం వెళ్లే రహదారి సమీపంలోని యలమంద వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధుడి ఒంటిపై తెల్ల రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, ఎరుపురంగు అంచు పంచి, తెల్ల టవల్ ఉందని తెలిపారు. దొనకొండ-2 వీఆర్వో తన్నీరు హరినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వీఆర్వో జయప్రకాష్ మృతి



దర్శి, మార్చి 26 : మండలంలోని తూర్పువీరాయపాలెం వీఆర్వో దేశు జయప్రకాష్ (50) అనారోగ్యంతో మృతి చెందారు. జయప్రకాష్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలులో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయం ఆసుపత్రిలో మృతి చెందారు. మృతదేహాన్ని దర్శి తరలించగా తహసీల్దార్ జీ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ ఏ రవిశంకర్, రెవెన్యూ సిబ్బంది నివాళులర్పించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న 15 కుటుంబాలు

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి

సింగరాయకొండ, మార్చి 26 : మండలంలోని పాకల పంచాయతీ పరిధి శాంతినగర్‌లో వైసీపీకు చెందిన 15 కుటుంబాల వారు ఆపార్టీని వీడారు. మంగళవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి గృహానికి వెళ్లి ఆయన సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి స్వామి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేసిన ఏకైక పార్టీ టీడీపీనే అన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను కాంక్షించే ప్రతి ఒక్కరూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఓటేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కొండూరి సురేంద్ర, వాయిల జగజ్జీవన్, ప్రేమ్‌కుమార్, శ్రీను, మాల్యాద్రి, మార్క్‌తోపాటు పలు కుటుంబాల వారు ఉన్నారు. అనంతరం వారు ఒంగోలులో టీడీపీ సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పాకల సర్పంచ్ సైకం చంద్రశేఖర్, కాపు ఫిలిప్, రాజేష్, మహేంద్ర పాల్గొన్నారు.

పిల్లల దొంగల ముఠా కలకలం..!

- దొనకొండలో తప్పించుకున్న విద్యార్థి
- అనుకోని సంఘటనతో హడలెత్తిన తల్లిదండ్రులు



బాలుడిని విచారిస్తున్న పోలీసులు

దొనకొండ, మార్చి 26 : పిల్లలను అపహరించే ముఠా కలకలం సృష్టించిన సంఘటన మండల కేంద్రమైన దొనకొండలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి తెలిపిన వివరాల మేరకు.. దొనకొండలోని శివాజీనగర్ వీధికి చెందిన వన్నె లక్ష్మణరావు కుమారుడు ఉదయ్‌గణేష్ స్థానిక సాయి విజ్ఞాన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా రైల్వేస్టేషన్ నుంచి శివాజీనగర్ వైపు వెళ్లే దారిలో నిరుపయోగంగా ఉన్న రైల్వే క్వార్టర్స్ సందులో గుర్తు తెలియని వ్యక్తులు మంకీ క్యాప్‌లు ధరించి వ్యాన్ పెట్టుకొని కాపు కాశారు. అటువైపు వచ్చిన విద్యార్థి ఉదయ్‌గణేష్‌ను వారు పిలవగా దగ్గరకు వెళ్లి భయంతో వెనుదిరిగాడు. వెంటనే వారు వెంబడించి బాలుడిని నోరుమూసి ఎత్తుకొని వాహనం వద్దకు తీసుకెళ్లారు. ఎడమ చేతికి మిషన్ ద్వారా మత్తు ఇచ్చే ప్రయత్నం చేయబోగా పెనుగులాటలో బాలుగు తప్పించుకొని పరుగుతీశాడు. ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం తెలపగా తల్లిదండ్రులు మరికొందరు హుటాహుటీన ఆ ప్రాంతానికి చేరుకోగా వారు పారిపోయినట్లు గుర్తించారు. అనుకోని సంఘటనతో దొనకొండలోని పిల్లల తల్లిదండ్రులు హడలెత్తారు. అనుకోని ఈ సంఘటన ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఎస్‌ఐ సంపత్‌కుమార్‌కు వివరణ కోరగా సమాచారం మేరకు సంఘటన జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాల్లోని ఫుటేజీలను పరిశీలించగా, పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టగా విద్యార్థి ఉదయ్‌గణేష్ తెలిపిన ఆనవాళ్లు ఏమాత్రం లేవన్నారు. ఆ విద్యార్థి అబద్ధం చెప్పున్నట్లు స్పష్టమైందని, దీనిపై పూర్తి విచారణ చేపడతామని ఎస్‌ఐ తెలిపారు.

బాధ్యతగా పనిచేయండి..లేకుంటే తప్పుకోండి

సచివాలయ సిబ్బందికి
ఎంపీడీవో హెచ్చరిక



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో పుట్టారెడ్డి

పామూరు, మార్చి 26 : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని లేకపోతే విధుల నుంచి తప్పుకోవాలని ఎంపీడీవో పుట్టారెడ్డి హెచ్చరించారు. పామూరు గ్రామ సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని నుచ్చుపొద గ్రామానికి చెందిన లబ్ధిదారుడు కలెక్టర్‌కు ఫొటో, వీడియో క్లిప్పింగ్‌తో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ మార్కాపురం డీఎల్‌డీవో దృష్టికి తీసుకెళ్లగా మార్కాపురం డీఎల్‌డీవో ఆదేశాల మేరకు పామూరు ఎంపీడీవో 3, 4 సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పామూరు పంచాయతీ కార్యదర్శి వీ బ్రహ్మానందరెడ్డితో కలిసి మూమెంట్ రికార్డులను పరిశీలించి సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ఆగ్రహించారు. సచివాలయంలో అపరిశుభ్రంగా ఉన్న కంప్యూటర్ పరికరాలను చూచి అసంతృప్తిని వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని సూచించారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌పై వెళ్లేవారు మూ మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని మరోమారు బాధ్యతగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం పామూరుకు వస్తున్న డీఎల్‌డీవోకు సంజాయిషీ చెప్పుకోవాలని సూచించారు.

అనుమతి లేని ప్రచారాలపై సమాచారమివ్వండి

ఆర్డీవో జాన్‌ఇర్విన్



మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

కనిగిరి, మార్చి 26 : కనిగిరి ప్రాంతంలో అనుమతులు లేకుండా రాజీకీయపార్టీల నాయకులు ప్రచారాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం సచివాలయ మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చెందిన వా రికి ఇప్పటికే కొన్ని అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహించే నాయకులు వద్దకు వెళ్లి అనుమతి పత్రాన్ని తప్పనిసరిగా మహిళా పోలీసులు పరిశీలించాలన్నారు. అనుమతి లేని ప్రచారాలను వెంటనే నిలిపివేయాలన్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీలకు చెందిన గుర్తులు, రంగులు వాహనాలపై, ఇళ్లపై, వస్తువులపై, పబ్లిక్ ప్రాంతాల్లో ఉంటే వెంటనే తొలగించాలన్నారు. పార్టీ రంగులను ఉపయోగించే వారిపై కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి మహిళా పోలీసులు విధిగా రాజకీయ పార్టీల కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. కోడ్ నియమావళిని ఉల్లంఘించే వారి వివరాలను తెలయచేసే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అదేవిదంగా సీ-విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో డీఏఏ కిశోర్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఆవుల సురేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారెంటీ

కనిగిరి మండలంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కనిగిరి, మార్చి 26 : చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్‌కు గ్యారెంటీ అని టీడీపీ కనిగిరి క్లస్టర్ ఇన్‌చార్జి నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని పునుగోడు గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి అవినీతి పాలనతో దోచేసేరనానరు. అభివృద్ధి చేయడం చేతగాక ఆంధ్రాను అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టే సమర్థత, పాల న దక్షత ఉన్న నేత చంద్రబాబు ఒక్కరే అన్నారు. రాష్ట్రం కోసం, పిల్లల భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రజలు గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నవరత్నాల పేరుతో జగన్‌రెడ్డి నవ విధాలా ధరలు పెంచి పేదల నడ్డివిరిచారని ధ్వజమెత్తారు. పాలన చేగతాని నాయకులను గద్దెదింపాలన్నారు. ప్రతి మహిళ గర్వంగా ఉండేలా పథకాల్లో చంద్రబాబు మహిళకు అగ్రభాగం కల్పించి ఆర్థిక బరోసా కల్పించారన్నారు. పేదింట్లో ఎవరూ మధ్యలో విద్యను ఆపేయకూడదని ఏడాదికి రూ.15వేలు తల్లికి వందనం ద్వారా నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్నారు. ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా పథకాలన్నీ మహిళల కోసం అమలు చేయనున్నట్లు తెలిపారు. భేరిపుల్లారెడ్డి, సైకం మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

అర్చకులపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

అద్దంకి, మార్చి 26: అర్చకులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సాధికార కమిటీ, బాపట్ల జిల్లా కన్వీనర్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఆర్గనైజర్ పొన్నలూరి కిరణ్‌కుమార్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాకినాడ శివాలయంలో అర్చకులు సాయిశర్మ, విజయ్‌శర్మపై ఆలయంలో దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. అర్చకులను కాళ్ళతో తన్ని, భౌతిక దాడికి దిగిన మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. దాడికి పాల్పడ్డ నిందితుడికి మద్దతు ఇస్తున్న ఆలయ ఈవో, కాకినాడ జిల్లా దేవదాయ శాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికలలో బ్రాహ్మణులు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు.

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

- ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

రామాపురం(చీరాలటౌన్), మార్చి 26: సార్వత్రిక ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. మంగళవారం సమస్యాత్మక ప్రాంతాలైన రామాపురం, కటారిపాలెం గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. ఓటర్లకు రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే సిబ్బందికి అన్ని విధాలుగా మార్గదర్శకాలు అందజేసినట్లు చెప్పారు. ఓటర్లు వారి హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చునని చెప్పారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్పీతో పాటు బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బ్రిజ్ కిషోర్‌నేగి, చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి పిరికిపంద చర్య

● అర్చకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



బ్రాహ్మణులతో సమావేశమైన యోగేశ్వరరావు

పుల్లలచెరువు, మార్చి 26: కాకినాడ శివాలయంలో అర్చకులపై దాడి చేయడం పిరికిపంద చర్య అని బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అయ్యాలరాజు యోగేశ్వరరావు అన్నారు. అర్చకుడిపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం ఎర్రగొండపాలెం పట్టణంలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శివాలయంలో సమావేశమై దాడిని ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్చకులపై దాడులు పెరిగాయన్నారు. దాడికి పాల్పడిన వారికి మద్దతు ఇస్తున్న ఆలయ ఈవోపై కాకినాడ జిల్లా దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు కె అమరేశ్వరప్రసాద్, చెక్కిలం నాగరాజు, పాలుట్ల ఉమామహేశ్వరరావు, పాల్గొన్నారు.

గిద్దలూరులో టీడీపీదే గెలుపు

● అంతటా వైసీపీపై వ్యతిరేకత
● టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి



టీడీపీలోనికి చేరిన కార్యకర్తలను ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 26 : గిద్దలూరు నియోజకవర్గంలో ఈ సారి టీడీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నరవ పంచాయతీ పరిధిలోని బయనపల్లె గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యులు మీసాల పాపయ్య ఆధ్వర్యంలో 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న అనేక మందికి పథకాలు అందలేదన్నారు. సీఎం జగన్‌రెడ్డి ఎన్నికల ముందు ప్రచారంలో ఒకటి, అధికారంలోకి వచ్చాక చేసింది మరొకటని విమర్శించారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో మీసాల రమేష్ యాదవ్, వెలిదండ్ల బాలరంగారెడ్డి, బోయిళ్ల పోలిరెడ్డి, చింతకుంట్ల వీరయ్య, వీరమాసి భాస్కర్, దిబ్బగాండ్ల కాశన్న, కొలూరి పెద్దకాశన్న, దుగ్గెపోగు చిన్నరంగయ్య, కోవెలకుంట్ల జమాలయ్య బద్దెల రాజబాబు, బాబు, వీరమాసి పెద్దభాస్కర్, దుగ్గెపోగు దావీద్, బుజ్జి, దానం, లక్ష్మయ్య, ఆముదాల వసంత్, పోలిరెడ్డి, నరసింహులు, తదితరులు ఉన్నారు. రానున్న ఎన్నికల్లో ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు బాబాయ్, జయరామిరెడ్డి, పందన బోయిన నారాయణయాదవ్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

కడప జిల్లా ఎడ్ల హవా



బండను లాగుతున్న ఎడ్లు

గిద్దలూరు టౌన్, మార్చి 26 : శ్రీలక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల సందర్భంగా గిద్దలూరు మండలం నరవ గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీల్లో కడప జిల్లా ఎడ్లు సత్తా చాటాయి. మొదటి బహుమతి రూ.లక్షను కడప జిల్లా చౌటపల్లి గ్రామానికి చెందిన మార్తాల చంద్ర ఓబులరెడ్డి ఎడ్ల జత గెలుచుకొంది. రెండవ బహుమతి రూ.70వేలను ఇదే జిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన ఓబులరెడ్డి ఎడ్లే గెలుచుకున్నాయి. మూడవ బహుమతిని కడప జిల్లా బాలుగారిపల్లె గ్రామానికి చెందిన ఇందిరెడ్డి రమణరెడ్డి ఎడ్లజత రూ.50వేలు గెలుచుకున్నాయి. నాల్గవ బహుమతిని గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పి.ఆర్.మెమోరియల్ పులగం తిశగ్నరెడ్డి, జస్వితరెడ్డిల ఎడ్ల జత రూ.30వేలు గెలుచుకున్నాయి. రాచర్ల మండలం సత్యవోలు గ్రామానికి చెందిన బత్తుల బాలరాజు ఎడ్లజత ఐదో బహుమతి రూ.20 వేలు గెలుచుకున్నాయి. ఆరవ బహుమతి రూ.10 వేలను గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పి.ఆర్.మెమోరియల్ పులగం తిశగ్నరెడ్డి, జస్వితరెడ్డిలకు చెందిన ఎడ్ల జత గెలుచుకొంది. ఏడవ బహుమతి రూ.7 వేలను గిద్దలూరు పట్టణానికి చెందిన దుర్వేసుల నారాయణరెడ్డి ఎడ్లజత గెలుచుకొంది. రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో రెండు జతల ఎడ్లకు కన్సోలేషన్ కింద 5వేలు అందచేశారు. బహుమతులను శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు గెలుపొందిన వారికి అందచేశారు.

ట్యాంకర్‌కు ఉన్న వైసీపీ రంగు మార్చరా..?

● యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన



వైసీపీ రంగులతో తిరుగుతున్న ట్యాంకర్

కనిగిరి, మార్చి 26 : ప్రజలకు నీటిని సరఫరా చేసే ప్రైవేటు ట్యాంకర్ నిర్వాహకుడు తమ ట్రాక్టర్లకు వైసీపీ రంగులతో కూడిన ట్యాంకర్లను పట్టణంలో తిప్పుతున్నాడు. అంతేకాకుండా ఆ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేసే క్రమంలో పెద్ద సౌండుతో జగన్ పాటలను పెట్టి ప్రజలను ప్రభావితం చేస్తున్నారు. విపరీతమైన సౌండుతో వెనుక వచ్చే వాహనాలను కూడా గమనించకుండా ఆయా ట్యాంకర్లు నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ ఇబ్బందులను కూడా కల్గిస్తున్నారు. ఎన్నికల నియమావళి ఎక్కడా అమలు జరుగడం లేదనేందుకు నిదర్శనంగా ఇలాంటి ఘటనలు నిత్యం కనిగిరిలో కన్పిస్తున్నాయి. వైసీపీ రంగులతో ఉన్న ట్యాంకర్లు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పార్టీ ప్రచార రంగులపై దృష్టి సారించి కోడ్ నిబంధనలు పాటించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ముజీబ్ మృతదేహం

కురిచేడు, మార్చి 26 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పెనకగమూరు వద్ద మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. దర్శికి చెందిన ముజీబ్ (26) అనే యువకుడు తన మిత్రుడు రైలులో కురిచేడుకు వస్తున్నందున అతడిని కలిసేందుకు మోటార్ సైకిల్‌పై కురిచేడు వస్తూ ప్రమాదవశాస్తూ చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముజీబ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108కు సమాచారం ఇవ్వగా 108 పైలెట్ ఆబీద్‌వలి, ఈఎంటీ వరకుమార్ క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

ఇద్దరు టెన్త్ విద్యార్థులు అదృశ్యం

కనిగిరి, మార్చి 26 : పట్టణ సమీపంలోని కేటీఆర్ స్కూల్‌లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైనట్లు స్కూలు యాజమాన్యం స్థానిక పీఎస్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేటీఆర్ స్కూల్‌లో టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కాకర్ల అవినాష్, షేక్ కరిముల్లా మంగళవారం పరీక్షకు హాజరుకాలేదు. స్కూల్ హాస్టల్ నుంచి నేరుగా కేంద్రానికి వచ్చే విద్యార్థులు రాకపోవడంతో స్కూల్ ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్‌కు సమాచారమిచ్చారు. దీంతో ప్రిన్సిపాల్ హాస్టల్‌లో ఉంటున్న తోటి విద్యార్థులను విచారించగా, స్టడీ హవర్‌కు కూడా రాలేదని తెలిపారు. దీంతో తల్లిదండ్రులను విచారించగా ఇంటికి రాలేదని చెప్పారు. చేసేదిలేక పోలీసులకు ఫిర్యాదు చేయగా గాలింపు చర్యలు చేపట్టారు.

వెదురు బొంగుల అక్రమ రవాణా

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మరుగుదొడ్డి వద్ద అడ్డంగా వెదురుకర్ర

గిద్దలూరు, మార్చి 26 : నల్లమల అటవీ ప్రాంతం నుంచి యథేచ్ఛగా వెదురు బొంగులు అక్రమంగా రవాణా అవుతున్నాయి. వెదురు బొంగులు అక్రమ రవాణా చేసే వారు పేదలే అయినప్పటికీ రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు ఈ అక్రమ రవాణా ప్రక్రియతో ఇబ్బందులు పడుతున్నారు.

నల్లమల అటవీ ప్రాంతంలో విస్తారంగా వెదురు బొంగులు లభిస్తాయి. దిగువమెట్ట, బొగద, చలమ, సమీప తాండాల ప్రజలు అడవిలోకి వెళ్లి బొంగులు నరికి తెచ్చుకొని ఇతర ప్రాంతాలకు తీసుకొని వెళ్లి అమ్ముకొని కొంత మంది జీవిస్తుంటారు. నంద్యాల జిల్లాలోని గాజులపల్లి, చలమ, ప్రకాశం జిల్లా లోని దిగువమెట్ట రైల్వే స్టేషన్లలో రైళ్లు ఆగీఆగగానే నరికి తెచ్చుకున్న వెదురు బొంగులను కట్టలుగా కట్టి రైలు భోగీలలో వేసుకుంటారు. ఇటు గుంటూరు వైపు, అటు గుంతకల్లు వైపు వాటిని తీసుకుని వెళ్లి అమ్ముకొని తమ కుటుంబాలను వెళ్ళదీసు కుంటారు. భోగీలలోని మరుగుదొడ్లకు అడ్డంగా వెదురుబొంగులను నిలిపి ఉండడంతో ప్రయాణి కులు మరుగుదొడ్లకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు భోగీలోకి ఎక్కి దిగే తలుపులకు అడ్డంగా వెదురుబొంగు కట్టలను వేస్తుండడంతో స్టేషన్ వచ్చినపుడు భోగీలోంచి ప్రయాణికులు దిగాలన్నా, ఎక్కాలన్నా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. ఒక్కొక్క పర్యాయం బొంగులు కాళ్లకు తగులుకొని గాయాలు కూడా అవుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు, మహిళలు అడ్డంగా ఉండే వెదురు బొంగుల నుంచి రైలు ఎక్కలేక, దిగలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌పీఎఫ్ అధికార లు అప్పుడప్పుడు మాత్రమే తనిఖీలు చేపట్టి వెదురు బొంగులను స్వాధీనం చేసుకుంటున్నారే తప్ప వాటిని తరలించే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అడవిలో వెదుర్లు అక్రమంగా కొట్టుకొని అక్రమంగా రవాణా చేసే వారిలో ఎక్కువ మంది నిరుపేద కూలీ కుటుంబాలే కావడంతో అటు ప్రయాణికులు, ఇటు రైల్వే పోలీసులు పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైలు ఆగినపుడు అటవీ, రైల్వే అధికారులు వెదురు బొంగులను రైళ్లలోకి ఎత్తకుండా, అక్రమ రవాణా జరుగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రైలు బోగిలో వెదురు బొంగులు

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

● సబ్ కలెక్టర్ రాహుల్ మీనన్



బీఎల్‌వోలతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ మీనన్

పొదిలి, మార్చి 26: రానున్న సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పొదిలి, కొనకనమిట్ల మండలాల తహసీల్దార్, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయనాయకులు వినియో గించే ప్రచార వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవా లన్నారు. ఇంటింటికీ ప్రచారం చేసే సమయంలోనూ 48గంటలు ముందుగా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. బహి రంగ ప్రదేశాల్లో నిర్వహించే సభలు, సమావేశాలకు మైక్ పర్మిషన్, ఎంతమొత్తం ఖర్చు చేస్తున్నారు తదితర వివరాలను తెలియజేయా ల్సి ఉంటుందన్నారు. వివిధ పార్టీల నాయకుల నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యర్థనలు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్క రించడంతో పాటు అనుమతులు ఇవ్వాలన్నారు. ఎన్నికల నియమా లకు వ్యతిరేకంగా ఏ రాజకీయ నాయకుడైనా ప్రవర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగిం చుకోవడంతో పాటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో పొదిలి, కొనకనమిట్ల తహశీల్దార్‌లు జియాహుల్‌హక్, షాజిదాబేగం, ఈవోఆర్‌డీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బైకులు, సెల్ ఫోన్ల చోరీలకు పాల్పడిన యువకుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

మార్కాపురం రూరల్, మార్చి 26: మార్కాపురం పరిసర ప్రాంతాల్లో బైకులు, సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడిన షేక్ సుభాని అనే వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సీఐ ఆవుల వెంకటేశ్వర్లు వివరాలను వెల్లడించారు. మార్కాపురం పట్టణం, రూరల్, కంభం, వినుకొండ పోలీస్ స్టేషన్‌లో బైకులు, సెల్‌ఫోన్లు చోరీలు చేసినట్లు సుభానిపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మూడు బైకులు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.2,52,000 ఉన్నట్లు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద పట్టణ ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తన సిబ్బందితో కలిసి నిందితుడు సుభానిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

● రోడ్డెక్కిన కొత్తపల్లెకాలనీ వాసులు
● నూతన బోరు వేయాలని డిమాండ్
● ఎన్నికల కోడ్ వేళ కుదరదన్న ఎంపీడీవో



తాగునీటి కోసం రోడ్డెక్కి నిరసన తెలుపుతున్న మహిళలు

బేస్తవారపేట, మార్చి26: ఎన్నికల కోడ్‌తో ఆ గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్థులు వారికి తోచిన రీతిలో చందాలు వేసుకొని తామే బోరు వేసుకుంటామని ముందుకు వచ్చినప్పటికీ, అనుమతులు లభించలేదు. ఎంపీడీవో ద్వారా సిఫారసు లేటర్ కావలని బోర్ యజమాని సూచించడంతో నీటి సమస్య మొదటికి వచ్చింది. దీంతో బేస్తవారపేట మండలంలోని సలకలవీడు గ్రామ పంచాయతీలోని కొత్తపల్లె కాలనీలో ప్రజలు నీటికోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. గ్రామంలోని రెండు డీప్ బోర్లు ఒట్టిపోయాయి. దీంతో సుమారు కిలోమీటర్ దూరంలోని వ్యవసాయ మోటార్ల నుంచి మహిళలు నీటిని తెచ్చుకుంటున్నారు. గుక్కెడు నీటి కోసం వీరు అనేక పాట్లు పడుతున్నారు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామస్థులు బేస్తవారపేట ఎంపీడీవో దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఎన్నికల కోడ్ ఉంది బోరు వేయడానికి లేదని ఎంపీడీవో టి.పార్వతి చెప్పారు. దీంతో గ్రామస్థులు కోనపల్లె రహదారిలో రోడ్డుపై మంగళవారం ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించి కొత్తపల్లె కాలనీ వాసులకు నీటి కష్టాలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి కోసం వ్యవసాయ బోరు వద్దకు వెళుతున్న మహిళలు

అనుమతి కోరాం

ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్తగా బోరు ఏర్పాటు చేయాలంటే ఆర్వో అనుమతి ఉండాలి. కొత్తబోరు అనుమతి కోసం ఆర్వోకు లెటర్‌పెట్టాం. అనుమతి వచ్చే లోపు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటాం.

టీ.పార్వతి ఎంపీడీవో

రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు



ఎరిక్షన్‌బాబుకు మద్దతు తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పుల్లలచెరువు, మార్చి 26 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు అన్నారు. మంగ ళవారం టీడీపీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబును కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరిక్షన్ బాబు గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో నుంచి ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. 'వర్గీకరణ సమస్య పరిష్కారం కావాలన్నా, మాదిగల జీవితాల్లో వెలుగులు నింపాలన్నా, చంద్రబాబుతోనే సాధ్యమ న్నారు. చంద్రబాబు గెలుపు మాదిగల గెలుపుగా చూడాల న్నారు. గత టీడీపీ హయంలో మాదిగ జాతికి 23 వేల ఉద్యోగాలు వచ్చాయన్నారు. మాదిగలకు ముఖ్యమంత్రి జగన్ తీవ్ర అన్యాయం చేశారని అన్నారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ మాదిగలు టీడీపీ పార్టీకి మద్దత్తు ఇవ్వడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు నరసింగరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమూలపు ప్రకాష్ మాదిగ, నాయకులు జి వినయ్ మాదిగ, సిహెచ్ సుబ్బు మాదిగ, డేవిడ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



వాదంపల్లి నుంచి టీడీపీలో చేరిన కార్యకర్తలు

పుల్లలచెరువు (ఎర్రగొండపాలెం) : ఎర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లిలో వైసీపీ నుంచి టీడీపీలోకి 20 కుటుంబాలు చేరాయి. మంగళవారం ఎర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో ఎర్రగొండపాలెం మండలం వాదంపల్లి ఉపసర్పంచి మిరియంపల్లి అంజి, ముదిరాజ్, 20 రజక కుటుంబాలకు వై.పాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి తప్ప అభివృద్ధి చేసిన పాపాన పోలేదని విమర్శించారు. వెలిగొండను అనాథకొండగా మార్చి ప్రజలను వైసీపీ మోసగించిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జేడ్పీ ఉపాధ్యక్షుడు డాక్టరు మన్నె రవీంద్ర, టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బయ్య, వెంగళ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన కార్యకర్తలు

మార్కాపురం రూరల్, మార్చి 26: పట్టణంలోని 15వ వార్డు నుంచి పలు కుటుంబాలు టీడీపీ లో చేరాయి. 47 కుటుంబాలు నియోజకవర్గంలో పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి సమక్షంలో రామాంజి, సాగర్, అంజీల ఆధ్వర్యంలో పట్టణంలోని టీడీపీ కండువాలు కప్పుకొని కార్యాలయంలో మంగళ వారం రాత్రి పార్టీలో చేరారు. గతంలో టీడీపీలో ఉన్న ఈ కుటుంబాల వారికి సోమ వారం వైసీపీ నాయకులు ప్రలోభాలకు గురిచేసి బలవంతంగా పార్టీ కండువాలు వేశారన్నారు. టీడీపీపై అభిమానంతో తిరిగి సొంత పార్టీలోకి వచ్చార న్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుంటా మన్నారు. నియోజక వర్గంలో పోల్ మేనేజ్ మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి మాట్లాడుతూ రానున్న టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలంటే కచ్చితంగా రానున్న టీడీపీ ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడితోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేఖర్‌రెడ్డి, దూదేకుల మస్తాన్, మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వంతెనల నిర్మాణం కోసం ఎదురుచూపు

పెద్ద దోర్నాల, మార్చి 26: మండలంలోని గంటవానిపల్లె, ఎగువ చెర్లోపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై వంతెనల నిర్మాణాల కోసం ప్రజలు ఏళ్లగా ఎదురుచూస్తున్నారు. దోర్నాల నుంచి 12 కిలోమీటర్ల దూరంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారికి 2 కిలోమీటర్లలో గంటవానిపల్లె గ్రామం ఉంది. సుమారు 500 కుటుంబాలు నివసించే ఆ గ్రామానికి వెళ్లాలంటే ముందుగా తీగలేరు వాగు దాటాల్సి ఉంది. ఆ వాగుపై దశాబ్దాల క్రితం చిన్న చప్టా నిర్మించారు. అది కూడా శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలంలో తీగలేరు బ్రిడ్జిపై నుంచి వరదనీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఆ సమయంలో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. ఈ సమస్యను పరిష్కరించాలంటూ ఆ గ్రామ ప్రజలు పలు మార్లు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించారు. అంతేకాదు వెలిగొండ ప్రాజెక్టు నిర్మా ణ పనుల ప్రారంభోత్స వానికి దోర్నాల వచ్చిన అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి దృష్టికి ఆ గ్రామ సర్పంచి జీ నాగమణి తీసుకువెళ్లగా కోటి రూపాయలతో నిర్మిస్తామని బహిరంగసభలో హామీ ఇచ్చారు. కాని నేటికీ పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయని పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికలు రావడంతో నిలిచిపోయినట్లు పలువురు గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుత వైసీపీ పాలనలో దీని గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. అదేవిధంగా నల్లమల అటవీ ప్రాంతం మారుమూల గ్రామం ఎగువ చెర్లోపల్లి గ్రామం వద్ద కూడా తీగలేరు కాలువపై ఉన్న మరో వంతెన శిథిలావస్థకు చేరుకొంది. పెద్దగా వర్షాలు కురిస్తే ఆ వంతెనపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో చెర్లోపల్లి, చిలకచెర్ల, బోడు, చెరువుగూడెం, బందంబావి గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేశారు. హామీలు ఇవ్వడమే గానీ అటు తర్వాత పట్టించుకునే నాథుడే లేడని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు.



ఎగువ చెర్లోపల్లి వద్ద బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు(ఫైల్)



గంటవానిపల్లె వద్ద శిథిలావస్థలో ఉన్న చప్టా

ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడి

» రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్న దోసకాయలపాడు ప్రజలు

» పట్టించుకోని అధికారులు

దోసకాయలపాడు (తాళ్లూరు) మార్చి 26 : మండలంలోని దోసకాలపాడు ఎస్సీకాలనీలో గత రెండు నెలలుగా నీటి సమస్య ఏర్పడి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూస్తామని సమావేశాల్లో చెప్తున్న మండల స్థాయి అధికారులు గత రెండు నెలలుగా ఎస్సీ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నా మరమ్మతులు చేపట్టిన దాఖలాలు లేవు. ఆకాలనీలో దాదాపు 120 కుంటుంబాలకు చెందిన నాలుగు వందల మంది నివాసముంటున్నారు. కాలనీ వాసుల నీటి అవసరాలకు రెండు డీప్ బోర్లు వేశారు. ఆ బోర్లు చెడిపోయి సంవత్సరాలు కావస్తున్నా వాటి మరమ్మతుల ఊసే లేదు. కాలనీవాసులకు నీటి సౌకర్యార్థం దోర్నపువాగు సమీపాన గల పొలాల్లో వేసిన డీప్ బోరు రెండు నెలల కిందట చెడిపోయింది. కాలనీలో చేతి పంపు ఉన్నా భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో చేతి పంపు సక్రమంగా పనిచేయటం లేదు. కాలనీలో 7బజార్లు ఉండగా కేవలం రెండు బజార్లకు మాత్రమే నీరు వస్తోంది. ఆ రెండు బజార్ల వాసులు సర్పంచ్ వర్గీయులు కావడంతో పక్కనున్న పొలంలోని బోరు నీరు సరఫరా చేస్తున్నారని కాలనీ వాసులు అంటున్నారు. మిగిలిన 5 బజార్ల ప్రజలు సర్పంచ్ వ్యతిరేక వర్గీయులు కావడంతో తమ వీధులకు నీటి సరఫరాను పట్టించుకోక ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాలనీ వాసులు నీటి కోసం దూరంగా ఉన్న పొలాల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. వీరికి రైతులు దయ చూపిస్తేనే నీరు దొరికే పరిస్థితి ఉంది. పంటలకు సరిపడా నీరు లేకపోవడంతో కొందరు రైతులు నీరు ఇవ్వడం లేదు. దీంతో కొందరు నీటి కోసం పొలాల వద్ద వేచిచూస్తున్నారు. గ్రామానికి ఎన్ఎస్‌పీ నీరు రోజుమార్చి రోజు గంట వస్తుండటంతో ఆ నీటిని నిల్వ ఉంచుకొని అన్ని అవసరాలకు ఆ నీటినే సర్దుకుని వాడుకుంటున్నారు. దీంతో కాలనీలో తీవ్ర నీటి సమస్య తలెత్తి కాలనీ వాసులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. పలు మార్లు నీటి సమస్య విషయాన్ని అధికారులకు విన్నవించినా డీప్‌బోర్ల మరమ్మతులకు చర్యలు తీసుకోలేదని కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. డీప్ బోరుకు మరమ్మతులు చేస్తున్నామంటూ మోటర్, పైపులు తీసి మిన్నకున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు గైకొని డీప్ బోర్లకు మరమ్మత్తులు జరిపి నీటి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులుకోరుతున్నారు.


బయట ఉన్న మోటర్


మరమ్మతుల కోసం తీసిన మోటర్

వైసీపీని సాగనంపాలి

టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ బుద్ధా



పామూరు, మార్చి 26 : సైకో పార్టీ వైసీపీని సాగనంపి టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ప్రజలందరూ సిద్ధం కావాలని టీడీపీ ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. కనిగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మంగళవారం విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో వెంకన్నను కలిశారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ టీడీపీలోకి దారపనేని రావడం సంతోషకరమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడాలన్నారు. టీడీపీ విజయానికి అందరూ ఐక్యతతో పనిచేయాలని బుద్ధా సూచించారు. అనంతరం దారపనేనిని బుద్ధా సన్మానించారు.

వీఆర్వో జయప్రకాష్ మృతి



దర్శి, మార్చి 26 : మండలంలోని తూర్పువీరాయపాలెం వీఆర్వో దేశు జయప్రకాష్ (50) అనారోగ్యంతో మృతి చెందారు. జయప్రకాష్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఒంగోలులో చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయం ఆసుపత్రిలో మృతి చెందారు. మృతదేహాన్ని దర్శి తరలించగా తహసీల్దార్ జీ సుజాత, డిప్యూటీ తహసీల్దార్ ఏ రవిశంకర్, రెవెన్యూ సిబ్బంది నివాళులర్పించారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు.


మాట్లాడుతున్న ఈఆర్వో లోకేశ్వరరావు

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వద్దు

» ఇకపై ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు

» అధికారులకు ఈఆర్వో లోకేశ్వరరావు హెచ్చరిక

తాళ్లూరు, మార్చి 26 : ఎన్నికల నిబంధనల పట్ల నిర్యక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని దర్శి నియోజకవర్గ ఈఆర్వో ఎన్‌వీఎస్ లోకేశ్వరరావు హెచ్చరించారు. ఎంపీడీవో సమావేశం హాలులో క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులు, గ్రామ మహిళా సంరక్షకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈఆర్‌వో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల నియమావళి అమలు కావడం లేదని సివిల్ యాప్ ద్వారా 17 దరఖాస్తులు అందగా, తాళూరు మండలం నుంచి ఏకంగా 7 దరఖాస్తులు అందాయి. పలుమార్లు సమావేశాలను ఏర్పాటు క్షేత్రస్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చినా సిబ్బంది ఎన్నికల నియమావళిని నామమాత్రంగా చేస్తున్నారని అర్థమవుతుందన్నారు. ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు జరిగేవిధంగా చిత్తశుద్ధితో, రాజకీయాలకు అతీతంగా పని చేయాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందన్నారు. గ్రామాల్లో క్షుణ్ణంగా పరిశీలించి కోడ్ ఉల్లంఘన జరుగకుండా చూడాలన్నారు. ప్రతి ఉద్యోగి ఎన్నికల కమిషన్‌కు లోబడి పని చేస్తున్నామన్న విషయాన్ని గుర్తుంచుకుని విధులు నిర్వర్తించాలన్నారు. అనేక మార్లు చెప్పినా మార్పు రావడం లేదని, ఇకపై ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్కే మహమ్మద్ హుస్సేన్, ఎంపీడీవో కె.యుగకీర్తి, సెక్టార్ అధికారి బి.ప్రసాద్‌రావు, ఎంఈవోలు జి.సుబ్బయ్య, సుధాకర్‌రావు, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌వోలు, గ్రామ మహిళా సంరక్షకులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

ముండ్లమూరు : గ్రామాల్లో ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని ఈఆర్వో ఎన్‌వీఎస్ లోకేశ్వరరావు అన్నారు. ఆయన మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, స్టేజ్ - 1 అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్వరరావు మాట్లాడారు. కోడ్ నిబంధనల మేరకు గ్రామాల్లో ఫ్లెక్సీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు రంగులు ఉంటే వెంటనే తొలగించాలన్నారు. ప్రభుత్వ స్థలాల్లో జెండాలుంటే తొలగించాలన్నారు. ఎవరు నిర్లక్ష్యం వహించినా అందుకు సిబ్బందిని బాధ్యులను చేస్తామని హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలన్నారు. ముండ్లమూరు మండలం నుంచి ఫిర్యాదులు వచ్చాయని, ఇకపై ఏ ఫిర్యాదు వచ్చినా చర్యలు తప్పవన్నారు. సమావేశంలో తహసీల్దార్ జే మధుబాబు, ఎంపీడీవో బీ శంకరరావు, స్టేజ్ - 1 అధికారి వజ్జా శ్రీనివాసరావు, మహమ్మద్ ఫరూక్ పాల్గొన్నారు.

తిరుపాలు మృతికి సంతాపం


తిరుపాలు మృతదేహానికి నివాళులర్పిస్తున్న నారాయణ

పామూరు, మార్చి 26 : సీపీఐ మండల కార్యదర్శి కే ప్రభాకర్ తండ్రి తిరుపాలు (70) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తిరుపాలు మృతదేహంపై పార్టీ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తిరుపాలుకు నివాళులర్పించిన వారిలో జిల్లా నాయకులు సయ్యద్ మౌలాలి, వజ్రాల సుబ్బారావు, ఆర్.సూరిబాబు, ప్రసాద్, సురేష్, నరసింహారావు, షేక్ నాయబా, డీ లక్ష్మణ్ ఉన్నారు.


మాగుంటను సన్మానిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి

టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంటకు సన్మానం

పామూరు, మార్చి 26 : టీడీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని పామూరు పట్టణ 2వ ప్రాదేశిక సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ మంగళవారం ఒంగోలులోని మాగుంట క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాగుంట, ఒంగోలు ఏఎంసీ మాజీ చైర్మన్ అయినాబత్తిని ఘనశ్యాం, పశు సంవర్థక శాఖ మాజీ చైర్మన్ రంగసాయి, జనసేన కార్పొరేటర్ రమేష్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆకుపాటి మిత్ర బృందం పాల్గొన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు దామచర్ల జనార్దన్‌ను జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ను కూడా కలిసి ఆకుపాటి సన్మానించారు.

మాగుంటను కలిసిన తాళ్లూరు తమ్ముళ్లు

తాళ్లూరు : టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిని తాళ్లూరు మండల టీడీపీ తమ్ముళ్లు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మండలంలో పార్టీ పరిస్థితిపై చర్చించారు. కూటమి నిలబెట్టిన అభ్యర్థుల విజయానికి అందరై కలిసి పనిచేయాలని సూచించారు. మాగుంటను కలిసిన వారిలో టీడీపీ నేతలు శాగం కొండారెడ్డి,షేక్ కాలేషావలి, గొల్లపూడి వేణుబాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, మీరామొహిద్దీన్, కుమ్మిత సుబ్బారెడ్డి, ఆవుల ఆదినారాయణ, జి.రమణారెడ్డి, పేరిరెడ్డి, నాదెండ్ల శ్రీను, పాలెపోగురాజు, సానె సురేష్, తూము లక్ష్మీరెడ్డి ఉన్నారు.

ఉగ్ర సోల్జర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్


ఇఫ్తార్‌ను ఇస్తున్న ఉగ్ర సేన

పామూరు, మార్చి 26 : పట్టణంలోని మదర్సా దారుల్ ఉలేంలో రంజాన్ ఉపవాస దీక్షలో భాగంగా ఉగ్ర సోల్జర్ ఆధ్వర్యంలో మంగళవారం ముస్లింలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉగ్ర సోల్జర్, టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ సభ్యులు మదర్సాలోని మసీద్‌లో నమాజ్ చేశారు. అనంతరం మదర్సాలోని విద్యార్థులకు ఇఫ్తార్‌ను ఇచ్చారు. ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు అఖండ మెజార్టీతో గెలుపొందాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఉగ్ర సోల్జర్ సభ్యులు, షేక్ యాసీన్, షేక్ షకీల్, నాయభతోపాటు టీడీపీ ముస్లిం మైనారిటీ సభ్యులు షేక్ ఖాజారహంతుల్లా, షేక్ గౌస్‌బాషా, పత్తు మస్తాన్ పాల్గొన్నారు.


ఫాం-12డీతో ఓటు వినియోగం

పామూరు, (సీఎస్‌పురం) మార్చి 26 : 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు ఫాం-12డీతో ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకోవచ్చని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నాగరాజు తెలిపారు. పార్టీ కార్యాలయంలో జనసేన కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పారం 12డీ ద్వారా ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. 80 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులను గుర్తించి వారు ఇంటి వద్దనే ఓటును వేసుకునేలా కార్యకర్తలు చూడాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ ఆంధ్రా కమిటీ సభ్యుడు మాదాసు రమేస్, జిల్లా కార్యదర్శి వై రహీముల్లా, సీఎస్‌పురం మండల అధ్యక్షుడు జానపాటిరాజు, జిల్లా ప్రోగ్రాం కమిటీ కార్యదర్శి రామిశెట్టి సునీల్‌కుమార్, ఉల్లిపాయల సుబ్బరాయుడు, మురళీకృష్ణయాదవ్, హరికృష్ణ, పీ రాంబాబు, మౌలయ్య, బీ రాంబాబు, సాయి, మల్లి పాల్గొన్నారు.

పిల్లల దొంగల ముఠా కలకలం..!

- దొనకొండలో తప్పించుకున్న విద్యార్థి

- అనుకోని సంఘటనతో హడలెత్తిన తల్లిదండ్రులు


బాలుడిని విచారిస్తున్న పోలీసులు

దొనకొండ, మార్చి 26 : పిల్లలను అపహరించే ముఠా కలకలం సృష్టించిన సంఘటన మండల కేంద్రమైన దొనకొండలో మంగళవారం చోటుచేసుకుంది. బాధిత విద్యార్థి తెలిపిన వివరాల మేరకు.. దొనకొండలోని శివాజీనగర్ వీధికి చెందిన వన్నె లక్ష్మణరావు కుమారుడు ఉదయ్‌గణేష్ స్థానిక సాయి విజ్ఞాన్ పాఠశాలలో 7వ తరగతి చదుతున్నాడు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా రైల్వేస్టేషన్ నుంచి శివాజీనగర్ వైపు వెళ్లే దారిలో నిరుపయోగంగా ఉన్న రైల్వే క్వార్టర్స్ సందులో గుర్తు తెలియని వ్యక్తులు మంకీ క్యాప్‌లు ధరించి వ్యాన్ పెట్టుకొని కాపు కాశారు. అటువైపు వచ్చిన విద్యార్థి ఉదయ్‌గణేష్‌ను వారు పిలవగా దగ్గరకు వెళ్లి భయంతో వెనుదిరిగాడు. వెంటనే వారు వెంబడించి బాలుడిని నోరుమూసి ఎత్తుకొని వాహనం వద్దకు తీసుకెళ్లారు. ఎడమ చేతికి మిషన్ ద్వారా మత్తు ఇచ్చే ప్రయత్నం చేయబోగా పెనుగులాటలో బాలుగు తప్పించుకొని పరుగుతీశాడు. ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు విషయం తెలపగా తల్లిదండ్రులు మరికొందరు హుటాహుటీన ఆ ప్రాంతానికి చేరుకోగా వారు పారిపోయినట్లు గుర్తించారు. అనుకోని సంఘటనతో దొనకొండలోని పిల్లల తల్లిదండ్రులు హడలెత్తారు. అనుకోని ఈ సంఘటన ప్రజల్లో చర్చనీయాంశమైంది. ఈ విషయమై ఎస్ఐ సంపత్‌కుమార్‌కు వివరణ కోరగా సమాచారం మేరకు సంఘటన జరిగిన ప్రదేశంలో సీసీ కెమెరాల్లోని ఫుటేజీలను పరిశీలించగా, పరిసర ప్రాంతాల్లో విచారణ చేపట్టగా విద్యార్థి ఉదయ్‌గణేష్ తెలిపిన ఆనవాళ్లు ఏమాత్రం లేవన్నారు. ఆ విద్యార్థి అబద్ధం చెప్తున్నట్లు స్పష్టమైందని, దీనిపై పూర్తి విచారణ చేపడతామని ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి మృతదేహం గుర్తింపు

దొనకొండ, మార్చి 26 : దొనకొండ నుంచి రుద్రసముద్రం వెళ్లే రహదారి సమీపంలోని యలమంద వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సుమారు 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉన్న వృద్ధుడి ఒంటిపై తెల్ల రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, ఎరుపు రంగు అంచు పంచి, తెల్ల టవల్ ఉందని తెలిపారు. దొనకొండ-2 వీఆర్వో తన్నీరు హరినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భవిష్యత్‌కు చంద్రబాబు గ్యారెంటీ


పునుగోడులో, 18వ వార్డు, లింగంకుంట్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కనిగిరి, హెచ్ఎంపాడు మండలాల్లో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం

కనిగిరి, మార్చి 26 : చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్‌కు గ్యారెంటీ అని టీడీపీ కనిగిరి క్లస్టర్ ఇన్‌చార్జి నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి అన్నారు. మండలంలోని పునుగోడు గ్రామంలో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్‌రెడ్డి అవినీతి పాలనతో దోచేసేరనానరు. అభివృద్ధి చేయడం చేతగాక ఆంధ్రాను అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టే సమర్థత, పాలన దక్షత ఉన్న నేత చంద్రబాబు ఒక్కరే అన్నారు. రాష్ట్రం కోసం, పిల్లల భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను ప్రజలు గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. నవరత్నాల పేరుతో జగన్‌రెడ్డి నవ విధాలా ధరలు పెంచి పేదల నడ్డివిరిచారని ధ్వజమెత్తారు. పాలన చేగతాని నాయకులను గద్దెదింపాలన్నారు. ప్రతి మహిళ గర్వంగా ఉండేలా పథకాల్లో చంద్రబాబు మహిళకు అగ్రభాగం కల్పించి ఆర్థిక బరోసా కల్పించారన్నారు. పేదింట్లో ఎవరూ మధ్యలో విద్యను ఆపేయకూడదని ఏడాదికి రూ.15వేలు తల్లికి వందనం ద్వారా నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్నారు. ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు, మహిళకు ఉచిత బస్సు ప్రయాణం ఇలా పథకాలన్నీ మహిళల కోసం అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు బేరిపుల్లారెడ్డి, సైకం మాలకొండారెడ్డి, యువకిశోరం ఓబులురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, సిద్దాటపు వెంకటరెడ్డి, గ్రామపార్టీ నాయకులు, బూత్ ఇంచార్జిలు, కన్వీనర్‌లు పాల్గొన్నారు.

పట్టణంలోని టీడీపీ పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో 18వ వార్డులో కనిగిరి ప్రాంతంలో ఐదేళ్లలో అభివృద్ధి శూన్యమన్నారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర గెలుపుతో కనిగిరి ప్రాంత అభివృద్ధి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితోనే కనిగిరి అభివృద్ధి సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉగ్రను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు వీవీఆర్ మనోహరరావు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ పిరోజ్, మనోజ్, ఓలేటి చిన్నా, చిలకపాటి లక్ష్మయ్య, నజిముద్దీన్, తెలుగుమహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్ షేక్ వాజిదాబేగం, దొరసాని, వెంకటలక్ష్మమ్మ, తులసి, అమ్ములమ్మ, ధనలక్ష్మీ, నారాయణమ్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు మండలంలో

మండలంలోని లింగంకుట్ల గ్రామంలో మండలపార్టీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబుతోనే రాష్ట్రానికి మేలు చేకూరుతుందన్నారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ప్రజాసేవకుడైన డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కనిగిరికి నిమ్స్‌తో పాటు విద్యారంగాభివృద్ధికి ట్రిపుల్ ఐటీ, సాగు, తాగునీటి జలాల సాధనకై వెలిగొండ సాధన, ఇంటింటికీ కొళాయి కనెక్షన్ లక్ష్య సాధన ఉగ్ర ప్రణాళిక అని వివరించారు. ఎన్నికల్లో కనిగిరి ఎమ్మెల్యేగా డాక్టర్ ఉగ్రను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, నాయకులు గాయం రామిరెడ్డి, చావలి చినవెంకటేశ్వర్లు, మురహరి నరసయ్య, చీకటి వెంకటసుబ్బయ్యతాతపూడి స్టాలిన్ (బుజ్జి), బ్రహ్మంగౌడ్, ఆకుపాటి వెంకటరావు, సుమిత్ర రామిరెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు బూతచి చిన్నకోటిరెడ్డి, కేతిరెడ్డి కొండారెడ్డి, జనసేన నాయకులు నాగేంద్రబాబు, దేవిరెడ్డి రాజారామిరెడ్డి పాల్గొన్నారు.

బాబు వస్తేనే గ్రామాల బాగు

పామూరు : వైసీపీ పాలనలో అధోగతిపాలైన గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని పార్టీ గ్రామ అధ్యక్షుడు పూనాటి వెంకటేశ్వర్లు తెలిపారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్ర, పార్టీ మండల అధ్యక్షుడు పువ్వాడి ఆదేశాల మేరకు మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంచిపెట్టారు. వచ్చే ఎన్నికల్లో డాక్టర్ ఉగ్రను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఉగ్ర గెలుపు ద్వారా కనిగిరి నియోజకవర్గం అన్నిరంగాల్లో పురోభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి గొడుగులూరి కిరణ్, మహిళలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షం

పీసీపల్లి : తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉందని టీడీపీ నాయకులు అన్నారు. పీసీపల్లిలోని విజయనగర్‌కాలనీలో బాబుష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగిన టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేస్తారని వివరించారు. ప్రతిఒక్కరికీ సంక్షేమంతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును, కనిగిరి ఎమ్మెల్యేగా ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నానిబాబు, బ్రహ్మయ్య, ఎలీసా, జోసఫ్, వీరయ్య, సత్తిరెడ్డి, మాచర్ల, శ్రేణులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంచుతున్న పూనాటి, పీసీపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న శ్రేణులు

అనుమతి లేని ప్రచారాలపై సమాచారమివ్వండి

ఆర్డీవో జాన్‌ఇర్విన్


మాట్లాడుతున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

కనిగిరి, మార్చి 26 : కనిగిరి ప్రాంతంలో అనుమతులు లేకుండా రాజీకీయపార్టీల నాయకులు ప్రచారాలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలని ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో మంగళవారం సచివాలయ మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు చెందిన వారికి ఇప్పటికే కొన్ని అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో ప్రచారం నిర్వహించే నాయకులు వద్దకు వెళ్లి అనుమతి పత్రాన్ని తప్పనిసరిగా మహిళా పోలీసులు పరిశీలించాలన్నారు. అనుమతి లేని ప్రచారాలను వెంటనే నిలిపివేయాలన్నారు. అదేవిధంగా రాజకీయ పార్టీలకు చెందిన గుర్తులు, రంగులు వాహనాలపై, ఇళ్లపై, వస్తువులపై, పబ్లిక్ ప్రాంతాల్లో ఉంటే వెంటనే తొలగించాలన్నారు. పార్టీ రంగులను ఉపయోగించే వారిపై కోడ్ ఉల్లంఘన కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి మహిళా పోలీసులు విధిగా రాజకీయ పార్టీల కార్యక్రమాలపై దృష్టి సారించాలన్నారు. కోడ్ నియమావళిని ఉల్లంఘించే వారి వివరాలను తెలయచేసే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఆదేవిదంగా సీ-విజిల్ యాప్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని ఆర్డీవో సూచించారు. కార్యక్రమంలో డీఏపీ కిశోర్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఆవుల సురేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి..లేకుంటే తప్పుకోండి

సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో హెచ్చరిక


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో పుట్టారెడ్డి

పామూరు, మార్చి 26 : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని లేకపోతే విధుల నుంచి తప్పుకోవాలని ఎంపీడీవో పుట్టారెడ్డి హెచ్చరించారు. పామూరు గ్రామ సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని నుచ్చుపొద గ్రామానికి చెందిన లబ్ధిదారుడు కలెక్టర్‌కు ఫొటో, వీడియో క్లిప్పింగ్‌తో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ మార్కాపురం డీఎల్‌డీవో దృష్టికి తీసుకెళ్లగా మార్కాపురం డీఎల్‌డీవో ఆదేశాల మేరకు పామూరు ఎంపీడీవో 3, 4 సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పామూరు పంచాయతీ కార్యదర్శి వీ బ్రహ్మానందరెడ్డితో కలిసి మూమెంట్ రికార్డులను పరిశీలించి సిబ్బంది ఎక్కడికి వెళ్లారని ఆగ్రహించారు. సచివాలయంలో అపరిశుభ్రంగా ఉన్న కంప్యూటర్ పరికరాలను చూచి అసంతృప్తిని వ్యక్తం చేశారు. సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని సూచించారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌పై వెళ్లేవారు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని మరోమారు బాధ్యతగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బుధవారం పామూరుకు వస్తున్న డీఎల్‌డీవోకు సంజాయిషీ చెప్పుకోవాలని సూచించారు.

శ్రీనివాసరెడ్డిపై దాడి పార్టీలతో సంబంధం లేదు


దర్శి, మార్చి 26 : ముండ్లమూరు మండలం, పసుపుగల్లు గ్రామానికి చెం దిన బిజ్జం శ్రీనివాసరెడ్డిపై జరిగిన దాడికీ రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని దర్శి సీఐ షమీముల్లా చెప్పారు. పోలీస్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంఘటనపై శ్రీనివాసరెడ్డి ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, అంబులెన్స్‌లో దర్శి ఆసుపత్రికి వెళ్లగా అక్కడి నుంచి వచ్చిన సమాచారంతో ముండ్లమూరు పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. గతంలో నాగభూషణం వర్గీయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ ఘటనలో ఎలాంటి రాజకీయాలు లేవని సీఐ షమీముల్లా వివరించారు. కార్యక్రమంలో ముండ్లమూరు ఎస్సై అంజనేయులు పాల్గొన్నారు.

బలగాల కవాతు

వెలిగండ్ల, మార్చి 26 : ప్రజలకు తాము అండగా ఉన్నామని, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సాయుధ పోలీసులు కోరారు. మంగళవారం సాయుధ బలగాలు కవాతు నిర్వహించాయి. డీఎస్పీ రామరాజు ఆధ్వర్యంలో సివిల్, కేంద్ర బలగాలకు చెందిన జవాన్లు గ్రామ పుర వీధులలో కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐలు రామ్ నాయక్, వెంకటేశ్వర్లు, వెలిగండ్ల ఎస్ఐ శివ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం



ఉద్దండుల కోట..
నరసరావుపేట

రాజకీయాలకు రాజధాని, కళలకు కాణాచి, ఉద్యమాలకు ఊపిరి, సాహిత్యానికి సాగర సంగమం... ఇలా నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గం అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఫ్యాక్షన్ రాజకీయాలకు, బాంబుల సంస్కృతికి, కులాల పోరుకు కొన్నేళ్లు వేదికగా నిలిచింది. రాష్ట్రంలోనే కాక దేశంలోనే ఒక విశిష్టమైన స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇలాంటి గుర్తింపును రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి తీసుకువచ్చారు. దేశంలోనే అనేక ఉన్నత పదవులు అలకరించిన కాసు బ్రహ్మానందరెడ్డి ఇక్కడి నుంచే రాజకీయాలను శాసించారు. రాజకీయ ఉద్దండులకు నరసరావుపేట నిలయం. ఇక్కడినుంచి శాసన సభ్యులుగా గెలుపొందిన వారిలో ముగ్గురు మినహా మిగిలిన నేతలందరూ అత్యున్నత పదవులను అలంకరించటం విశేషం. వరుసగా ఐదుసార్లు కోడెల శివప్రసాదరావు విజయం సాధించారు. మూడు సార్లు ఇక్కడినుంచి ఎమ్మెల్యేగా కాసు వెంకట కృష్ణారెడ్డి గెలుపొందారు. ఆంధ్రరాష్ట్ర తొలి స్పీకరుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాసు బ్రహ్మానందరెడ్డి, నవ్యాంధ్ర తొలి శాసన సభాపతిగా డాక్టర్ కోడెల శివప్రసాదరావు, మంత్రిగా కాసు వెంకట కృష్ణారెడ్డిలు పని చేయటంతో ఈ నియోజకవర్గం ప్రత్యేకత సంతరించుకుంది.

- ఎమ్మెల్యేలుగా ఎన్నికైంది ఏడుగురే..!
- ముఖ్యమంత్రి.. కేంద్రమంత్రి.. గవర్నర్‌గా కాసు బ్రహ్మానందరెడ్డి
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి స్పీకరుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి
- నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా డాక్టర్ కోడెల శివప్రసాదరావు
- వరుసగా ఐదుసార్లు గెలిచిన కోడెల
- మూడు సార్లు అసెంబ్లీకి వెళ్ళిన కాసు

ఓటర్లు

మొత్తం ఓట్లు	:	2,29,533
పురుషులు	:	1,11,756
మహిళలు	:	1,17,748
థర్డ్ జండర్	:	29

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
ఉమ్మడి జిల్లాకు గుంటూరు కేంద్రం అయినప్పటికీ రాజకీయాలకు కేంద్రంగా నరసరావుపేట భాసిల్లింది. 1952లో ఈ నియోజక వర్గం ఏర్పడింది. ఇప్పటికి 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఏడుగురు అభ్యర్థులు మాత్రమే ఇప్పటివ రకు ఎన్నిక కావటం విశేషం. 1952కు ముందు నరసరావుపేట నియోజకవర్గం విను కొండ, మాచర్ల, గురజాల నియోజకవర్గాలతో కలసి వుండేది. నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటైన అసెంబ్లీ నియోజకవర్గంలో 2006లో జరిగిన పునర్విభజన అనంతరం మునిసిపాలిటీతో పాటు రొంపిచర్ల, నరసరావుపేట రూరల్ మండలాలు వున్నాయి.

తొలి ఎన్నికలో..

1952లో జరిగిన తొలి ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి సోదరుడు కాసు వెంగళరెడ్డిపై కేఎంపీ పార్టీ తరపున నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి గెలుపొందారు. నల్లపాటి ఆంధ్ర రాష్ట్ర తొలి స్పీకరుగా పనిచేశారు. 1955లో నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి సీపీఐ అభ్యర్థి కె.రంగారావుపై వరుసగా రెండవ సారి విజయం సాధించారు. 1962లో చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలేనికి చెందిన చాపలమడుగు రామయ్య చౌదరి గెలుపొందారు. ఆయన తొలి పార్లమెంట్‌కు నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికయ్యారు. 1967లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర్య పార్టీ అభ్యర్థి కొత్తూరి వెంకటేశ్వర్లుపై మాజీ సీఎం కాసు బ్రహ్మానందరెడ్డి విజయం సాధించారు. కొత్తూరు వెంకటేశ్వర్లు 1962, 1967, 1972 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా, 1978 ఎన్నికల్లో జనతా పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు పోటీ చేసి ఓటమి చెందారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో..

1983 వరకు నరసరావుపేట నియోజక వర్గం కాసు వంశానికి కంచుకోటగా వుంది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో కాసు కోటకు బీటలు వారాయి. ఎన్‌టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన డాక్టర్ కోడెల శివప్రసాదరావు 1983లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి నరసరావుపేట నుంచి విజయం సాధించారు. అప్పటి నుంచి 1999 వరకు వరుసగా ఐదుసార్లు కోడెల విజయకేతనం ఎగుర వేశారు. 2004, 2009లో జరిగిన ఎన్నికల్లో కాసు వెంకట కృష్ణారెడ్డి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి తెలుగుదేశం అభ్యర్థి కోడెలపై వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పొత్తుతో బీజేపీ ఇక్కడ పోటీ చేసింది. బీజేపీ అభ్యర్థి డాక్టర్ నలబోతు వెంకటరావుపై వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శాసన సభ్యుడిగా విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో వరుసగా రెండోసారి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే 32,277ఓట్ల మెజార్టీతో రికార్డు నెలకొల్పారు. ఇప్పటివరకు ఇదే అత్యధిక మెజార్టీ కావడం విశేషం. నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేలుగా నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. చాపలమడుగు రామయ్య చౌదరి, దొండేటి కృష్ణారెడ్డి వీరు ఒక్కసారి మాత్రమే శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు.

నియోజకవర్గ చరిత్ర


సంవత్సరం	విజేత	పార్టీ	రన్నరప్	పార్టీ	ఆధిక్యం
1952	నల్లపాటి వెంకట్రామయ్య	కేఎంపీపీ	కేవీరెడ్డి	కాంగ్రెస్	4,574
1955	నల్లపాటి వెంకట్రామయ్య	కాంగ్రెస్	కే రంగారావు	సీపీఐ	12,063
1962	చాపలమడుగు రామయ్యచౌదరి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	2,656
1967	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	13,699
1972	దొండేటి కృష్ణారెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	స్వతంత్ర	14,587
1978	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	కొత్తూరి వెంకటేశ్వర్లు	జనత	6,905
1983	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	బీ సుబ్బారెడ్డి	కాంగ్రెస్	14,557
1985	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	2,064
1989	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	ఎం రాధాకృష్ణమూర్తి	కాంగ్రెస్	9,155
1994	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	దొడ్డా బాలకోటిరెడ్డి	కాంగ్రెస్	9,300
1999	డాక్టర్ కోడెల శివప్రసాదరావు	టీడీపీ	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	14,306
2004	కాసు వెంకటకృష్ణారెడ్డి	కాంగ్రెస్	కోడెల శివప్రసాదరావు	టీడీపీ	15,495
2009	కాసు వెంకటకృష్ణారెడ్డి	కాంగ్రెస్	కోడెల శివప్రసాదరావు	టీడీపీ	5,971
2014	డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి	వైసీపీ	నలబోతు వెంకటరావు	బీజేపీ	15,766
2019	డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి	వైసీపీ	చదలవాడ అరవిందబాబు	టీడీపీ	32,277

విశిష్టత..


నియోజక వర్గానికి రాజకీయ ఖిల్లాగా పేరుంది. మల్రాజు వంశస్థులు ఇక్కడ జమిందారులుగా వున్నారు. 1797 నుంచి నరసరావుపేట కేంద్రంగా జమీందారుల పరిపాలన కొనసాగింది. 1952 వరకు ఇక్కడ పరిపాలన అంతా జమిందారుల చేతు ల్లోనే వుండేది. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి రాజకీయాలకు వేదికగా మారింది. స్వాతంత్రోద్యమంలో త్రివేణి పత్రికను నిర్వహించి కోలవెన్ను రామకోటేశ్వరరావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. రాజకీయాల్లో కాసు వెంగళరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి, కాసు వెంకట కృష్ణారెడ్డి, డాక్టర్ కోడెల శివప్రసాదరావులు రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన నాయకులు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణం అనంతరం నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందింది. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి ఆలయం రాష్ట్ర ప్రసిద్ధి చెందింది. కోటప్పకొండ శైవక్షేత్రం అసాధారణ అభివృద్ధి చెందింది. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ కోటప్పకొండకు ఘాట్‌రోడ్డుకు శ్రీకారం చుట్టారు. సీఎంగా చంద్రబాబు హయాంలో ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభించారు. శ్రీ త్రికోటేశ్వరస్వామి దేవాలయం పునర్‌నిర్మాణం చేశారు. కోటప్పకొండ అభివృద్ధికి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విశేషంగా కృషి చేశారు. పర్యాటక కేంద్రంగా కూడా గుర్తింపు వుంది. కోటప్పకొండ తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదా కల్పించేందుకు కాసు వెంకటకృష్ణారెడ్డి కృషి చేశారు. నరసరావుపేట పట్టణ రక్షిత మంచినీటి పథకం దేశంలోనే అరుదైనది. రూపాయి ఖర్చు లేకుండా విద్యుతుతో పనిలేకుండా పట్టణానికి రెండు పూటలా తాగునీటిని అందిస్తున్న ఘనత పథకం సొంతం. పూర్తిగా గ్రావిటీపై నీటి సరఫరా జరుగుతుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వేసవిలో కూడా రెండు పూటలా నరసరావుపేటలో మంచి నీటి సరఫరా జరుగుతుండటం విశేషం.


నల్లపాటి వెంకట్రామయ్య చౌదరి


చాపలమడుగు రామయ్య చౌదరి


కాసు బ్రహ్మానందరెడ్డి


దొండేటి కృష్ణారెడ్డి


డాక్టర్ కోడెల శివప్రసాదరావు


కాసు వెంకట కృష్ణారెడ్డి


డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నియోజకవర్గ ముఖచిత్రం



నియోజక వర్గ స్వభావం..

ఇక్కడ జరిగే ఎన్నికల్లో పట్టణ ఓటర్ల తీర్పుపై అభ్యర్థుల గెలుపు ఓటములు ఆధారపడి వుంటాయి. పట్టణ ఓటర్ల కంటే గ్రామాలలో ఓటర్ల సంఖ్య అధికం. గ్రామాలు పార్టీల వారీగా విభజించబడి వున్నాయి. రాజకీయ సమీకరణల వారీగా గ్రామాల్లో ఓట్లు పోలవుతాయి. ఈ నేపథ్యంలో పట్టణవాసులు తీసుకొనే నిర్ణయం పైనే అభ్యర్థుల విజయం ఆధారపడి వుంది.

మళ్లీ డాక్టర్ల మధ్యే పోటీ

నరసరావుపేట అసెంబ్లీ స్థానానికి ఇరువురు డాక్టర్లు ఎన్నికల బరిలో దిగారు. తెలుగుదేశం అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తలపడుతున్నారు. వీరు ఇరువురు 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. చదలవాడపై గోపిరెడ్డి గెలుపొందారు. మరోసారి వీరు ఇద్దరు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఓటమి చెందిన అరవిందబాబుకు నియోజకవర్గ ఓటర్ల నుంచి సానుభూతి లభిస్తోంది. ఇరువురి మధ్య పోరు పోటాపోటీగా సాగుతోంది. తనకు ఒక ఛాన్స్ ఇవ్వాలని ఓటర్లుకు అరవిందబాబు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడుసార్లు ఎమ్మెల్యేగా కాసు కృష్ణారెడ్డి..

1978లో జరిగిన ఎన్నికల్లో రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కాసు వెంకట కృష్ణారెడ్డి ఆవుదూడ గుర్తుపై గెలుపొందారు. రాష్ట్రమంత్రిగా పనిచేశారు. 1985, 1999 ఎన్నికల్లో పరాజయం పాలైన కాసు, 2004, 2009లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నరరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కృష్ణారెడ్డి రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, తూనికలు, కొలతలు, పౌర సంబంధాల శాఖ, రాష్ట్ర సహకార శాఖ మంత్రిగా కాసు పని చేశారు. కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో విస్తృతంగా కాసు అభివృద్ధి పనులు చేపట్టారు. నరసరావుపేట నుంచి కాసుకు కుటుంబానికి చెందిన ముగ్గురు నేతలు పోటీ చేశారు. కాసు బ్రహ్మానందరెడ్డి, అయన సోదరుడు కాసు వెంగళరెడ్డి, వెంగళరెడ్డి కుమారుడు కాసు వెంకట కృష్ణారెడ్డి పోటీ చేశారు. వెంగళరెడ్డి ఓటమి చెందారు. ఈ కుటుంబానికి చెందిన మూడవ తరం కృష్ణారెడ్డి కుమారుడు కాసు మహేష్‌రెడ్డికి గత ఎన్నికల్లో ఇక్కడ నుంచి పోటీచేసే అవకాశం దక్కకపోవడంతో అయన గురజాల నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

నరసరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో కులాల వారీగా ఓట్ల వివరాలు

కులం	మునిసిపాల్టీ	నరసరావుపేట రూరల్	రొంపిచర్ల	మొత్తంఓట్లు
కమ్మ	7,242	11,801	8,771	27,314
రెడ్డి	6,409	8,689	12,395	27,493
ముస్లీం	17,943	8,653	1,940	28,536
కాపు	15,474	4,615	2,874	22,963
మాదిగ	7,285	8,480	5,390	21,075
మాల	3,754	7,694	4,565	16,013
వడ్డెర	8,776	4,121	3,781	16,678
వైశ్య	13,543	785	778	15,106
యాదవ	3,085	4,380	2,955	10,420
రజక	2,022	2,520	1,795	6,337
ముదిరాజ్	2,035	3,049	521	5,605
ఎరుకల	1,485	1,775	1,177	4,387
యానాది	1,840	825	1,230	3,895
బ్రాహ్మణ	2,620	465	365	3,450
నాయి బ్రాహ్మణ	1,879	818	130	2,875
తొగటి	1,905	202	285	2,392
విశ్వ బ్రాహ్మణ	1,687	260	315	2,262
పద్మశాలి	1,630	85	34	1,749
ఆరెమరాట	1,445	16	29	1,490

దేశ రాజకీయాలను శాసించిన 'కాసు'

నరసరావుపేట నుంచి కాసు బ్రహ్మానందరెడ్డి దేశ రాజకీయాలను శాసించారు. మారుమూల గ్రామమైన నాదెండ్ల మండలం తూబాడు రైతు కుటుంబంలో జన్మించిన కాసు బ్రహ్మానందరెడ్డి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగానే కాక కేంద్రంలో సైతం ఎన్నో ప్రతిష్టాత్మక పదవులు అలంకరించారు. చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చిన ఘనత బ్రహ్మానందరెడ్డిది. జాతీయోద్యమం కాలంలో జిల్లాలో జరిగే ప్రతి ప్రతి కార్యక్రమంలో ముందుడేవారు. సత్యాగ్రహ ఉద్యమం సందర్భంగా నాలుగు నెలలు బ్రహ్మానందరెడ్డి కారాగార శిక్ష అనుభవించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పనిచేసి జైలులో 1945 జనవరి వరకు ఉన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ ప్రధాన పాత్ర పోషించి లాల్ బహదూర్ శాస్త్రి ప్రధాని కావటానికి కారకులయ్యారు. 1956లో రాష్ట్ర ఆర్థికశాఖ బాధ్యతను చేపట్టారు. బ్రహ్మానందరెడ్డి ఆ తర్వాత రాష్ట్రముఖ్య మంత్రి అయ్యారు. రాష్ట్ర మూడో ముఖ్యమంత్రిగా 1964 ఫిబ్రవరి 23న ప్రమాణ స్వీకారం చేశారు. 1971 సెప్టెంబరు 2 వరకు సీఎంగా కొనసాగారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బ్రహ్మానందరెడ్డి రికార్డును అధిగమించారు. ఆవుదూడ గుర్తుతో 1978 ఎన్నికల్లో రాష్ట్రంలో బ్రహ్మానందరెడ్డి పార్టీ పోటీ చేసింది. 30 అసెంబ్లీ స్థానాలను గెల్చుకొంది. అనంతరం ఇందిర, బహ్మానందరెడ్డి కాంగ్రెస్ పార్టీలు విలీనం అయ్యాయి. కేంద్ర ప్రభుత్వంలో కమ్యూనికేషన్లు, హోంశాఖ, పరిశ్రమల శాఖలను సమర్థంగా నిర్వహించారు. ఆయన ఆయా శాఖలకు మంత్రిగా ఉన్న కాలంలో అనేక సంస్కరణలు చేపట్టారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా, మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేశారు. వ్యవసాయ అభివృద్ధికి కృషిచేశారు. నాగార్జున సాగర్ క్రస్ట్ గేట్ల నిర్మాణానికి కృషి చేశారు. నరసరావుపేట పట్టణ ప్రజలకు మొదటిసారిగా రక్షిత మంచి నీటి పథకం చేపట్టి రక్షిత నీటిని అందించిన ఘనత ఆయనకు దక్కింది. 1994 మే 20న ఆయన మృతిచెందారు.

కోడెల 'కోట'

నరసరావుపేట నియోజకవర్గంలో మంత్రి డాక్టర్ కోడెల శివప్రసాదరావు సుస్థిర స్థానాన్ని సంపాదించారు. రెండు దశాబ్దాలకుపైగా ఇక్కడ కోడెల హవా కొనసాగింది. పట్టణంలో వైద్యవృత్తిలో ఉన్న కోడెల.. ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయ రంగప్రవేశం చేశారు. 1983 వరకు కాసు వంశానికి నరసరావుపేట కంచుకోటగా ఉంది. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో కోడెల పోటీచేసి విజయం సాధించారు. అప్పటినుంచి నరసరావుపేట కోడెల కోటగా మారిపోయింది. వరుసగా ఐదు సార్లు గెలుపొందారు. మంత్రిగా ఐదు క్యాబినెట్ శాఖలు సమర్థంగా నిర్వహించారు. 1987లో హోంమంత్రిగా తొలిసారి మంత్రి పదవిని చేపట్టారు. 1995లో భారీ, మధ్యతరహా నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేశారు. 1996లో మంత్రివర్గ మార్పుల్లో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రిగా 1999వరకు కొనసాగారు. 2001లో తిరిగి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2002లో జరిగిన మంత్రివర్గ మార్పులు చేర్పుల్లో కోడెల వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో ఆరవసారి ఎమ్మెల్యేగా సత్తెనపల్లి నుంచి గెలుపొంది నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా పనిచేశారు. నరసరావుపేట నియోజకవర్గ అభివృద్ధిలో అయనది చెరగని ముద్ర. కోడెల అంటే అభివృద్ధి.. అభివృద్ధి అంటే కోడెల అన్నంతగా గుర్తింపు పొందారు. పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కోడెల రక్షితత మంచినీటి పథకాన్ని విస్తరింపచేశారు. అయన కృషి ఫలితంగా పట్టణంలో రెండు పూటలా నీటి సరఫరా జరుగుతోంది. పట్టణ రూపురేఖలు మార్చిన ఘనత అయనది. పట్టణంలో రోడ్ల విస్తరణ, నూతన రహదారుల నిర్మాణం, క్రీడా ప్రాంగణం, సాంస్కృతిక కేంద్రం భువన చంద్ర టౌన్ హాలు, రోడ్ల విద్యుదీకరణ, పార్కుల నిర్మాణం, షాదీఖానా, స్కూల్ భవనాలు, తదితర పనులను పూర్తి చేయడంలో కోడెల కీలక పాత్ర పోషిం చారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి చేశారు. 2019 సెప్టెంబర్ 16న ఆయన మృతి చెందారు.

అక్రమ కేసులతో వేధింపులు

- బల్లికురవ ఎస్ఐపై ఎస్పీకి బాధితుల ఫిర్యాదు

బాపట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాలకపార్టీకి కొమ్ముకాస్తూ తప్పుడు కేసులతో తమను బల్లికురవ ఎస్ఐ నాగశివారెడ్డి వేధిస్తున్నారని మండల పరిధిలోని ఉప్పుమాగులూరుకు చెందిన గ్రామస్థులు మంగళవారం ఎస్పీ వకుల్‌జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ మద్దతుదారులే లక్ష్యంగా ఎస్ఐ కేసుల పర్వం నడుస్తోందని బాధితులు ఆరోపించారు. ఇటీవల వేమవరం నాలుగురోడ్ల కూడలి వద్ద ఘర్షణకు సంబంధించి ఎలాంటి విచారణ జరపకుండానే హత్యాయత్నం కేసు నమోదు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాదానికి కారణమైన గోపిరాజుపై నామమాత్రపు కేసుతో సరిపెట్టిన పోలీసులు అతడి ఫిర్యాదు మేరకు టీడీపీ నేత నాగరాజు సహా మరో ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఘటనతో ఎలాంటి సంబధం లేని గ్రామంలో ఉండని వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశారని ఎస్పీ దృష్టికి బాధితులు తీసుకెళ్లారు. అక్కడి సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తే ఆ గొడవలో ఉన్నవారెవరో తెలుస్తోందని ఆ దిశగా విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితుల కుటుంబ సభ్యులు ఎస్పీని కోరారు.

వివాదస్పదంగా ఎస్ఐ తీరు...

అధికారపార్టీ కార్యకర్తలాగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఎస్ఐ నాగశివారెడ్డిపై వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల మద్యం అమ్మకాలు సాగిస్తున్నాడనే నెపంతో టీడీపీ మద్దతుదారుడైన ఓ వృద్ధుడిపై చేయిచేసుకున్న ఘటన మొదలుకుని వైసీపీ నేతతో సన్మానం వరకు ఇలా వరుసగా ఆయన వ్యవహారశైలిపై ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఉప్పుమాగులూరుకు చెందిన గ్రామస్థులు ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు చేయడం చర్చకు దారితీసింది.


ఎస్ఐపై ఫిర్యాదు చేయడానికి ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన మహిళలు

అతిసార.. కలకలం

- తూర్పు పిన్నిబోయనవారిపాలెంలో విజృంభించిన డయేరియా
- 20మందిని గుర్తించిన వైద్యులు


ఇంటింటా తిరిగి రోగుల పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్న వైద్యసిబ్బంది

బాపట్ల, మార్చి 26: బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయనవారి పాలెం గ్రామంలో డయేరియా విజృంభించింది. ఇప్పటికే 20మందికి పైగా డయేరియా బారినపడి అల్లాడి పోతున్నారు. కొంతమంది ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరికొందరు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ పర్యవేక్షణలో అప్పికట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉస్మాన్ వైద్యబృందం, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటా తిరిగి డయేరియా భారీన పడినవారి వివరాలను సేకరిస్తున్నారు. తాగునీటి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపించారు. తాగునీటి పంపుల పక్కనే క్షీణించిన పారిశుధ్యం కారణంగా కూడా డయేరియా ప్రబలిందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కలుషిత నీరు, ఆహారం తీసుకోవటం వల్ల విరోచనాలు సంభవించాయని పలువురు పేర్కొంటున్నారు .

గ్రామంలో వైద్యశిబిరం..

రెండు రోజులుగా గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తూ వైద్యసేవలందిస్తున్నారు. అయినప్పటికి అదుపులోకి రాలేదు. మంగళవారం కూడా మరో నలుగురికి విరోచనాలు అవ్వటంతో ఆసుపత్రికి తరలించారు. పూర్తిగా అదుపులోకి వచ్చేవరకు గ్రామంలో వైద్యశిభిరం కొనసాగిస్తామని డాక్టర్ ఉస్మాన్ తెలిపారు. తాగునీటి శాంపిల్స్ పరీక్షించిన తర్వాత దీనికి గల కారణాలను వివరిస్తామన్నారు. రైతులు పొలాలకు వెళ్ళి ఎండలో పనిచేస్తూ కలుషిత ఆహార పదార్థాలు తీసుకోవటం వల్ల కూడా వ్యాపించి ఉండవచ్చు అంటున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పులి శరత్‌బాబు, జిల్లా మలేరియాధికారి వై.రాజకుమార్, కమ్యూనిటిహెల్త్ ఆఫీసర్ సువర్ణకుమారి, రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు పల్నాటి శ్రీరాములు, స్టాలిన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వాణిసుమన్విత, వైద్యసిబ్బంది దుర్గమ్మ, రత్నశేఖర్, షకీల్, శ్రీనివాసరావు, శ్రావణి, తిరుపతమ్మ, కోటమ్మ తదితరులు సేవలందిస్తున్నారు.

నాలుగు రోజుల క్రితం వృద్ధురాలు మృతి

గ్రామంలో నాలుగు రోజుల క్రితం శతాధిక వృద్ధురాలు మృతి చెందింది. అంత్యక్రియలలో పాల్గొని వచ్చిన వారిలో కొంతమందికి విరోచనాలు కావటంతో గ్రామస్తులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి పథకం లేదు..

బాపట్ల పట్టణంలో విలీనం చేసిన గ్రామ పంచాయతీల జాబితాలో తూర్పు పిన్నిబోయనవారిపాలెం కూడా ఉండటం వల్ల ఇక్కడ ఎన్నికలు జరగలేదు. దీనివల్ల 15వ ఆర్థిక సంఘ నిధులు రాకుండా పోయాయి. ఫలితంగా తాగునీటి పథకం మూలనపడింది. దీంతో గ్రామస్తులంతా చేతిపంపులతో బోరువాటర్, ప్లాంట్‌లు నుంచి వచ్చే మినరల్‌వాటర్ తాగుతున్నారు. నాలుగేళ్లుగా గ్రామంలో ఇదే పరిస్థితి. పారిశుధ్య పనులు చేసేవారికి ఇంటిపన్ను ద్వారా వచ్చే డబ్బులే వేతనాలు కూడా చెల్లించాల్సిన పరిస్థితి.


తూర్పుపిన్నిబోయన వారిపాలెం గ్రామంలో తాగునీటి శాంపిల్స్ సేకరిస్తున్న వైద్యబృందం


ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులు.

వచ్చే నెల 16 వరకే..

ఓట్ల నమోదుకు దరఖాస్తుల స్వీకరణ

యువకులతోపాటు వివిధ కారణాలతో తొలగించిన వారి ఓట్లు నమోదుకు అవకాశం

ఓట్ల తొలగింపులకు వచ్చే దరఖాస్తులు స్వీకరణ

అయితే ఎన్నికల కమిషన్ అనుమతి తప్పనిసరి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 26 : జిల్లాలో యువకులతోపాటు వివిధ కారణాలతో తొలగింపునకు గురైన వారు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు వచ్చేనెల 16వతేదీ వరకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. 18 ఏళ్లు పైబడిన యువతీ, యువకులతోపాటు వివిధ కారణాలతో అధికారపార్టీ నాయకుల అండతో అక్రమంగా తొలగించిన వారు కూడా కొత్త ఓటును నమోదు చేసుకోవచ్చు. ఓటుహక్కు నమోదు దరఖాస్తులను ఆన్‌లైన్‌తోపాటు మ్యానువల్‌గా బూత్‌లెవల్ అధికారులు(బీఎల్వో)లు, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో కూడా చేసుకోవచ్చు. అలా నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను విచారణ చేసి అర్హత ఉంటే వెంటనే ఓటుహక్కు కల్పించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. అలా ఇప్పటివరకు జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో సుమారు 6వేలకుపైగా కొత్తగా ఓటుహక్కు కోసం దరఖాస్తులు రాగా తొలగింపుల కోసం ఫాం-7లు వెయ్యి వచ్చాయి. చేర్పులు, మార్పుల కోసం ఫాం-8 దరఖాస్తులు మరో వెయ్యి వరకు వచ్చాయి. ఆయా దరఖాస్తులపై సంబంధిత రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. అయితే దరఖాస్తులపై క్షేత్రస్థాయిలోనే విచారణ చేసి అర్హత ఉంటే వారికి సత్వరమే ఓటుహక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఓట్ల తొలగింపుల కోసం వచ్చే దరఖాస్తులను విచారణ చేసి జిల్లా కేంద్రానికి పంపితే ఆ ప్రతిపాదనలు ఎన్నికల కమిషన్‌కు పంపుతారు. అక్కడ అనుమతి ఇచ్చిన తర్వాతనే ఆ ఓట్లను తొలగించనున్నారు. చేర్పులు, మార్పుల కోసం వచ్చే దరఖాస్తులను స్థానికంగా మార్చేందుకు అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ దిశానిర్దేశం చేసింది. ప్రధానంగా జిల్లాలో గతేడాది అక్టోబరు నుంచి జనవరి వరకు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ సమయంలో జిల్లాలోని అనేక ప్రాంతాల్లో విచ్చలవిడిగా ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరుల ఓట్లను తొలగించారు. ఆ సమయంలో అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకొని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నామినేషన్లకు రెండు రోజుల ముందు వరకు కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించడంతో ఆ అవకాశాన్ని ఓటుహక్కును కోల్పోయిన వారితో పాటు 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కును పొందేందుకు అవకాశం లభించింది.

కోడ్‌లో గుర్తొచ్చిన అభివృద్ధా!

ప్రచారంలో వైసీపీ నేతలను ప్రశ్నించిన ప్రజలు

అప్పటికప్పుడు సొంత నిధులతో పనులు..

పైకి మాత్రం స్థానికులే ఖర్చుపెడుతున్నట్లు కలరింగ్

అయ్యన్నశెట్టిసత్రం వద్ద హడావుడిగా రోడ్లు, విద్యుత్ స్తంభాలు



చెట్లు నరికేస్తున్న దృశ్యం

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 26: ఎన్నికల వేళ అధికారపార్టీ గిమ్మిక్కులు చేస్తోంది. నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని అయ్యన్నశెట్టి సత్రం వద్ద అభివృద్ధి పనులే ఇందుకు నిదర్శనం. పనుల విషయం వైసీపీ నేతలకు కోడ్ వచ్చాక గుర్తొచ్చినట్టు ఉంది. ఇప్పటివరకు ఆ ప్రాంతంలో కనీస రోడ్లు, విద్యుత్ స్తంభాలు, తాగునీటి సౌకర్యం కరువయ్యాయి. అయితే దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తాగునీటి సరఫరా కోసం పైపులైన్లు వేయగా, ఆ తర్వాత ఆ వీధులను పట్టించుకున్న నాథుడు లేరు. తమ కాలనీలోనే అనేక సమస్యలు ఉన్నాయని, వైసీపీ నేతలు చుట్టూ తిరిగినా, ఆ ప్రాంత కార్పొరేటర్‌కు విన్నవించుకున్నా కనికరించలేదు. అయితే తాజాగా వైసీపీ ఎమ్మెల్యే కుటుంబసభ్యులు ఇటీవల ఆ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తమ ప్రాంత సమస్యలపై వారిని స్థానికులు నిలదీయగా, తప్పకుండా రోడ్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తామని అందరి ముందు హామీ ఇచ్చారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాటి నిర్మాణం కోసం అవసరమైన నిధులు ఇస్తామని తెలిపారు. అయితే ఎవరైనా అడిగితే తామే సొంతంగా డబ్బులు సేకరించుకుని రోడ్లు వేసుకుంటున్నామని చెప్పండని స్థానికులతో ఒప్పందం చేసుకోవడం విశేషం. కాగా ఈ విషయం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశమైంది. ఐదేళ్లపాటు తమ వీధుల అభివృద్ధి గురించి పట్టించుకోని వైసీపీ నేతలకు ఎన్నికలు వచ్చాక అభివృద్ధి గుర్తొచ్చిందా? అంటూ విమర్శిస్తున్నారు. మిగతా డివిజన్లలో కూడా అలాగే రోడ్లు, స్తంభాలు, ఇతర అభివృద్ధి పనుల చేయాలంటూ ప్రచారానికి వస్తే అడగడానికి అందరూ సిద్ధమవుతున్నారు.

మూడుచోట్ల ముచ్చెమటలే..!

అద్దంకిలో అదుపుకాక వైసీపీ బెదిరింపులు

పర్చూరులో వైసీపీ అసమ్మతి సైలెంట్

టీడీపీలోకి పోలోమని వలసలు

ఆమంచి కట్టడికి వ్యూహం, ఫలించిన వైనం



ఆంధ్రజ్యోతి, ఒంగోలు :

అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలలో అధికార వైసీపీ అసమ్మతులు ఏమాత్రం చల్లబడలేదు. రోజులు గడిచేకొద్ది ఆ పార్టీని కొత్త సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో ఈ మూడు నియోజకవర్గాలలోనూ వైసీపీ అభ్యర్థులకు ముచ్చెమటలు పడుతున్నాయి. ఇదే సమయంలో టీడీపీలోకి వలసలు పెరిగిపోతుండడం గమనార్హం. దీంతో అసమ్మతులలో వలసలను కట్టడి చేసేందుకు బెదిరింపు రాజకీయాలకు వైసీపీ పాల్పడుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో ఉన్న ఈ మూడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇరుపార్టీల అభ్యర్థులు ప్రకటించగా వారు ప్రచార రంగంలో కూడా దూసుకుపోతున్నారు. రోజురోజుకూ టీడీపీలోకి వలసలు పెరుగుతుండగా వైసీపీలో అసమ్మతి రగడ తగ్గకపోగా రోజుకోకొత్త సమస్య ఎదురవుతోంది. పార్టీలోని అసమ్మతి నాయకులను తొలి నుంచి కట్టడి చేసేందుకు దిగినా ఇప్పటికయితే ఆశించిన ఫలితం లభించలేదు.

అదుపుకాని అద్దంకి

అద్దంకి నియోజకవర్గంలో అభ్యర్థి ఎంపికలోనే వైసీపీ అధిష్ఠానం తడబాటుకు గురైంది. అధిష్ఠాన నిర్ణయాన్ని వ్యతిరేకించిన బాచిన క్రిష్ణచైతన్యను బెదిరించి కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఆయన క్వారీలలో తనిఖీలు చేసి భారీ జరిమానాలు వేసి మూతపడే విధంగా చేశారు. చివరకు ఆయన టీడీపీలో చేరిపోవడంతో తొలి దెబ్బ తగిలింది. అనంతరం వైసీపీ అభ్యర్థి వ్యవహార శైలిని జీర్ణించుకోలేని కొందరు నాయకులు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. వలసల పర్వం ఆగకపోవడంతో కిందిస్థాయి వరకు నాయకులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. అటు పోలీసు, ఇటు రెవెన్యూ, మరోవైపు మైనింగ్ అధికారులను ఉపయోగించి పార్టీని వీడే వారిపై కట్టడి ప్రయోగం చేశారు. ఇసుకను అక్రమంగా అమ్ముకోండి, గ్రానైట్‌ను అక్రమంగా రవాణా చేసుకోండి, అధికారులు అడ్డురాకుండా చూస్తామంటూ ప్రచారం చేశారు. దీంతో అక్రమ రవాణాలు జరుగుతున్నా అధికారులు ఆ వైపు చూడకుండా కట్టడి చేసుకున్నారు. ఇంకోవైపు ఎంతైనా డబ్బులు ఇస్తాం రండహో అంటూ ఊరూవాడా ప్రచారం చేశారు. ఇన్ని చేసినా ఆ పార్టీ నుంచి టీడీపీలోకి వలసలు ఆగలేదు. పైగా అసమ్మతితో సైలెంట్ అయిన వైసీపీ శ్రేణులు ఆ పార్టీ జెండా పట్టలేదు. దీంతో పోలీసుల ద్వారా బెదిరింపులకు శ్రీకారం పలికారు. చివరకు వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి బహిరంగంగా బెదిరింపు మాటలకు దిగారు. నిబంధనలు ఉల్లంఘించిన వలంటీర్లను రక్షించే పనిలో పడ్డారు. అవసరమైతే వలంటీర్లందరి చేత రాజీనామా చేయించి పార్టీ ప్రచారానికి వాడుకుంటామని ప్రకటించారు. ఇంకోవైపు మళ్లీ అధికారంలోకి వచ్చేది వైసీపే, అప్పుడు మీ అంతు చూస్తామంటూ పరోక్ష బెదిరింపులకు దిగారు. అయినా సమన్వయంతో ముందుకు పోతున్న టీడీపీ అభ్యర్థి రవికుమార్ స్థానికంగా తన పనులు తాను చేసేస్తున్నాడు.

పర్చూరులో పెరిగిన వలసలు

పర్చూరులో మూడో కృష్ణునిగా రంగంలోకి తెచ్చిన బాలాజీకి పార్టీ శ్రేణుల నుంచి ఎలాంటి సహకారం లభించడం లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికీ ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించకుండా నాయకులను కలవడం, ఆయా కార్యక్రమాలకు ఆహ్వానం పలికిన నాయకుల ఇళ్లకు వెళ్లి ఫంక్షన్‌లలో పాల్గొంటానికే పరిమితమయ్యారు. గతంలో ఆమంచి క్రిష్ణమోహన్‌కు వ్యతిరేకంగా ఉన్న అసమ్మతి వర్గంలో ఒకరిని మినహా మిగిలిన వారంతా సైలెంట్ అయ్యారు. ఆమంచితోపాటు అంతకుముందు ఇన్‌చార్జిగా పని చేసిన డీసీఎంఎస్ చైర్మన్ రామనాథంబాబు పార్టీ కార్యక్రమాలలో కనిపించడం లేదు. మరో మాజీ ఇన్‌చార్జి గొట్టిపాటి భరత్ ఇంటికి ప్రారంభంలో వెళ్లి ఆయన ఏర్పాటు చేసిన అనుచరుల సమావేశంలో బాలాజీ పాల్గొన్నారు. ఆ తరువాత ఇక స్వగ్రామమైన యద్దనపూడిలో జరిగిన పార్టీ కార్యక్రమానికి కూడా ఆయనను ఆహ్వానించలేదు. దీనితో ఆయనతోపాటు ఆయన అనుచరులంతా అలకపాన్పు ఎక్కారు. అటుచూస్తే టీడీపీలోకి గ్రామ, వార్డు స్థాయిలో ఓటర్లపై పట్టు ఉన్న నాయకులంతా పోలోమని వలసలు పోతున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ వలసల పర్వం అధికంగా ఉండడం విశేషం. ఎన్నికల ప్రణాళిక నిర్వహణలో ఆరితేరిన టీడీపీ అభ్యర్థి ఏలూరు సాంబశివరావు ఎక్కడికక్కడ పార్టీలోని పాత నాయకత్వం, కొత్తగా చేరే వారిని సమన్వయం చేసుకుంటూ ముందుకు పోవడంలో నిమగ్నమయ్యారు.

చీరాలలో కుదుటపడని కుంపటి

చీరాల నియోజకవర్గంలో వైసీపీ నేతల ఐక్యతకు పార్టీ అధిష్ఠానం చేసిన ప్రయోగాలు ఏవీ ఫలించడం లేదు. ఆ పార్టీలో ఉన్న బీసీ వర్గానికి చెందిన మాజీ మంత్రి పాలేటి రామారావు టీడీపీలో చేరిపోయారు. ఇక్కడ మాజీ ఎమ్మెల్యే ఆమంచి క్రిష్ణమోహన్‌ను పార్టీ అభ్యర్థితో సమన్వయం చేసేందుకు రంగంలోకి దిగిన కొందరు పెద్దలు చివరికి చేతులు ఎత్తివేశారు. అడపాదడపా రోజు మార్చిరోజు ఆయన నియోజకవర్గంలోని అనుచరులతో భవిష్యత్తు రాజకీయంపై మంతనాలు జరుపుతూనే ఉన్నారు. ఆమంచి స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి వచ్చే అవకాశాలు పెరిగాయి. దీంతో అధిష్ఠానం ఆయనను కట్టడి చేసేందుకు బ్రహ్మాస్త్రం ప్రయోగించింది. ఆయన, వారి బంధువుల వ్యాపార సంస్థల విద్యుత్ బకాయిలు ఉండటాన్ని వెలుగులోకి తీసింది. పార్టీ లైన్ తప్పితే విద్యుత్ లైన్ కట్ అవుతుందంటూ హెచ్చరించింది. ఇతరత్రా ఉన్న కొన్ని వ్యవహారాలను వెలుగులోకి తీసే పనిలో యంత్రాంగం పడిపోయింది. ఈ రేసులో ఆమంచి వెనక్కు తగ్గుతారా, సమరానికి సై అంటారా అనేది తేలాల్సి ఉంది. అయితే చీరాలలో తన రాజకీయ భవిష్యత్తుకు అడ్డంకిగా వచ్చిన వైసీపీ అభ్యర్థి వెంకటేష్‌ను గెలువనిచ్చే పని లేదంటూ ప్రజల్లో చెబుతున్నట్లు సమాచారం. టీడీపీ అభ్యర్థి ఎం.ఎం.కొండయ్య నియోజకవర్గంలో ఉన్న బడుగు బలహీన వర్గాల ప్రతినిధిగా దూసుకుపోయే చర్యల్లో ముందున్నారు.

ఎన్నికలకు సిద్ధమవుతున్న పోలీసు

మూడు కంపెనీల అదనపు బలగాలు రాక

8,517 మంది వరకు బైండోవర్

సమస్యాత్మక గ్రామాలు 90 గుర్తింపు



ఒంగోలు(క్రైం), మార్చి 26 : సార్వత్రిక ఎన్నికలకు పోలీసులు సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల అనుభవాలు దృష్టిలో ఉంచుకొని పటిష్ఠ చర్యలు చేపడుతున్నారు. గత 15 ఏళ్లలో ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటనలు ఆధారంగా 90గ్రామాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల సందర్భంగా వివాదాలు సృష్టించే వారిపై నిఘా ఉంచారు. అంతేకాకుండా ఇప్పటికే 8,517 మందిని బైండోవర్ చేశారు. జిల్లాకు మూడు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చి ఆయా గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఎస్పీ ముందస్తు చర్యలు చేపట్టారు. ఇటీవల గిద్దలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గిరిజన యువకుడు మనయ్య వైసీపీ వర్గీయుల చేతిలో హత్యకు గురికావడంపై ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు స్వయంగా ఎస్పీ ఎస్ఈసీ ముందు హాజరై జిల్లాలో శాంతిభద్రతలపై తీసుకున్న చర్యలు, హత్యోదంతం గల కారణాలు వివరించి వచ్చారు. అదే క్రమంలో గత ఐదు నెలలుగా రాజకీయ వివాదాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై ఏమైనా కేసులు నమోదు కాకుండా పెండింగ్ ఉన్నాయా? అని అడిగి తెలుసుకొని అవసరమైతే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీచేశారు. అంతేకాకుండా శాంతిభద్రతల సమస్య తలెత్తితే సంబంధిత అధికారిపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరికలు జారీచేశారు. దీంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు

జిల్లాలో 90 గ్రామాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. మొత్తం 2,183 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 434 సమస్యాత్మక కేంద్రాలుగా పోలీసులు తేల్చారు. ఈమేరకు ఇప్పటికే మూడు కంపెనీల కేంద్ర బలగాలు ఒంగోలు, మార్కాపురం, కనిగిరిలో మకాం వేశాయి. ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహించారు. సంబంధిత పోలీసు అధికారులు అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకూడదని తెలుపుతున్నారు.

రౌడీషీటర్లపై నిఘా

శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రౌడీషీటర్లపై నిఘా ఉంచారు. అదేవిధంగా ఎన్నికల సందర్భంగా గొడవలు సృష్టించేవారు, వివాదాలలో తలదూర్చే దురుసు స్వభావం గలవారిని పోలీసు నిఘావర్గాల ద్వారా గుర్తించి ఇప్పటికే 8,517 మందిని మండల మేజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేయించారు. ఇంకా ఇలాంటి ప్రక్రియ కొనసాగుతోంది. వీరిలో 1,036 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వారి కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. బైండోవర్ చేయడం ద్వారా ఆరునెలలు పాటు వారు పోలీసులు తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారు.

సంబంధిత పోలీసు అధికార్లదే బాధ్యత: ఎస్పీ

అవాంచనీయ ఘటనలు జరిగితే సంబంధిత పోలీసు అధికారులే బాధ్యత వహించాలని ఎస్పీ పరమేశ్వరరెడ్డి తెలిపారు. చెక్‌పోస్టులు వద్ద అప్రమత్తంగా ఉండి మద్యం, గంజాయి, ఓటర్లను ప్రలోభపెట్టే సామగ్రి రవాణా కాకుండా చూడాలని ఆదేశించారు. ఎన్నికల వివాదాలపై సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. గ్రామాలలో నిఘావర్గాల ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకోవాలన్నారు.

8న సాగర్ నీరు వచ్చే అవకాశం

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్ దినేష్‌కుమార్



కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 26: జిల్లాలో తాగునీటి అవసరాల కోసం వచ్చేనెల 8వ తేదీన సాగర్ నీరు వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. సాగర్ నీటిని ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ఎస్ఎస్ ట్యాంకులు, చెరువులు నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఆయాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సాగర్ నుంచి విడుదల చేసే నీటిని వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం పక్కా ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. నీరు వచ్చేసమయంలో కాలువలపై నిరంతరం మానిటరింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో చేతిపంపుల రిపేర్లు ఉంటే వెంటనే చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో గ్రౌండ్ వాటర్ పెంచేందుకు చెక్‌డ్యామ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అందుకోసం డ్వామా, ఇరిగేషన్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా పరిశీలించి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీతో పాటు ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

చెక్కపోస్టుల ఏర్పాటు

జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్నందున సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెక్‌పోస్టుల వద్ద నిరంతరం తనిఖీలు చేయాలన్నారు. నగదుతోపాటు ఇతర వస్తువులు పట్టుబడితే వెంటనే సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. నిరంతరం చెక్‌పోస్టులను సమీప స్టేషన్ హెచ్‌ఓడీ పరిశీలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల తనిఖీ నివేదికలు ఏరోజుకారోజు పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో శ్రీలత, ఏఎస్పీలు నాగేశ్వరరావు, శ్రీధర్‌రావు, డీటీసీ సుశీల పాల్గొన్నారు.

మద్యం మాకే!

ఎన్నికల ప్రచారంలో కీలక భూమిక పోషించే లిక్కర్‌పై అధికారపార్టీ ఎత్తులు.. కుయుక్తులు ఆరంభమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదల తర్వాత కూడా యథేచ్ఛగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వైసీపీ నేతలు ఈ విషయంలోనూ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు అధికారదర్పం ప్రదర్శిస్తున్నారు. ప్రభుత్వ దుకాణాల నుంచి మద్యాన్ని తమకే విక్రయించాలని, ప్రత్యర్థిపక్షం వారికి అమ్మితే ఖబడ్దార్ అంటూ సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. తదనుగుణంగా కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నేతలు ప్రభుత్వ దుకాణాల నుంచి నేరుగా గ్రామాలకు మద్యం పంపి నిల్వచేసే ప్రక్రియకు శ్రీకారం పలికారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు, సొంత పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం రగిలించుకునేందుకు అభ్యర్థులు మద్యాన్ని పంపిణీ చేసే విషయం జగమెరిగిన సత్యం. ఈ పర్యాయం కూడా మద్యం సేకరణ విషయంలో అనేక సమస్యలు ఎదురవుతున్నా ఉమ్మడి జిల్లాలో రమారమి రూ.100 కోట్లపైన కొనుగోలుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే రూ.50 కోట్ల మేర అడ్వాన్స్‌లు కూడా చెల్లించగా, కొన్నిచోట్ల అక్రమ నిల్వలు కూడా ప్రారంభమయ్యాయి.

ప్రత్యర్థి పక్షం వారికి అమ్మవద్దు

ప్రభుత్వ వైన్ దుకాణాల సిబ్బందికి వైసీపీ నేతల హుకుం

ఎన్నికల వేళ ఎక్కడికక్కడ భారీగా నిల్వలు

దుకాణాల నుంచి నేరుగా గ్రామాలకు సరఫరా

ఇతర రాష్ట్రాల నుంచీ భారీగా దిగుమతి

లిక్కర్ కోసం ఉమ్మడి జిల్లాలో


రూ.100 కోట్లు వెచ్చించేందుకు సిద్ధం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

ఎన్నికలలో గత రెండు దశాబ్దాలుగా లిక్కర్ పాత్ర కీలకంగా మారింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు జనసమీకరణలో మద్యం ప్రభావం ఏ స్థాయిలో ఉందో స్పష్టమైంది. ఇక ఎన్నికల ప్రచార కార్యక్రమాలు, అలాగే ఆయా ప్రాంతాల్లో పార్టీశ్రేణులు నిత్యం ఓటర్లను ఆకట్టుకునే ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. అందుకోసం ఆయా పోలింగ్ కేంద్రాల వారీ మద్యం బాటిళ్లు సరఫరా చేయడం గత కొన్ని ఎలక్షన్స్ నుంచి అధికమైంది. ప్రస్తుతం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే.. మద్యం సేకరణకు ప్రధాన పార్టీల అభ్యర్థులు భారీ ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడైంది. ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలకు, జిల్లాతో సంబంధం ఉన్న మూడు లోక్‌సభ స్థానాలకు అధికార వైసీపీ అభ్యర్థులను ప్రకటించింది. విపక్ష తెలుగుదేశం పార్టీ దర్శి మినహా మిగిలిన అసెంబ్లీ సెగ్మెంట్‌లతోపాటు రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీలో రానుండటం ఖాయమైంది. దీంతో వారు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. దీంతో అభ్యర్థులు అవసరమైన ఎన్నికల ప్రచార సామగ్రిని సమకూర్చుకోవడంతోపాటు లిక్కర్ కొనుగోలుకు పూర్తి ప్రాధాన్యం ఇచ్చారు.

అధికార వైసీపీ కుయుక్తి

లిక్కర్ కొనుగోలు విషయంలో పలుచోట్ల వైసీపీ నేతలు, అభ్యర్థులు కుయుక్తులు పన్నుతున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లకు భారీగా మద్యం తెప్పించుకొని ఆయా పార్టీలకు అమ్ముకునే అవకాశం ఉంది. అయితే బార్ల నిర్వాహకులు ముందుగా డబ్బులు కట్టి మద్యం తెచ్చుకోవాలి. అలా వచ్చిన మద్యానికి సంబంధించి రోజువారీ విక్రయించిన వివరాలను అధికారులకు చూపించాలి. దీంతో ఎన్నికల సమయంలో పోటీకి సిద్ధమని ముందే నిర్ధారించుకున్న అభ్యర్థులు కొన్ని షాపుల వారికి డబ్బులు చెల్లించి అధికమొత్తంలో లిక్కర్ తెప్పించుకోగలిగారు. అలా వచ్చిన మద్యాన్ని రోజువారీ మద్యం సేవించే వారికి విక్రయిస్తున్నట్లు చూపిస్తున్న యజమానులు దాన్ని వారు ఒప్పందం కుదుర్చుకున్న అభ్యర్థులకు సరఫరా చేశారు. కొందరు బార్ల యజమానులైతే మద్యంను వారి వద్ద అక్రమంగా నిల్వ ఉంచి అభ్యర్థులు కోరిన ప్రకారం ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందుకోసం ఆయా బార్లలో మద్యం కొనుగోలు చేసిన అభ్యర్థులకు పార్టీశ్రేణులకు స్లిప్పులు ఇస్తే వాటిని చూపించి బార్ల నుంచి మద్యం తీసుకెళ్లే విధంగా ప్లాన్ చేశారు. ఈ ప్రక్రియ ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కార్పొరేషన్ అయిన ఒంగోలు, మునిసిపాలిటీలు అయిన మార్కాపురం, కందుకూరు చీరాల, నగర పంచాయతీలైన గిద్దలూరు. కనిగిరి, దర్శి, చీమకుర్తి, అద్దంకి తదితర ప్రాంతాల్లో జరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించి కోడ్ అమల్లోకి వచ్చేవరకు బార్లకు ప్రభుత్వం అడిగినంత లిక్కర్ కూడా సరఫరా చేసింది. అయితే కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత బార్లకు ఎడాపెడా మద్యం సరపరా చేయకుండా నియంత్రించింది. జిల్లాలో బార్ల నిర్వాహకుల్లో అన్ని పార్టీల మద్దతుదారులు ఉన్నారు. రాజకీయంగా సంబంధం లేని వారూ ఉన్నారు. వ్యాపార వ్యవహారం కాబట్టి అధికారపార్టీ వారికి పెద్ద మొత్తంలో సరఫరా చేసినా ఇతర పార్టీల వారికి అంతో ఇంతో మద్యంను విక్రయించారు.



ఇతర రాష్ట్రాల నుంచి కూడా..

విశ్వసనీయ సమాచారం మేర కు కొన్ని ప్రాంతాల్లో ఇతర రాష్ట్రా ల మద్యం దిగుమతి ఒక క్రమపద్ధతిలో జరిగిపోయింది. ఇటు తెలంగాణ, అటు కర్ణాటక. ఇంకోవైపు ఉత్తర భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల నుంచి ముందుగానే మద్యం సేకరించుకున్న కొందరు ప్రస్తుతం అభ్యర్థులకు అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. మేదరమెట్ల సమీపంలో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభకు జిల్లా నలుమూలల నుంచి వెళ్లిన ప్రతి వాహనంలో మద్యం ఏరులై పారడం కనిపించింది.

రూ.100 కోట్ల విలువైన మద్యం సరఫరాకు సిద్ధం

ఇప్పటి నుంచి మే 13వ తేదీ పోలింగ్ జరిగే రోజు వరకు మద్యం కోసం అభ్యర్థులు ఎంతో కొంత వెచ్చించక తప్పని పరిస్థితి నెలకొంది. పోలింగ్‌కు చివర వారంరోజులు పోలింగ్ కేంద్రాల వారీ మద్యం సరఫరా చేసేందుకు పార్టీలు సిద్ధమయ్యాయి. తదనుగుణంగా అసలు ఏం జరుగుతుందనే విషయమై ఆరాతీయగా వివిధ రూపాల్లో మద్యం సేకరణకు అభ్యర్థులు రంగం సిద్ధం చేసుకున్నట్లు వెల్లడైంది. జిల్లాలోని ఒక కీలక నియోజకవర్గంలో ఒక పార్టీ రూ.4.90కోట్ల విలువైన మద్యం కొనుగోలుకు డబ్బులు చెల్లించింది. అదేసమయంలో అధికారపక్షానికి సంబంధించి రూ.6.20 కోట్ల విలువైన మద్యం సరఫరాకు ఏర్పాట్లు జరిగిపోయాయి. చివరకు అభ్యర్థుల ఎన్నికల వ్యయం తక్కువగా ఉంటుందని భావిస్తున్న పశ్చిమప్రాంతంలోని నియోజకవర్గాల్లో ఒక్కో అభ్యర్థి రూ.4కోట్లకుపైగా మద్యం సరఫరాకు రంగం సిద్ధం చేసుకున్నట్లు కనిపించింది. ఒక ఎస్సీ రిజర్వు నియోజకవర్గంలో అధికారపార్టీ పక్షాన రూ.3కోట్లకు, విపక్ష పార్టీ పక్షాన రూ.1.65 కోట్లు మద్యానికి వెచ్చిచేందుకు సిద్ధమయ్యారు. నాటుసారా, కల్లు లాంటి మత్తు పానీయాలను కూడా అవకాశం ఉన్న మేరకు సేకరించి సరఫరా చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా నియోజకవర్గాల వారీ సరాసరిన ఒక్కో అభ్యర్థి రూ.3.5కోట్ల ప్రకారం మద్యం కొనుగోలుకు సిద్ధం కాగా, అధినేతల ఎన్నికల ప్రచార సభల సమయంలో సరఫరా చేసే మద్యం వ్యయం అదనం. అలా మొత్తంగా అసెంబ్లీ లేక పార్లమెంట్ అభ్యర్థుల పక్షాన ఒక్కో పార్టీ రూ.4కోట్లకుపైనే మద్యం కోసం ఖర్చుచేయనున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రధాన పార్టీలు కేవలం మద్యం కోసమే రూ.100 కోట్లు వెచ్చించబోతున్నారు.

ప్రభుత్వ దుకాణాల్లోనే అసలు తంతు

ప్రభుత్వ వైన్‌షాపుల్లో మద్యం విక్రయానికీ ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదు. పైగా ప్రభుత్వ దుకాణాలకు అవసరమైన మద్యంను తీసుకునేందుకు ముందుగా డబ్బులు చెల్లించాల్సిన అవసరం కూడా లేదు. ఏరోజుకారోజు పెద్దమొత్తంలో ఆర్డర్ పెట్టి మద్యం తెప్పించుకొని విక్రయించుకునే అవకాశం ఉంది. దీంతో అందరి దృష్టి ఆ వైపు మళ్లింది. ఇక్కడే అధికారపార్టీ నేతలు తమ పవర్ చూపుతున్నారు. షాపుల్లో పనిచేసే ఉద్యోగులను పిలిచి మేము చెప్పిన ప్రకారం, మేము అడిగిన కంపెనీ మద్యాన్ని ఎక్కువగా తెప్పించి మేము పంపిన వ్యక్తులకే ఇవ్వాలని హుకుం జారీ చేశారు. అంతేకాక ఆ మండలంలోని ఆయా గ్రామాలకు నేరుగా సరఫరా చేయాలని కూడా కొన్నిచోట్ల ఆదేశాలు ఇచ్చారు. బెల్టుషాపులకు సరఫరా చేసినట్లే ఆయా గ్రామాల్లో మేము చెప్పిన వారికే మద్యం కేసులు చేరవేయాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. అద్దంకి నియోజకవర్గంలో ఇటీవల ఒక వైసీపీ సమావేశంలో ఆ పార్టీ కీలక నేత 'మీ గ్రామాలకే మద్యం వస్తుంది. మద్యం దుకాణాల వారు ఇప్పటి నుంచి మే 13వ తేదీ వరకు మనం చెప్పిన వారికే విక్రయిస్తారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు జరిగిపోయాయి. నిశ్చింతగా ఉండండి' అంటూ ఆ పార్టీశ్రేణులను చెప్పడం గమనార్హం. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లోని గ్రామాలకు మద్యం కేసులు చేర్చి నిల్వ పెడుతున్నారు. ఆ మండలంలోని ప్రభుత్వ వైన్‌షాపుల నుంచే ఈ మద్యం గ్రామాలకు చేరి వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో నిల్వ చేస్తున్నారు. దర్శి నియోజకవర్గంలోని ముండ్లమూరు మండలంలో ఈ ప్రక్రియ ముమ్మరంగా జరుగుతోంది. కాగా ఆయా మద్యం దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులు ఈ విషయంలో ఇబ్బంది పడుతున్నారు. ప్రత్యర్థిపక్షం వారు మద్యం అడిగితే విక్రయించకుండా ఉండలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కొన్నిచోట్ల వారికి అడపాదడపా మద్యం ఇస్తున్నారు. చాలా షాపుల నుంచి వైసీపీ వారికి బహిరంగంగా మద్యం సరఫరా చేస్తూ టీడీపీ పక్షం వారికి రహస్యంగా విక్రయిస్తున్నారు. అందుకు గాను ఒక్కో మద్యం కేసుపై రూ.500 నుంచి రూ.1,000 వరకు అదనంగా వసూలు చేసి లబ్ధి పొందుతున్నారు.

వైసీపీ అంతం.. అదే మన పంతం



కొండయ్యకు సంఘీభావం తెలుపుతున్న మద్దతుదారులు

చీరాల, ఏప్రిల్ 22: వైసీపీ అంతం.. అదే మన పంతమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని చెప్పారు. కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమన్నారు. అందుకనుగుణంగా ప్రతిఒక్కరూ కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముందస్తు అనుమతులతో ర్యాలీలు నిర్వహించుకోవాలి

అద్దంకి, మార్చి 26: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు ముందస్తు అనుమతులు తీసుకొనిసమావేశాలు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అద్దంకి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రాజకీయ పార్టీల ప్రతినిధులు నిబంధనలు పాటించాలన్నారు. 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో పలురాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

పర్చూరు, మార్చి 26: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సభలు, సమావేశాల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) గంధం రవీందర్ అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, ఏటీ టీంల అధికారులు, పోలీసు అధికారులతో ఆర్వో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘనలకు తావులేకుండా టీమ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ నుండి కోడ్ అమల్లో ఉందన్న విషయాన్ని ఆయా రాజకీయ పార్టీలకు వివరించాలని సూచించారు. అనుమతులు లేకుండా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో పర్చూరు ఏఈఆర్వో సీహెచ్ సుబ్బయ్య, ఇంకొల్లు ఏఈఆర్వో ఎం.ప్రమీల, వివిధ టీం అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

చీరాలటౌన్, మార్చి 26: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నోడల్ అధికారి వైపీ రెడ్డి పేర్కొన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుణశీల, సుబ్బారావు, హరిహరరావు, యలమందారెడ్డి, నాగవీరభద్రాచారి, వెంకనకన్నబాబు, గోపిరెడ్డి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులపై దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

అద్దంకి, మార్చి 26: అర్చకులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సాధికార కమిటీ, బాపట్ల జిల్లా కన్వీనర్, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఆర్గనైజర్ పొన్నలూరి కిరణ్‌కుమార్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాకినాడ శివాలయంలో అర్చకులు సాయిశర్మ, విజయ్‌శర్మపై ఆలయంలో దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. అర్చకులను కాళ్ళతో తన్ని, భౌతిక దాడికి దిగిన మాజీ కార్పొరేటర్ చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలన్నారు. దాడికి పాల్పడ్డ నిందితుడికి మద్దతు ఇస్తున్న ఆలయ ఈవో, కాకినాడ జిల్లా దేవదాయ శాఖ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికలలో బ్రాహ్మణులు వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలన్నారు.

హుండీల కానుకల లెక్కింపు



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హుండీల కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అద్దంకి, మార్చి 26: శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్ల సందర్భంగా ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పది రోజులకు హుండీల కానుకల ద్వారా రూ.8,26,081 ఆదాయం వచ్చినట్లు ఈవో సుభద్ర తెలిపారు. హుండీల కానులకను మంగళవారం లెక్కించారు. యూఎస్ఏ డాలర్లు 52, బంగారం 16 గ్రాములు, వెండి 465 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. హుండీల కానుకల లెక్కింపును ఫెస్టివల్ ఆఫీసర్ తిమ్మనాయుడు, ఈవో సుభద్ర పర్యవేక్షించారు.

అలాగే, లక్ష్మీనరసింహస్వామి దేవాలయం హుండీల కానుకలను మంగళవారం చైర్మన్ నర్రావుల కొండలరావు, ఈవో కోటిరెడ్డి పర్యవేక్షణలో లెక్కించారు. హుండీల కానుకల ద్వారా గత ఏడాది రూ.1,05,270 రాగా, ఈ ఏడాది రూ.89,350 వచ్చింది. టిక్కెట్‌ల ద్వారా గత ఏడాది రూ.1,44,700 రాగా, ఈ ఏడాది 1,15,570 వచ్చింది. గత ఏడాది కంటే రూ.44,720 ఆదాయం తగ్గింది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చినగంజాం, మార్చి 26: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002- 2003 విద్యా సంవత్సరం పదో తరగతికి చెందిన పూర్వ విద్యార్థులు మండలంలోని బాపయ్యనగర్ సముద్రతీరం వద్ద మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆత్మీయంగా పలకరించుకుంటూ నాటి సంఘటనలు తలుచుకుంటూ సందడి చేశారు. పూర్వ విద్యార్థి ఆసోది సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో అమెరి కాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పల్లపోలు సురేంద్ర, రామిశెట్టి గోపినాథ్, పి.హరి కృష్ణ, ధర్మవరపు వెంకట్, నరహరి వెంకటేష్, కోడూరి సోంబాబు, బెంగుళూరు, చెన్నై వివిధ దూర ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు వచ్చి నాటి సంగతులు గుర్తు చేసుకున్నారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామిరెడ్డి, విద్యాసాగర్, దేశంశెట్టి సురేష్, పల్లపోలు శివన్నారాయణ, వెంక టేశ్వరరెడ్డి, నరసింహారెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు.

చందలూరు విద్యార్థినికి బంగారు పతకం

పంగులూరు, మార్చి 26: మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన కర్రి అలేఖ్యకు బంగారు పతకం లభించింది. బ్యాచ్‌లర్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో సెంట్రల్ యూనివర్శిటీలో ప్రథమురాలిగా నిలిచిన అలేఖ్యకు యూనివర్శిటీ గోల్డ్ మెడల్ ప్రకటించింది. 2022 సంవత్సరంలో బ్యాచ్‌లర్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ పట్టా అందుక్న అలేఖ్యకు యూనివర్శిటీ స్థాయిలో ఇటీవల జరిగిన 7వ కాన్వొకేషన్‌లో ఈ అవార్డు ప్రకటించారు. ఇంటర్ వరకు ఒంగోలులోని నవోదయ పాఠశాలలో విద్యనభ్యసించిన అలేఖ్య ఇంజనీరింగ్ విద్య కర్నాటక కేంద్రీయ విశ్వవిద్యాలయంలో పూర్తి చేసింది. గోల్డ్ మెడల్ సాధించిన అలేఖ్యకు పలువురు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ఇంకొల్లు, మార్చి 26: మండలంలోని పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసారు. సుబ్బారెడ్డిపాలెంలో రెండు చలివేంద్రాలను మంగళవారం ప్రారంభించినట్లు సర్పంచ్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. 90 రోజుల పాటు గ్రామస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గొల్లపాలెం బస్టాప్ వద్ద ఆగ్రామ యువత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు.

ఉచిత ప్రవేశాల దరఖాస్తుల గడువు పొడిగింపు

అద్దంకిటౌన్, మార్చి 26: ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో ఉచితం ప్రవేశం కోసం దరఖాస్తు గడువును పాఠశాల విద్యా సమగ్ర శిక్ష ఈనెల 31 వరకు పెంచిందని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం గతంలో ఈనెల 25 వరకు గడువు ఇచ్చిందని తెలిపారు. అధిక సంఖ్యలో విద్యార్థులకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 31వ వరకు పెంచినట్లు సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ఆయన కోరారు.

కలిసి పనిచేద్దాం.. అభివృద్ధి సాధిద్దాం

» ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

» టీడీపీలో పలువురు చేరిక



ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన కడవకుదురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు

పర్చూరు, మార్చి 26: పర్చూరు నియోజకవర్గంలో వలసల పర్వం జోరందుకుంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరుతున్న వారికి పార్టీ కండువాలుకప్పి సాదరంగా ఆహ్వానిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారు. దీంతో పార్టీలో సందడి వాతావరణం నెలకొంది. వైసీపీకి ఓటు బ్యాంకుగా ఉన్న గ్రామాల నుంచి సైతం పెద్ద ఎత్తున ఏలూరి సమక్షంలో చేరుతున్నారు. కడవకుదురు, ఆదిపూడి, పర్చూరు నుంచి పెద్ద ఎత్తున మంగళవారం పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిన అభివృద్ధి పనులన్నింటిని పునఃప్రారంభిస్తామన్నారు. గత తెలుగుదేశం హయాంలో పర్చూరు నియోజవర్గ అభివృద్ధిని పరుగులు పెట్టించినట్టు గుర్తుచేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలంతోపాటు, ఇళ్లు నిర్మించి ఇచ్చేవిధంగా కృషిచేస్తామని చెప్పారు.



టీడీపీలో చేరిన ఆదిపూడి వైసీపీ కార్యకర్తలు

ఆదిపూడి గ్రామం నుంచి వైసీపీకి చెందిన పారి స్టీఫెన్, పారి జీవన్, జోసెఫ్, తేళ్ల మధు, బత్తుల బ్లేస్సీ, జాన్‌పాల్, మహేష్, బత్తుల క్రాంతి కుమార్, మాణిక్యరావు, శ్రీకాంత్, ప్రభుదాసు, కత్తి మధు, గద్దె కార్తీక్‌లకు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే, కడవకుదరు గ్రామానికి చెందిన వైసీపీ బీసీ సామాజిక వర్గానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో చేరారు. పార్టీలోకి చేరిన వారిలో పైనం గోపి, పైనం సురేష్, కేసన సురేష్, బొర్ర అశోక్, సురగాని రామకృష్ణ, పైనం కాశీరాం, బొర్ర ఫణి, బొర్ర శోభనరావు, ఈఊరి నారాయణ, కేసన సాంబయ్య, తదితరులు ఉన్నారు.

కార్యక్రమంలో స్థానిక నాయకులు ముత్యాల రాజేష్, అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, దీర్ఘాల రమేష్ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి విస్తృత పర్యటన

పర్చూరు, మార్చి 26: పర్చూరు నియోజకవర్గంలో మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విస్తృతంగా పర్యటించారు. మార్టూరు, నూతలపాడు, భీమవరం, ఇంకొల్లు, దగ్గుబాడు, వింజనంపాడు గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజా సమస్యలను తెలుసుకుంటూ.. ప్రజలను పలుకురిస్తూ, పలు కుటుంబాలను ఓదారుస్తూ ముందుకు సాగారు. ఉదయం ఏలూరి క్యాంపు కార్యాలయంలో పలుగ్రామాలకు చెందిన నాయకులు కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయా గ్రామాల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన నాయకులతో మాట్లాడారు. దగ్గుబాడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఎం.మక్బూల్ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

నూతలపాడుకు చెందిన కానిశెట్టి సుబ్బారావు పార్థీవ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇంకొల్లుకు చెందిన నాయుడు రాజేంద్రప్రసాద్ కుటుంబసభ్యులను పరామర్శించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

» అర్చకునిపై వైసీపీ నేత దాడి అందుకు నిదర్శనం

» ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



అద్దంకి, మార్చి 26: కాకినాడ శివాలయంలో అర్చకునిపై వైసీపీ నేత దాడి ఘటన జగన్‌రెడ్డి అరాచక పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఈమేరకు మంగళవారం ఓప్రకటన విడుదల చేశారు. యథా నాయకుడు, తథా క్యాడర్ అన్న చందంగా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని అన్నారు. వేదాలు చదివి భగవంతుని సేవలో తరించే అర్చకులపై దాడి చేయటం, బెదిరింపులకు గురిచేయటం రాక్షసత్వమే అవుతుందన్నారు. పూజారులపై దాడి చేయటం అంటే దేవుడిపై దాడి చేయటమేనని అన్నారు. భగవంతుని సన్నిధిలో అందరూ ఒక్కటే అనే ఇంగిత జ్ఞానం కూడా వైసీపీ నేతలకు లేకపోవటం బాధాకరమని చెప్పారు. హిందూ దేవాలయాలు, ఆస్తులపై పూర్తి ఆధిపత్యం చెలాయించే క్రమంలోనే వైసీపీ ప్రభుత్వం దారుణాలకు ఒడిగడుతుందన్నారు. తాను తెచ్చిన పాలు శివలింగంపై సరిగా పోయలేదని అర్చకుడిపై వైసీపీ నేత చంద్రరావు దాడి చేయటం, చెంపపై కొట్టి కాలితో తన్నటంతో పాటు, అడ్డుకోబోయిన మరో అర్చకుడుపైనా దాడి చేసి బూతులు తిట్టాడన్నారు.

ఈ ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో హిందూ దేవాలయాల అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే రవికుమార్ చెప్పారు. అర్చకులకు వేతనాల పెంపు లేకపోగా, వారిపైనే దాడులకు దిగుతున్నారన్నారు. కరోనా సమయంలో చనిపోయిన అర్చకుల కుటుంబాలను కూడా జగన్‌రెడ్డి ఆదుకోలేదన్నారు. ఆయన పాలనలో అర్చకులపై వరుస దాడులు జరిగాయన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని సోమేశ్వర స్వామి ఆలయ అర్చకుడి యజ్ఞోపవీతాన్ని వైసీపీ నేత యుగంధర్ తెంపేశాడన్నారు. కర్నూలు జిల్లా ఓంకార క్షేత్రంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా అర్చకులపై ఆలయ చైర్మన్ ప్రతాపరెడ్డి దాడి చేశారన్నారు. ఎమ్మిగనూరు మండలం పార్లపల్లిలో ఆంజనేయ స్వామి గుడి అర్చకుడు సాగు చేసుకుంటున్న భూమిపై కన్నేసిన వైసీపీ నేతలు ఆక్రమించుకునేందుకు ప్రయత్నించటంతో పూజారి భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమడోలులో అర్చకుడు రామలింగాచారి ఇంటిని వైసీపీ నేతలు కూల్చేయటంతో తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. నర్సరావుపేట సమీపంలోని త్రికోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన ఓ వైసీపీ నేత తనకు అర్చకుడు సరిగ్గా మర్యాద లు చేయలేదంటూ దాడి చేశాడన్నారు. గుంటూరు జిల్లా గోరంట్లలో వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకుడు ఆరోగ్యం బాగా లేక సెలవు అడిగితే ఏకంగా అధికారులే అతనిపై దాడి చేశారన్నారు. ఇలా ఐదేళ్ళ కాలంలో లెక్కలేనన్ని సంఘటనలు జరిగాయని ఎమ్మెల్యే గొట్టిపాటి పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం, ప్రజల క్షేమం కోరే బ్రాహ్మణులు, అర్చకులపై వైసీపీ పాలనలో దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరో 47 రోజులలో రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు.

నేడు పలు గ్రామాల నేతలతో ఎమ్మెల్యే సమావేశం

అద్దంకి, మార్చి 26: పలు గ్రామాల నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ముప్పవరం వద్ద క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. అద్దంకి మండలంలోని చక్రాయపాలెం నేతలతో ఉదయం 10 గంటలకు, 10.20కి గోపాలపురం, 10.40 గంటలకు శింగరకొండపాలెం, కొత్తరెడ్డిపాలెం, 11 గంటలకు చినకొత్తపల్లి, శ్రీనివాసనగర్, 11.20కి గోవాడ, సాధునగర్, 11.40 గంటలకు కలవకూరు, గుర్రంవారిపాలెం, మధ్యాహ్నం 12 గంటలకు శంఖవరప్పాడు, 12.20కి ధర్మవరం, 12.40కి మైలవరం, ఏలేశ్వరవారిపాలెం, ఒంటి గంటకు ఉప్పలపాడు, 1.20కి వెంపరాల గ్రామాల నేతలు, కార్యకర్తలతో రవికుమార్ సమీక్ష నిర్వహించనున్నారు.

కాగా, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బుధవారం పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 8 గంటలకు సంతమాగులూరు, 8.30కి గొర్రెపాడు, 9కి కొమ్మినేనివారిపాలెం, 9.30కి బల్లికురవ, 10కి కొండాయపాలెంలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

» ఎస్పీ వకుల్ జిందాల్



మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

రామాపురం(చీరాలటౌన్), మార్చి 26: సార్వత్రిక ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. మంగళవారం సమస్యాత్మక ప్రాంతాలైన రామాపురం, కటారిపాలెం గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. ఓటర్లకు రక్షణ కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే సిబ్బందికి అన్ని విధాలుగా మార్గదర్శకాలు అందజేసినట్లు చెప్పారు. ఓటర్లు వారి హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చునని చెప్పారు. ఎవరికి భయపడాల్సిన అవసరం లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యక్రమంలో ఎస్పీతో పాటు బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ బ్రిజ్ కిషోర్‌నేగి, చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కోడ్‌ను పటిష్టంగా అమలుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఫణీంద్రబాబు

చినగంజాం, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో మోడల్ కోడ్ పటిష్టంగా అమలుచేయాలని తహసీల్దార్ ఫణీంద్రబాబు, ఎంపీడీవో వరప్రసాద్‌లు గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలను ఆదేశించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండి అనుమతి లేని ప్రకటనలు, ప్రచారాలు లేకుండా చూడాలన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలుపై మండల పరిధిలోని గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వలంటీర్లను రాజకీయ ప్రసారాలకు దూరంగా ఉంచాలన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులు వాట్సాప్ గ్రూప్, ఫేస్‌బుక్‌ల్లో మీడియా ద్వారా ఎలాంటి ఏపార్టీకి సంబంధించిన ప్రచారాలు చేయరాదని చెప్పారు. గ్రామాల్లో అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఎంసీసీ అమలు పక్కాగా చేయాలని అన్నారు. సీవిజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదుల్ని తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. ఫిర్యాదులు రాకుండా ఎంసీసీ ఉల్లంఘనలు జరగకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో తాత్కాలిక పార్టీ కార్యాలయాలు ఏర్పాటుచేయాలన్నా, కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేయాలన్నా రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని అన్నారు. సువిధ యాప్ ద్వారా అనుమతి పొందాలనే విషయాలపై గ్రామాల్లోని పార్టీ నాయకులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, ఆయా గ్రామాల వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అర్చకుడిపై వైసీపీ నేత దాడి హేయం

» కఠిన చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ సంఘాల డిమాండ్

ఒంగోలు(కల్చరల్), మార్చి 26: కాకినాడ పెద్ద శివాలయంలో ఇద్దరు అర్చకులపై వైసీపీ నాయకుడు దాడి చేయటం అత్యంత హేయనీయమైన చర్యని, అతడిపై వెంటనే చర్య తీసుకుని అరెస్ట్ చేయాలని బ్రాహ్మణ సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం ఒంగోలులో లాయర్‌పేటలో రాష్ట్ర బ్రాహ్మణ సాధికార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ టీవీ శ్రీరామమూర్తి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ జిల్లా కోఆర్డినేటర్ కామరాజుగడ్డ కుసుమకుమారి ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అర్చకులను కాళ్లతో తన్ని భౌతిక దాడికి దిగిన వైసీపీ మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రశేఖర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువంటి దాడులు అనేకం జరిగినప్పటికీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. బ్రాహ్మణులకు రక్షణ కరువైందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పొన్నలూరి శ్రీనివాసఫణి, ఆర్.శ్రీనివాస్, ఎస్ఏటీ.రాజేష్, యామిజాల ప్రసన్నకుమార్ శర్మ, ఎం.మారుతి, ఎస్.సుజాత, మురళి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లంకా ప్రసన్నకుమార్ అర్చకులపై దాడిని ఖండిస్తూ ఇటువంటివి పునరావృతం అయితే తీవ్రంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. బ్రాహ్మణులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ విషయంలో బ్రాహ్మణులందరూ ఐక్యంగా ముందుకు కదలాలని పేర్కొన్నారు. అర్చకులపై వైసీపీ నాయకులు పదే పదే దాడులకు దిగటం, దేవాలయాలను ధ్వంసం చేయటం గత నాలుగున్నరేళ్లగా పరిపాటిగా మారిందని మండిపడ్డారు. దాడిలో గాయపడిన అర్చకులకు తమ సంఘం తరపున సంఘీభావం ప్రకటిస్తున్నామని ప్రసన్న కుమార్ పేర్కొన్నారు.

అర్చకులపై దాడిని బ్రాహ్మణ సంక్షేమ సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామరాజు మల్లిఖార్జున శర్మ, అడ్మిన్ ట్రస్టీ శివదేవుని మురళీధర శర్మ తీవ్రంగా ఖండించారు. ప్రతి ఒక్కరూ క్షేమంగా ఉండాలని ఆశీర్వదించే అర్చకులపై దాడికి పాల్పడటం దారుణమన్నారు. నిందితునిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ఇటువంటివి మళ్లీ జరగకుండా ఉంటాయన్నారు.

600 మంది భక్తులకు ఉచిత వైద్యసేవలు



భక్తులకు వైద్య సేవలు అందిస్తున్న ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్ వైద్యులు

అద్దంకి, మార్చి 26: శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్లకు వచ్చిన భక్తులకు ఒంగోలు శ్రీరామ్ మల్టీ సూపర్‌స్పెషాలటీ హాస్పటల్ వైద్యులు సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు నిర్విరామంగా ఉచిత వైద్యసేవలు అందించారు. అత్యవసర వైద్యంతో పాటు ప్రాథమిక వైద్యం, షుగర్, బీపీ పరీక్షలు చేశారు. సుమారు 600 మంది భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలిపారు. జనరల్ వైద్యులు డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, మేనేజర్ దాసరి సుధాకర్, రవి, నాగరాజు, స్వర్ణలత, కృష్ణవేణి, సునీత, మణికంఠలు పాల్గొన్నారు. ఉచిత వైద్య సేవలు అందించటం పట్ల దేవాలయం ఈవో సుభద్ర, భక్తులు అభినందించారు.

శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు

పంగులూరు, మార్చి 26: మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామంలో ఈ నెల 28న జరగనున్న శ్రీకోదండ రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా మంగళవారం గ్రామోత్సవం నిర్వహించారు. వేద పండితులు మంగళవారం శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు రొంపిచర్ల వెంకట సత్యనారాణాచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

ఓటు హక్కుపై అవగాహనా ర్యాలీ

యద్దనపూడి(మార్టూరు), మార్చి 26: యద్దనపూడి గ్రామంలో మంగళవారం ఓ టు హక్కు అవగాహనా సదస్సులో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అందరూ మొదట తమ ఓటు, పోలింగ్ బూత్ వివరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది



రాజుపాలెంలో తెరుచుకోని గ్రామ సచివాలయం

మార్టూరు, మార్చి 26: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండ లంలోని రాజుపాలెం గ్రామ సచివాలయం మంగళవారం ఉదయం 10.50లకు కూడా తెరుచు కోలేదు. వరుసగా మూడు రోజులు శని, ఆది, సోమవారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు కావడంతో గ్రామ సచివాలయాలు తెరుచుకోలేదు. మంగళవారం సచివాలయాలు తెరుస్తారని వివిధ పనులు నిమిత్తం రాజుపాలెం గ్రామంలో కొంతమంది సచివాల యానికి వచ్చారు. ఉదయం 10.50 గంటలకు కూడా సచివాలయం తలుపులు తెరుచుకోకపోవడంతో మంగళవారం కూడా ఏమైనా సెలవు ఉందా అని గ్రామస్థులు ఆరా తీశారు. ఆతర్వాత ముగ్గురు గ్రామ సచివాలయ సిబ్బంది రావడంతో తలుపులు తెరుచుకున్నాయి. ఏది ఏమైనా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల సచివాలయాల్లో సమయపాలన సక్రమంగా పాటించడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

పర్చూరు బార్ అసోసియేషన్ కార్యవర్గం



శ్రీరమణి



షేక్ రేష్మ

పర్చూరు, మార్చి 26: పర్చూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ నియామకం మంగళవారం స్థానిక కోర్టు భవనాల సముదాయంలో నిర్వహించినట్లు ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా నరేంద్రకుమార్ తెలిపారు. అధ్యక్షురాలిగా చుండ్రు శ్రీరమణి, కార్యదర్శిగా షేక్ రేష్మ, కోశాధికారిగా దగ్గుబాటి రాఘవయ్య చౌదరి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యవర్గసభ్యులుగా కొల్లా నరేంద్రకుమార్, రావి శ్రీనివాసరావు, యార్లగడ్డ వెంకటేశ్వర్లు, చాగంటి సుబ్బారావు, కట్టా సాల్మన్, వెంగళశెట్టి తిరుములరావు నియమితులయ్యారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

పాఠశాలకు వితరణ

ఇంకొల్లు, మార్చి 26: తాటిపర్తివారిపాలెం ఎడ్యుకేటర్స్ గ్రూపు సభ్యులు మండలంలోని కొణికి నలతోటివారిపాలెంలోని ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం సుమారు రూ.45 వేల విలువ కలిగిన బల్లలను బహూకరించారు. గ్రూపు సభ్యులు పంది డేవిడ్, కాకి సామియేలు, కట్టా సురేష్, చెక్కా సంతోష్‌కుమార్ తదితరులు బల్లలు సమకూర్చేందుకు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవరెడ్డి, గంగవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, పంది సమర్పణరావు, ఆత్మకూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని ఆచూకీ లభ్యం

చినగంజాం, మార్చి 26: చినగంజాం ప్రాంతంలోని రొంపేరు బ్రిడ్జి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆచూకీ లభ్యమైనట్లు ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మృతుడు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దుధమానియామండలం సిదార్ గ్రామానికి చెందిన దాల్ ప్రతాప్ సింగ్(30) అని తెలిపారు. ఎనిమిది నెలల క్రితం ప్రతాప్‌సింగ్ తన సోదరులు, గ్రామస్థులతో కలిసి తమిళనాడు రాష్ట్రంలో కూలి పనుల నిమిత్తం పరం కంపెనీకి వెళ్లినట్లు తెలిపారు. మూడు నెలల క్రితం మృతుడు మతిస్థిమితం లేక పని వద్ద నుండి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రంలో పనులు పూర్తి కావడంతో మృతుని అన్నదమ్ములు, గ్రామస్థులు వారి స్వగ్రామాలకు తిరిగి వెళ్లినట్లు తెలిపారు. చీరాల ఏరియా వైద్యశాలలో మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం వైద్యశాలలోనే మృతదేహాన్ని ఉంచినట్లు తెలిపారు. మృతుని కుటుంబసభ్యులు వస్తే వారికి మృతదేహాన్ని అప్పగించనున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలికి గాయాలు

చీరాలటౌన్, మార్చి 26: ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలు గాయపడిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం మార్కెట్ సెంటర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తోటవారిపాలెంకు చెందిన ఆసాది సామ్రాజ్యం ఈపూరుపాలెం సెంటర్‌లో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో రోడ్డు దాటుతుంది. ఈక్రమంలో ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చీరాల ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు గుంటూరుకు తరలించారు. బాధితురాలి మనవడు విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


పొగాకు చెక్కుల చోరీ

మేదరమెట్ల , మార్చి 26: మండలంలోని అనమనమూరు పొలాల్లో ఉన్న పొగాకు చెక్కులను దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం తొక్కి ఉంచిన చెక్కులను దొంగలు ఎత్తుకు వెళ్లారని మందా ఏసోబు మంగళవారం కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హనుమారెడ్డికి చెందిన పొలాన్ని తీసుకుని సాగు చేసుకుంటున్నారు. సోమవారం ఉదయం చెక్కులు తొక్కి వచ్చి మరునాడు వెళ్ళిచూడగా లేవని కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తాపడి దంపతులకు తీవ్రగాయాలు

పంగులూరు, మార్చి 26: మండలంలోని ముప్పవరం - పంగులూరు గ్రామాల మధ్య మంగళవారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. తూర్పుతక్కెళ్ళపాడుకు చెందిన పాలపర్తి చిన్న, అతని భార్య మహాలక్ష్మి ముప్పవరం గ్రామ సమీపం పళ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రోజూలాగానే పళ్ళ వ్యాపారం ముగించుకుని తన ఆటోలో మిగిలిన పళ్ళు, కొబ్బరి బోండాలు వేసుకుని స్వగ్రామం బయలుదేరారు. ఆటో కోళ్ళపారం సమీపంలో అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లి పడిపోయింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం అద్దంకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 27 మార్చి 2024



సోమశిలలో పడిపోతున్న నీటిమట్టం



అనంతసాగరం : సోమశిల జలాశయంలో నీటిమట్టం పడిపోతోంది. డ్యాం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం 10.449 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 300, డెల్టాకు 1500, దక్షిణ కాలువకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రంజాన్ వేళలు ఇఫ్తార్ (బుధవారం) : 6.22 | సహరి (గురువారం) : 4.49

ఉష్ణోగ్రతలు నెల్లూరు : 35.5 25.1 | కావలి : 34.0 24.0 | కందుకూరు : 35.0 25.0 | ఆత్మకూరు : 38.0 24.0 | ఉదయగిరి : 34.0 24.0

నేతలకు నచ్చేలా.. జనం మెచ్చేలా!

- ముస్తాబవుతున్న ప్రచార రథాలు
- అత్యాధునిక వసతులతో తయారీ
- ఒక్కో వాహనానికి రూ.1 లక్ష నుంచి 6 లక్షల వరకు ఖర్చు
- నెల్లూరులో ఒక్కరే స్పెషలిస్ట్

ఎన్నికల వాతావరణం హీటెక్కుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల పేర్లు ఖరారు కావడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు, తమ పార్టీల మ్యానిఫెస్టోలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు నాయకులు పోటాపోటీగా జనం బాట పడుతున్నారు. ఎన్నికల్లో ప్రచారమే కీలకం కావడంతో ప్రచార రథాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ రథాలను తయారుచేసే నిపుణులు వీటిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. పార్టీ విధివిధానాలు, హామీలు, పార్టీ అధినేతలు, ముఖ్యుల ఫొటోలు వాహనాలకు చుట్టూ ఏర్పాటు చేయడంతోపాటు వాహనంలో ప్రత్యేకంగా స్టేజీ, సౌండ్ సిస్టమ్, కళ్లు మిరుమిట్లు గొలిపేలా లైటింగ్‌లతోపాటు జనరేటర్‌ను సైతం అమర్చుతున్నారు. నాడు ఎన్టీఆర్ చైతన్యరథం పేరుతో ప్రారంభమైన ప్రచార రథాలు నేడు రూపాలు మార్చుకుంటూ ఆధునికతను సంతరించుకుని తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. నెల్లూరులో ఎక్కువ మంది అభ్యర్థుల 'రథాలు' అన్సర్ గ్యారేజీలో ముస్తాబవుతున్నాయి.

నెల్లూరు (విద్య), మార్చి 26 : ప్రజల వద్దకు వెళ్లిన సమయంలో పార్టీల నేతలు తమ అభిప్రాయాలను ప్రజలతో పంచుకునేందుకు ఒక వేదిక ముఖ్యం కావడంతో ఈ వేదికనే తమ ప్రచార రథాల్లో ఏర్పాటు చేసుకుని పార్టీ విధివిధానాలను వాహనం మీదనుంచే ప్రజలకు తెలియచేస్తున్నారు. దీనికోసంగా తమ ప్రచార రథాలను అత్యాధునికంగా తీర్చిదిద్ది పార్టీ గుర్తులను, మ్యానిఫెస్టోను, అధినేతల ఫొటోలను అందంగా వాహనంపై ముద్రిస్తున్నారు. ఇప్పటికే పలు వాహనాలు ఆయా నియోజకవర్గాలకు చేరుకుని ప్రచారాలు కూడా ప్రారంభించగా మరికొన్ని ప్రచార రథాలు వేగవంతంగా రూపుదిద్దుకుంటున్నాయి. తక్కువ ఖర్చుతో ప్రచార వాహనాలను సిద్ధం చేస్తున్నారు. వాహనాల తయారీలో ప్రత్యేక శ్రద్ధ చూపుతూ నేతలు మెచ్చేలా తయారు చేస్తున్నారు. ఓటర్లు, ప్రజలంతా కనపడేలా వాహనానికి ఇరువైపులా ఎల్‌ఈడీ లైట్లు, అత్యధిక హార్స్‌పవర్ కలిగిన జనరేటర్, కార్డ్‌లెస్ మైక్, కార్డ్‌మైక్ అమర్చుతున్నారు. ప్రధానంగా వాహనానికి వాటర్ ప్రూఫ్ కార్పెట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు స్టీల్‌తో తయారు చేసిన మెట్లు, ఎల్‌ఈడీ డిస్‌ప్లే బోర్డులు, గన్‌మెన్‌లు నిలిచేందుకు ప్రత్యేక ఫుట్‌బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. సదరు పార్టీలకు సంబంధించిన అధినేత, నేతల ఫొటోలు, పార్టీ జెండాలు, నినాదాలను కూడా అందంగా తీర్చిదిద్దుతున్నారు.

● ఆర్థిక సామర్థ్యాన్ని బట్టి..

ప్రచార రథాలను సర్వాంగసుందరంగా, అత్యాధునికమైన హంగులతో సిద్ధం చేసేందుకు వారి సామర్థ్యాన్ని బట్టి రూ.1 లక్ష నుంచి 6లక్షల వరకు వెచ్చిస్తున్నారు. గతంలో ఈ రథాలకు బొలెరో క్యాంపేర్ వాహనాన్ని అధికంగా ఉపయోగించగా తాజాగా ఇసూజి వాహనాలనూ వినియోగి స్తున్నారు. ఇసూజి వాహనాలు శ్రీ సిటీలోనే తయారవుతుండటంతో ఈ వాహనాలకు రాష్ట్రంలో టాక్స్ మినహాయింపు ఉంటుంది. ఎన్నికల సమయంలో ఎవరి పనుల్లో వారు బిజీగా ఉండడంతో కొందరు వాహనాల టాక్స్ విషయం మరిచిపోతుంటారు. ఈ సమయంలో వాహనాన్ని తనిఖీ చేసి టాక్స్ చెల్లించకుంటే వాటిని అధికారులు సీజ్ చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికశాతం మంది నేతలు ఇసూజీ వాహనాల వైపే మొగ్గు చూపుతున్నారు

● మూడు దశాబ్దాల అనుభవం


వాహనాలను ప్రచార రథాలుగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో నెల్లూరులోని అన్సర్ కార్‌కేర్‌కు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. ఈ కార్‌కేర్ అధినేత షేక్.అన్సర్‌బాషా గతంలో బృందావనంలో ఉన్న తన షెడ్‌ను ప్రస్తుతం అయ్యప్పగుడి సమీపంలోని జ్యోతినగర్‌కు మార్పు చేశారు. తొలిసారిగా ఆనం కుటుంబానికి అప్పటి జీప్ వాహనాన్ని విజయరథం పేరుతో ప్రచారరథంగా మార్పు చేశారు. నాటి నుంచి నేటి వరకు ఎంతో మంది ప్రజాప్రతినిధులకు, నేతలకు పార్టీలకు అతీతంగా ప్రచార రథాలను సిద్ధం చేసి ఇస్తున్నారు. వాహనాన్ని తన వద్దకు తీసుకువచ్చిన తరువాత దానికి పైపింగ్‌ల ద్వారా స్టేజీని సిద్ధం చేసి లైటింగ్, స్టిక్కరింగ్, మైక్‌సెట్, ఫ్యాబ్రికేషన్, స్టేజీలు ఇతర హంగులను ఏర్పాటు చేస్తున్నారు. రథాలను హడావుడిగా సిద్ధం చేసేందుకు ఇష్టపడని అన్సర్ కేవలం ఎన్నికల సమయంలో 15 నుంచి 20 వాహనాలను మాత్రమే సిద్ధం చేసి అందిస్తారు. అది కూడా సమయం ఉంటేనే, లేని పక్షంలో తాను చేయలేనని కరాఖండీగా చెప్పేస్తారు. ఒక్కో వాహనం తయారు చేసేందుకు 15 రోజుల నుంచి నెలరోజుల సమయం పడుతుందని అన్సర్ తెలిపారు. ఒకసారి తన వద్ద తయారు చేసుకున్న వాహనం క్రమం తప్పకుండా తనవద్దకే వస్తుందని, ఏ ఎన్నికలు వచ్చినా కూడా వాటిని తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుం డా సిద్ధం చేసి ఇస్తాన న్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని నియోజక వర్గాలకు వాహనా లను సిద్ధం చేశానని, ఇంకా మరికొన్ని వాహనాలు సిద్ధమవుతున్నాయన్నారు.



రూపుదిద్దుకుంటున్న ప్రచార రథాలు



వాహనానికి లైట్లు అమరుస్తూ..



అన్సర్ కార్‌కేర్ అధినేత షేక్ అన్సర్‌బాషా



జనరేటర్ అమరిక



వైద్యశిబిరంలో కనిపిస్తున్న వారంతా ఆరోగ్య సిబ్బందే..

ఆరోగ్య సురక్ష.. వెలవెల

రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజల నుంచి స్పందన కరువవుతోంది. కొండాపురం మండలం గుడవళ్లూరు పంచాయతీ పరిధిలో మంగళవారం వైద్యశిబిరం జరిగింది. ఈ శిబిరం ఏర్పాటుపై ముందుగానే ప్రచారం చేసినా ప్రజల నుంచి ఆదరణ కరువయ్యింది. దీంతో శిబిరంలో దాదాపు కుర్చీలన్నీ ఖాళీగానే దర్శనమిచ్చాయి. కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టించుకోకుండా ఫొటోలకు ప్రాధాన్యమిచ్చారు. అంగన్‌వాడీ స్టాళ్లు కూడా శిబిరం వద్ద కనిపించలేదు.

- కొండాపురం

● రమణీయం రంగనాథుడి కల్యాణం



శ్రీవారి కల్యాణం జరుపుతున్న అర్చకులు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 26 : తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి కల్యాణం రమణీయంగా జరిగింది. ముందుగా మూలవరులకు విశేష పూలంగి సేవ జరిగింది. పెళ్లి కుమారుడిగా రంగనాథుడిని, పెళ్లి కుమార్తెలుగా శ్రీదేవి, భూదేవిలను విశేషంగా అలంకరించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణ, తరలివచ్చిన భక్తజనం నడుమ వివాహతంతును వేడుకగా నిర్వహించారు. అనంతరం కలల్యాణ మూర్తులకు నగరోత్సవం జరిగింది. కాగా, టీటీడీ తరఫున స్వామిఅమ్మవార్లకు అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. తెల్లవారుజామున గజవాహన సేవ వైభవంగా జరిగింది. ఈ వేడుకలకు చైర్మన్ శ్రీనివాసులు, సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అర్చకస్వాములు, సిబ్బంది పర్యవేక్షించారు.

● నేడు రథోత్సవం

బుధవారం ఉదయం 8.30 గంటలకు రథంపై రంగనాథుడు ఊరేగనున్నారు. ఈ వేడుకను చూసేందుకు భక్తజనం తరలిరానుంది.

మామిడీలా!

- కాపులేక వెలవెలబోతున్న చెట్లు
- ఈసారి 'బంగినపల్లి' అందని ద్రాక్షేనా!?

ఉలవపాడు, మార్చి 26 : ఎన్నడూ లేనివిధంగా ఈసారి మామిడి సాగు కౌలు రైతులను నట్టేట ముంచింది. ఉలవపాడు మండల పరిసరాల్లో విరివిగా సాగయ్యే బంగినపల్లి ఈ ఏడాది మామిడి ప్రియులకు అందని ద్రాక్షగా మారనుంది. సకాలంలో వర్షాలు కురవకపోవడం, అదును తప్పి పూత వేయడం, ఫలాభివృద్ధి చెందకపోవడం, త్రిప్స్ వంటి వైరస్, తేనెబంకతో పూతలు రాలిపోవడం వంటి కారణాలు దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. సహజంగా ఎకరాకు బంగినపల్లి మామిడి 3-4 టన్నుల దిగుమతి ఉంటుంది. ఈ ఏడాది అర టన్ను దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదని కౌలుదారులు ఆవేదన చెందుతున్నారు. అన్నిటిని తట్టుకొని నిలబడిన మామిడిపై తేనెబంక, పురుగు గోకడం వంటి ప్రభావాలు చూపడంతో కాయ నాణ్యత తగ్గిపోయింది. దీంతో దక్కిన కాపు కాస్త నాణ్యత లోపంతో మార్కెట్‌లో పెద్దగా ధర పలకదని రైతులు వాపోతున్నారు.

● నష్టాలు తప్పవా!?

మామిడి సాగులో ఈ ఏడాది భారీ నష్టాలను రైతులు చవిచూడబోతున్నారు. కౌలు రైతులు ఎక్కువ మంది కిందటి ఏడాది కాపు పూర్తి కాగానే తరువాత ఏడాది కాపుకోసం ముందస్తు బేరం కుదుర్చుకుని తోటలు కొనుగోలు చేస్తారు. అనంతరం సేద్యంలో భాగంగా అవసరమైతే నీళ్ల కట్టడం, దుక్కిదున్నకం, పూతలు వేసి పిందెలు నిలబడే వరకు పురుగు మందులు వాడుతూనే ఉంటారు. ఇవన్నీ కలిపి మామిడి కాపు కౌలు కొనుగోలుతో సమానంగా ఖర్చులు అవుతుంటాయి. ఈ ఏడాది సేద్యం ఖర్చులు కూడా బాగా పెరిగిపోవడంతో పెట్టుబడిలో పావలా వంతు వచ్చినా సంతోషమని రైతులు ఆవేదన చెందుతున్నారు.





- దిగుబడి తగ్గుదలకు కారణాలెన్నో!
- పెట్టుబడి కూడా దక్కదేమోనన్న భయం
- బిక్కముఖంతో కౌలు రైతులు

● భారీగా పలుకుతున్న ధర

దిగుబడి తక్కువ కావడంతో ముందస్తు వచ్చిన మామిడి ధర రూ.లక్ష వరకు పలుకుతుందని తోటలోనే కేజీ ధర రూ.120 వరకు పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఉలవపాడు, గుడ్లూరు, లింగసముద్రం, కావలి మండలాల పరిసర ప్రాంతాలలో ముందస్తు వచ్చిన మామిడి కోతలు జరుగుతున్నాయి. ఇదంతా ఎక్కువ భాగం ఉలవపాడు జాతీయ రహదారికి ఇరువైపులా మామిడి అంగళ్ల వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారు. అలాంటిది హైవేకు ఇరువైపులా ఈపాటికి అంగళ్లు ఏర్పాట్లు చేయాల్సి ఉండగా కాపుసరిగా రాకపోవడం, వచ్చిన కాపు అనుకూల ధర పలకపోవడంతో హైవే వ్యాపారులు అంగళ్ల ఏర్పాటులో వెనుకంజ వేస్తున్నారు.

ప్రచారాలకు అనుమతి తప్పనిసరి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మార్చి 26 : రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచారాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో సూచించారు. సమావేశాల నిర్వహణ, మైక్ సెట్టింగ్, ఆయా పార్టీల తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటు, వాహనాల వినియోగం, ప్రదర్శనలు, అందులో ఉపయోగించే లౌడ్ స్పీకర్లు, వీధి సమావేశాలు, గాలి బెలూన్ల ఏర్పాటు, అంతర జిల్లాల ప్రచార వాహనాలు, బ్యారికేడ్ల ఏర్పాటు, మైకులు లేకుండా ఏర్పాటు చేసే సమావేశాలు, ఇంటింటి లేదా గడపగడప ప్రచారం చేయడానికి ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారి నుంచి అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. కరపత్రాల పంపిణీ, జెండాలు, బ్యానర్ల ఏర్పాటు, వాల్ పోస్టర్లు అతికిం చడం, హోర్డింగ్‌ల ఏర్పాటుకూ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అలాగే పత్రికా ప్రకటనలు, స్టిక్కర్లు అతికించటం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏ కార్యక్రమం అయినా ప్రచారంలో భాగంగానే పరిగణిస్తామని తెలిపారు. అనుమతి తీసుకోకుంటే ఎన్నికల నియమావళి ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. అలాగే, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారమయ్యే రాజకీయ ప్రచార ప్రకటనలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెలిపారు.

మేం మారమంతే!

కోడ్ అమలులోకి వచ్చి 10 రోజులవుతున్నా ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం అధికార వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. వలంటీర్లు, ఫీల్డు అసిస్టెంట్లు, డీలర్లు, వీఆర్వోలు ఇలా ఉద్యోగులు అధికార పార్టీ తరఫున ప్రచారం చేస్తున్నారు. సోమవారం పొదలకూరులోని కాకాణి రమణారెడ్డి కాలనీలో రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత ప్రచారం నిర్వహించారు. ఇందులో తోడేరు, పొదలకూరు ప్రాంతాలకు చెందిన ఆశా కార్యకర్తలు సుమలత, చైతన్య పాల్గొని, కరపత్రాలు పంపిణీ చేయడం విమర్శలకు తావిచ్చింది.

- పొదలకూరు



ఎన్నికల విధుల్లో పొరపాట్లు రానీయొద్దు!


● అధికారులతో కలెక్టర్ హరినారాయణన్



కలువాయిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, తిరుపతి జేసీ

కలువాయి : ఎన్నికల విధులపై అవగాహన పెంచుకుని పొరపాట్లు జరగకుండా పని చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులకు సూచించారు. స్థానిక ఉమామహేశ్వరి కల్యాణమండపంలో మంగళవారం కలెక్టర్, తిరుపతి జాయింట్ కలెక్టర్, వెంకటగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హెచ్.ఎం.ధ్యానచంద్ర ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందితో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించు కునేందుకు అవసరమై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం కలువాయి ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని వారు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, సెక్టార్ అధికారులు, ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దారు సంజీవకుమారి, ఎస్ఐ అయ్యప్ప పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంత చెక్‌పోస్టుల తనిఖీ



వరికుంటపాడు : చెక్‌పోస్టులో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ఉదయగిరి, మార్చి 26: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కోడ్ ఉల్లం ఘిస్తే ఎంతటివారి నైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ కె.తిరుమలేశ్వర రెడ్డి అన్నారు. మంగళ వారం స్థానిక సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేష న్లను తనిఖీ చేసి మాట్లా డారు. కోడ్ అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా సరిహద్దు ప్రాంతాల్లో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 26ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మద్యం, నగదు తరలించకుండా తీసుకున్నామన్నారు. చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి ప్రభుత్వ ఆదేశాలు జారీ చేశామని, తప్పు చేస్తే దండన తప్పదన్నారు. కార్యక్రమంలో సీఐ గిరిబాబు, ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం/వరికుంటపాడు: సీతారామపురం మండలం నారాయణంపేట, చిన్ననాగంపల్లి రహదారులపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట సీఐ గిరిబాబు, ఎస్ఐ అనూష పాల్గొన్నారు. అలాగే వరికుంటపాడు చెక్‌పోస్టు, పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎస్పీ వెంకటరమణ, సీఐ గిరిబాబు, ఎస్ఐ తిరుపతయ్య పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రతి వాహనాన్ని తనిఖీ చేయండి

● ఎస్పీ తిరుమల్లేశ్వరరెడ్డి
● ఎన్నికల చెక్‌పోస్ట్‌ల పరిశీలన

వలేటివారిపాలెం, మార్చి 26: చెక్‌పోస్టు వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని జిల్లా ఎస్పీ తిరుమల్లేశ్వరరెడ్డి తెలిపారు. మండలంలోని మాలకొండ బార్డర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అవసరమైన ప్రతి చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని తెలిపారు. అక్రమ మద్యం, డబ్బు తరలించకుండా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. శాంతిభద్రతలు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం చెక్‌పోస్టు వద్ద రిజిస్టర్లు పరిశీలించారు. అలాగే వలేటివారిపాలెం పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట కందుకూరు డీఎస్పీ శ్రీనివాస్, గుడ్లూరు సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ బాలమహేంద్ర నాయక్ తదితరులు ఉన్నారు.

సరిహద్దు చెక్‌పోస్ట్‌ను పరిశీలించిన ఎస్పీ

మర్రిపాడు: మండంలోని పడమటినాయుడిపల్లి సమీపంలోని నెల్లూరు-కడప జిల్లాల సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను మంగళవారం ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి పరిశీ లించారు. ఇప్పటికే జిల్లాలో 400 వివిధ రకాల కేసులు, సంబంధిత పత్రాలు లేకుండా తీసుకెళ్తు న్న రూ.10 కోట్ల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి తెలిపారు. తనిఖీలల్లో తమిళనాడుకు చెందిన మూడు మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమో దు చేసినట్లు ఎస్‌ఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. తనిఖీలల్లో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



మర్రిపాడు చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

కాకర్ల సురేష్‌ను గెలిపించండి



దుత్తలూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంగళవారం దుత్తలూరులోని బూత్ 108పరిధిలోని టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధుసూదన్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు యనమల, సుబ్బారెడ్డి, వెంగళరావు, నవీన్, వెంకటరామిరెడ్డి, పాతర రవి పాల్గొన్నారు.

స్థలం ఆక్రమించారని ఫిర్యాదు



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 26: దుత్తలూరు సెంటర్‌కు సమీపంలోని 1591 సర్వే నెంబర్‌లో మాదిగల భవన నిర్మాణానికి కేటాయించిన 50సెంట్ల స్థలాన్ని కొందరు చదును చేసి ఆక్రమించి కంచె వేశారని ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం తహసీల్దారు యశోదను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థలా నికి ఉత్తరం వైపున ఉన్న భూ యజమానులు వారి గట్టుపై ఉన్న కంపచెట్లు తొలగించి తాము చదును చేసిన స్థలాన్ని సైతం ఆక్రమించి కంచె వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై భూ యజమానులను ప్రశ్నిస్తే తమపై దౌర్జ న్యం చేస్తున్నారని వాపోయారు. ఆ స్థలంలో పలుమార్లు ఎమ్మార్పీఎస్ సమావేశాలు, జెండా ఆవిష్కరణ సైతం చేశామని గుర్తు చేశారు. ఈ విషయంలో విచారణ చేపట్టి మాకు న్యాయం చేయాలని కోరారు. వారి వెంట ఎమ్మార్పీఎస్ నాయకులు గొల్లపల్లి శ్రీనివాసులు, గొల్లపల్లి మోహన్, గంగపట్ల సింహాద్రి, బర్రె అర్జున్, కొసినిపోగు రవి ఉన్నారు.

1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



మస్తాన్‌వలి, ఎంఈవో

ఉదయగిరి రూరల్, మార్చి 26: మండలంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న పిల్లలు, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాల అర్హు లైన పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మంగళవారం ఎంఈవో-1 షేక్ మస్తాన్‌వలి తెలి పారు. విద్యాహక్కు చట్టం కింద అవకాశం కల్పించినట్లు, ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవా లన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!



తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వరికుంటపాడు: నిత్యం ప్రజలు, వాహనదారులతో రద్దీగా ఉండే ప్రధాన రహదారుల సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి. ఇస్కపల్లి- జడదేవి, ఇస్కపల్లి- విరువూరు గ్రామాలకు వెళ్లే రహదారి కూడలి సమీపంలోని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. దీనితో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు వైపు వెళ్లిన ప్రజలతో పాటు మూగజీవాలు సైతం ఆదమరిచి ఫీజు లింకు వైర్లను తగిలితే ప్ర మాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమా దాలు జరుగకముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కృష్ణంపల్లిలో వైద్యశిబిరం

ఉదయగిరి రూరల్, మార్చి 26: ఆరోగ్యసురక్ష రెండో విడత కార్యక్రమంలో భాగంగా కృష్ణంపల్లి సచివాలయ పరిధిలో మంగళవారం మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు రోగులను పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, వైద్యాధికారిణి వినీత, ఈవోపీఆర్డీ మల్లికార్జున, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

సువిధ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోండి

ఉదయగిరి, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సువిధ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని మంగళవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజా రమేష్‌ప్రేమ్‌కుమార్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థుల నామినేషన్‌లు, ప్రచార అనుమతి, నామినేషన్ల సమర్పణ, బహిరంగ సభలకు 48 గంటలకు ముందుగా ఈ పోర్టల్ ద్వారా అనుమతి తీసుకోవచ్చన్నారు. నియోజకవర్గంలో వాహనాల అనుమతికి లౌడ్ స్పీకర్లు ఏర్పాటు, మీటింగ్‌లు, ర్యాలీలు, కార్యాలయాల ఏర్పాటు, కరపత్రాల పంపిణీ, వీడియోలకు 20దరఖాస్తులు రాగా వాటిలో వివిధ కారణాలతో రెండు దరఖాస్తులు తిరస్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్వో నెహ్రూబాబు పాల్గొన్నారు.

ఇంటింటా లార్వా సర్వే



వివరాలు సేకరిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): కమ్మవారిపాలెంలో డెంగ్యూ సస్పెక్టడ్ కేసు నమోదు కావడంతో మంగళవారం ఉదయగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌జీ నౌషాద్‌బాబు, ఆరోగ్య పర్యవేక్షకులు ఖాజామొహిద్దీన్‌లు సిబ్బందితో కలిసి లార్వా సర్వే చేపట్టారు. 82 నివాసాలను సందర్శించి వివరాలు సేకరించారు. పరిసరాల పరిశుభ్రతకు, దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు మేరకు చేపట్టిన కార్యక్రమంలో సంజీవమ్మ, భవానీ, మానస, నాగేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలువురిపై మతిస్థిమితం లేని వ్యక్తి దాడి



కుటుంబ సభ్యులకు అప్పగించిన యువకులు

ఉదయగిరి, మార్చి 26: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మతిస్థిమితం లేని ఓ యువకుడు మంగళవారం పలువురిపై దాడి చేశాడు. స్థానిక యు వకులు ఆ వ్యక్తిని గుర్తించి బస్టాండ్ సెంటర్‌లో నిలదీయడానికి ప్రయత్నించారు. అప్పటికే ఆ యువ కుడు శరీరంపై నూలు పోగు లేకుండా హల్‌చల్ చేస్తున్నాడు. పసిగట్టిన మహిళలు పరుగులు తీయడంతో వారించేందుకు యత్నించిన పలువు రిపై దాడికి దిగడమే కాకుండా పలు దుకాణాల్లో వస్తువులను విధ్వంసం చేశాడు. యువకులు చాకచక్యంతో అతన్ని బంధించి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. బస్టాండ్ సెంటర్‌లో జరిగిన ఈ ఘటనతో పలువురు బేంబెలెత్తి పరుగులు తీశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి, మార్చి 26: స్థానిక అరుంధతీయవాడకు చెందిన నిరుపేద పొదిలి తిరుపాలు మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లిపోగు ప్రసాద్ గ్రామానికి వెళ్లి కుటుంబసభ్యులకు నగదును అందజేశాడు. కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వ పథాలను అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం బాబు, నాగిళ్ల మహేష్, యర్రగుంట్ల బాబు పాల్గొన్నారు.

గురుకులానికి లింగంగుంట విద్యార్థుల ఎంపిక



అనంతసాగరం, మార్చి 26: లింగంగుంట ఎస్సీ ప్రాథమిక పాఠశాల నుంచి 6గురు విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికైనట్లు మంగళవారం హెచ్‌ఎం అల్లా బక్షు తెలిపారు. ఈ నెల 10న జరిగిన ప్రతిభా పరీక్షలో ఎం.ప్రణవి (ఆదురుపల్లి), ఎస్.శ్రావ్య, ఎస్.సాహితి (సంగం),కే.హేమచంద్ర (చిల్లకూరు), వినయ్ (నాయుడుపేట), మెనీష్ (కోట) గురుకుల పాఠశాలలో ఐదవ తరగతికి ఎంపికైనట్లు చెప్పారు.

మెరుగైన సేవలందించండి

ఏఎస్ పేట, మార్చి 26: గ్రామీణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్యాధికారి ఎం.పెం చలయ్య తెలిపారు. మంగళవారం ఆయన శ్రీకొలనులో నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి తగిన సలహాలు. సూచనలు ఇచ్చారు.

గ్రామాల్లో విజయ సంకల్పయాత్ర

సీతారామపురం, మార్చి 26: నెమళ్ళదిన్నె, జయపురం, దేవిశెట్టిపల్లిలో మంగళవారం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మేకపాటి అభినవరెడ్డి, చింతంరెడ్డి సుబ్బారెడ్డి ,ఎంపీపీ చింతం రెడ్డి పద్మావతి, బాలినేని మాబయ్య, అయ్యవారిపల్లి సర్పంచ్ దుగ్గయ్యకాశయ్యసీతారామపురం ఎంపీటీసీ పాలగిరి అల్లూరురాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు రమణయ్య పాల్గొన్నారు. అనంతరం సీతారామపురంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు.

ఉదయగిరిలో కోడ్ ఉల్లంఘన

ఉదయగిరి, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల కోడ్ పదిరోజులు కిందట అమల్లోకి వచ్చింది. ఈ కోడ్‌ను ఉదయగిరిలో అమల్లోకి తీసురావడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలోని శిలాఫలకంపై వివిధ రాజకీయ పార్టీల నాయకుల పేర్లు ఉన్నా అధికారులు పట్టించుకోలేదు. అలాగే ఉదయగిరి-1 సచివాలయంలోని రైతుభరోసా కేంద్రానికి వైసీపీ రంగులను అధికారులు చూసీచూడనట్లు వెళుతున్నారు.

అవినీతి పరులెవరో తేల్చుకుందామా?

● రక్త చరిత్రతో రాజకీయాల్లోకి వచ్చిన ప్రతాప్ : కావ్య



మాట్లాడుతున్న కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 26: నియోజకవర్గంలో ఎవరు అవినీతిపరులో తేల్చుకునేందుకు సిద్ధమా అని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డిని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రశ్నించారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అవినీతి, అక్రమాలు, రక్త చరిత్రతో రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అని ఆరోపించారు. వచ్చే ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆయన అవినీతి, అక్రమాలు, దందాలపై అన్నికరాల విచారణలు జరిపితే ప్రతాప్ చరిత్ర ఏమిటో ప్రజలకు తెలుస్తోందన్నారు. ప్రజా కోర్టులో నీ చరిత్రకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు. కావలిలో ఎమ్మెల్యే, ఆయన అనుచరులు సుమారు రూ.600 కోట్ల విలువ చేసే 123 ఎకరాలు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని దాని సంగతి త్వరలో బయటకు తీస్తానన్నారు. తాను కొనుగోలు చేసిన భూమికి మధ్యవర్తిత్వం చేసింది ఎమ్మెల్యే కాగా దానిని విక్రయించింది ఎమ్మెల్యే అనుచరులేనని, దానిలో ప్రభుత్వ భూమి ఉంటే సర్వేచేసి తీసుకోవచ్చన్నారు. వైజాగ్‌లో పుట్టిన గంజాయి కావలికి ఎలా వస్తుంది, బ్రెజిల్ నుంచి వచ్చిన మారకద్రవ్యాలు, కావలిలో మహిళల మిస్సింగ్‌లు, హత్యలు అన్నీ బయటకు తీసి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఎన్నికల అఫిడవిట్‌లో 7 కేసులు ఉన్నట్లు పేర్కొని, నాపై ఎలాంటి కేసులు లేవనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు గుత్తికొండ క్రిషోర్, జ్యోతి బాబూరావు, కండ్లగుంట మధుబాబునాయుడు, ఆవుల రామకృష్ణ, బొట్లగుంట శ్రీహరినాయుడు, దేవకుమార్, శ్రీదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో వంటేరు ప్రచారం



మాజీ ఎమ్మెల్యే వంటేరును సన్మానిస్తున్న చేవూరి

జలదంకి, మార్చి 26: కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం జలదంకి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌లకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. జలదంకిలో దగుమాటి మనోహర్‌రెడ్డి ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. సోమవరప్పాడులో పార్టీ నేత చేవూరి జనార్దన్‌రెడ్డి ఇంటికి వెళ్లి కార్యకర్తలు, నాయకులతో చర్చించారు. కోదండరామాపురం, చినక్రాకలో ప్రచారం చేశారు. ఆయన వెంట ఏఎంపీ మాజీ చైర్మన్ ఎంవీ రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వంటేరు జయచంద్రారెడ్డి, బ్రాహ్మణక్రాక సర్పంచు ఇండ్ల సుధాకర్, మాజీ సర్పంచు మద్దూరి శ్రీనివాసులరెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ నేతలకు పరామర్శ

కందుకూరు, మార్చి 26: నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నేతలను ఆపార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ మంగళవారం పరామర్శించారు. అనారోగ్యంగా చికిత్స పొందుతున్న పలువురిని కలిసి పరామర్శించిన రాజేష్, గుడ్లూరు, మోచర్ల, తెట్టు గ్రామాల లో స్థానిక పార్టీ నాయకులతో సమావేశమై పార్టీ పరిస్థితులపై చర్చించారు. పట్టణంలోని 15వ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న బల్లి శ్రీకాంత్‌ను పరామర్శించి మెరుగైన వైద్యం చేయించాలని, తాను అండగా ఉంటానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. గుడ్లూరు గ్రామపార్టీ మాజీ అధ్యక్షుడు కోకా చిరంజీవిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

ఇండియా కూటమితోనే దేశ భవిష్యత్

● సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకటేశ్వర్లు

కావలిటౌన్, మార్చి 26: ఇండియా కూటమితోనే దేశ భవిష్యత్ ముడిపడి ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీపీఎం పట్టణ ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు అధ్యక్షతన జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాదాల మాట్లాడుతూ ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఇండియా కూటమి ఒక్కటే దేశానికి రక్షణ కల్పించగలదన్నారు. ప్రధాని మోదీ పాలన అవినీతిమయంగా మారిందన్నారు. ఎలక్ట్రానిక్ బాండ్ల ద్వారా లక్షల కోట్లు అవినీతి జరిగిందన్నారు. బీజేపీ పెట్టుబడిదారుల నుంచి వేల కోట్లు దోచుకుంటుందని, అవినీతిని ప్రశ్నించినవారిపై అక్రమ కేసులు పెడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నేతలు పెంచలయ్య, తిరుపాల్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ ఎంపిక

ఉలవపాడు, మార్చి 26 : మండలంలోని చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు సుదర్శి భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరుగుతాయని చెప్పారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా సుదర్శి భాస్కరరావు, సుదర్శి బాలకోటయ్య, ప్రధాన కార్యదర్శి ధన్యాసి మణిరాజ్, కోశాధికారి దాసరి సతీష్, సహాయ కార్యదర్శి సుదర్శి నాగేంద్రబాబు, గౌరవ అధ్యక్షుడు ధన్యాసి శ్రీహరి, జూటూరి సుబ్బారావులతోపాటు మరో 7 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రె పిల్లల మృతి

● మరికొన్నింటికి తీవ్ర గాయాలు



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

లింగసముద్రం, మార్చి 26 : మండలంలోని వెంగళాపురంలో కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన గువ్వల వెంకటేశ్వర్లుకు చెందిన గొర్రెల దొడ్డిపై కుక్కలు దాడి చేసి 6 గొర్రె పిల్లలను చంపివేశాయి. మరో 6 గొర్రె పిల్లలను తీవ్రంగా కొరికి గాయపరిచాయి. వాటి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు బాధితుడు చెప్పారు. ఈ గొర్రెల దొడ్డి ఇంటికి దూరంగా ఉండడంతో కుక్కల దాడిని గమనించలేకపోయారు. సాయంత్రం 4 గంటల సమయంలో వెంకటేశ్వర్లు భార్య రమణమ్మ వెళ్లగా గొర్రె పిల్లలు చనిపోయి ఉండడం గమనించి భర్తకు చెప్పడంతో ఆయన వచ్చి చూసి, విషయాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులకు తెలియజేశారు. ఈ సంఘటనతో సుమారు రూ.60 వేల నష్టం వచ్చినట్టు ఆయన తెలిపారు.

5వ వార్డులో పలువురు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరినవారికి కండువా వేస్తున్న ఇంటూరి

కందుకూరు, మార్చి 26: పట్టణంలోని 5వ వార్డు బృందావనం ప్రాంతానికి చెందిన పలు బీసీ, ఎస్టీ కుటుంబాల వారు మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికికీ ఆయన పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దుర్మార్గాలను వ్యతిరేకిస్తూ టీడీపీలో చేరటం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధు, దాసరి ప్రమోద్, గేరా నరేష్, కోటేశ్వరరావు, భానుచంద్రరావు, జంగాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టరు : మహిళ మృతి

● మరో ఇద్దరికి గాయాలు

కందుకూరు, మార్చి 26: మండలంలోని పెదమోపాడు గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం వ్యవసాయ పనులకు కూలీలను తీసుకుని వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న పొగాకు చెక్కుల లోడు ట్రాక్టరు ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పొగాకు చెక్కులను తీసుకుని కందుకూరులోని వేలం కేంద్రానికి వస్తున్న ట్రాక్టరు ఆటోను ఢీకొని ఆగకుండా వెళ్లింది. ఈ ఘటనలో కందుకూరు పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన డాలు లక్ష్మమ్మ(55) అక్కడికక్కడే మృతిచెందగా అదే కాలనీకి చెందిన బూసి లక్ష్మమ్మ, ఉమామహేశ్వరిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టరును గుర్తించిన కందుకూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ గెలుపుతోనే సామాజిక న్యాయం



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీద గిరిధర్

అల్లూరు, మార్చి 26 : టీడీపీ గెలుపుతోనే పేదలకు సామాజిక న్యాయం సాధ్యపడుతుందని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ పేర్కొన్నారు. అల్లూరు పట్టణంలోని 8, 9 వార్డులతో పాటు యర్రపుగుంట, బూదురుగుంట, సింగారెడ్డిదిన్నె, ఉద్దీపగుంట, పేరంటాలమ్మతోపు, గిరిజన కాలనీల్లో మంగళవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కావలి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీలతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, అరగల రమణయ్య, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, నజీర్‌బాషా, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డి ఇంటింటా ప్రచారం

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న తనను గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మంగళవారం పల్లిపాడు, కొండాయగుంట, అల్లిమడుగు తదితర ప్రాంతాల్లో ఆయన సతీమణి శివప్రియతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మన ఓటు మనమే వేసుకుందాం

మన ఓటు మనమే వేసుకొని పేదరికాన్ని నిర్మూలించేందుకు పాటుపడుదామంటూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న ఎల్లు సాల్మన్‌రాజు మండలంలోని గ్రద్దగుంట, అల్లూరు పట్టణంలోని చెర్లోసంఘం, బోడిసత్రం గిరిజన కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, నక్కా గిరి, కప్పల నవీన్ కుమార్, కాకాని రంగయ్య, ఎల్లు సుబ్రహ్మణ్యం, కాలగంధం కిరణ్‌కుమార్, పోట్లూరు నాగేంద్ర పాల్గొన్నారు.

మలిశెట్టికి మాతృవియోగం



ఈశ్వరమ్మకు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కావలి, మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు తల్లి మలిశెట్టి ఈశ్వరమ్మ(75) మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు నేతలు, పట్టణ ప్రముఖులు జనతాపేటలోని మలిశెట్టి నివాసానికి చేరుకుని ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మలిశెట్టి వెంకటేశ్వర్లును పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సాయంత్ర అంత్యక్రియలు వరకు టీడీపీ. జనసేన, బీజేపీ తదితర పార్టీల నేతల పరామర్శలు కొనసాగాయి. టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి అంతిమయాత్రలో పాల్గొని శ్మశానం వరకు నడిచారు. నివాళులు అర్పించి పరామర్శించిన వారిలో మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి, టీడీపీ నాయకుడు మాలేపాటి సుబ్బానాయుడు, పీఎస్సార్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్, తదితరులు ఉన్నారు.

అర్చకులపై వైసీపీ నేత దాడి గర్హనీయం

కందుకూరు, మార్చి 26: కాకినాడ నగరంలోని పెద్ద శివాలయంలో ఇద్దరు అర్చకులపై వైసీపీ నాయకుడు దాడి చేసి కాలితో తన్ని కొట్టడం గర్హనీయమని స్కంధపురి బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షుడు ఇప్పగుంట వెంకటనాగరాజారావు, సంఘం కార్యవర్గ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. వైసీపీ నేత దాడి చాలా దారుణమైన సంఘటన అని, ఇదివరకు గుడులపై దాడి చేసిన వారు ఇప్పుడు గుడిలో ఉన్న అర్చకులపైనే దాడులకు బరితెగించటం, కాలితో తన్నడం చూస్తుంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎంత దయనీయంగా మారి ఉన్నాయో అర్థమవుతోందని పేర్కొన్నారు. అర్చకులు, పురోహితుల జోలికొస్తే రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాలకు తాళాలు వేసుకుని అక్కడే నిరసన కార్యక్రమాలకు పూనుకుంటామని, అవసరమైతే ప్రతిదాడులకు కూడా సిద్ధపడతామని హెచ్చరించారు. భవిష్యత్‌లో మరెక్కడా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండే రీతిలో వైసీపీ నేతను శిక్షించాలని డిమాండ్ చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



కవాతు చేస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

వలేటివారిపాలెం, మార్చి 26 : ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవా లని స్థానిక ఎస్‌ఐ బాలమహేంద్రనాయక్ తెలిపారు. వలేటివారిపాలెంలో మంగళవారం సీఆర్‌పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలలో ఓటర్లలో భయాందోళనకు తావులేకుండా చేయడానికే కవాతు నిర్వహించినట్లు తెలిపారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తునట్లు తెలిపారు.

1 నుంచి దత్తాత్రేయస్వామి మాలాధారణ దీక్ష

లింగసముద్రం : మండలంలోని మొగిలిచెర్ల సమీపంలో ఉన్న దత్తాత్రేయస్వామి మాలాధారణ మండల దీక్ష ఏప్రిల్ 1, 2, 3 తేదీలలో ప్రారంభమవుతుందని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్థ మండల దీక్ష 21, 22 తేదీలలో ప్రారంభమవుతుందని, దీక్ష తీసుకున్న భక్తులకు ప్రతి రోజూ ఆలయం వద్ద భోజన వసతి కల్పిస్తామని పేర్కొన్నారు.